
మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130




ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


**హార్వర్డ్ వర్సిటీలో ప్రారంభమైన సిఎం తరగతులు**

కేంబ్రిడ్జ్: అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనెడీ స్కూల్‌లో (కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్) ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిఆదివారం మధ్యాహ్నం (స్థానిక కాలమానం ప్రకారం) హాజరయ్యారు. తొలి రోజు పరిచయ కార్యక్రమాలతో పాటు 21వ శతాబ్దంలో నాయకత్వం, కోర్సులో భాగంగా అధికార విశ్లేషణ.. నాయకత్వం అంశంపై తొలి సెషన్ ప్రారంభమైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచే తరగతులు ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు (స్థానిక కాలమానం ప్రకారం...) తరగతులు కొనసాగనున్నాయి.


సంపుటి 09, సంచిక: 59 | మంగళవారం | 27-01-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## భారత్ సైనిక పాటవాన్ని చాటిన గణతంత్రం








- అబ్బురపడిన విదేశీ అతిథులు
- శుభాంశు శుక్లాకు ఆశోకచక్ర ప్రదానం చేసిన రాష్ట్రపతి
- తొలిసారి భారత్ పరేడ్‌లో ఇయు సైనిక బృందం

**న్యూఢిల్లీ:** భారతదేశ 77వ గణతంత్ర వేడుకలు సైనిక సామర్థ్యాన్ని, దేశ బహుళ సంస్కృతుల వారసత్వ వైభవాన్ని చాటి చెప్పాయి. న్యూఢిల్లీ కర్తవ్యపథ్‌లో సోమవారం ఉదయం జరిగిన త్రివిధ దళాల కవాతులు, సెంట్రల్ రిజర్వు పోలీస్‌కు చెందిన డేర్ డెవిల్ మోటార్ బైక్ టీమ్, సహస్త్ర సీమా బల్ నారీశక్తి సామర్థ్య విన్యాసాలు, కళా ప్రదర్శనల వేడుకలు చూసి ముఖ్యఅతిథులుగా హాజరైన యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండ ర్ లేయన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా అబ్బురపడ్డారు. వివిధ రాష్ట్రాల శకటాలకు ఉన్న ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను ఉర్సులాకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వివరించి చెప్పారు. 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న 'వందేమాతర గీతం' నృత్య ప్రదర్శన, భారత మిలిటరీ సైనిక చర్య ఆపరేషన్ సిందూర్ నమూనాలు,ఆపరేషన్ సిందూర్‌కు ఉపయోగించిన దేశీయ క్షిపణులు, శక్తిమంతమైన రక్షణ ఆయుధాలు, కొత్తగా చేరిన యూనిట్లు, నౌకాదళ, వాయుసేన శకటాలు ఈసారి వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అన్ని కాలాలలో ఎల్లవేళలా రక్షణగా ఉండే అజయ్‌కేతు వాహనం, రణ్‌ధ్వజ్ వ్యూహాత్మక రవాణా వ్యవస్థ,ధావన్‌సక్ తేలికపాటి యుద్ధ తరువాయి 2లో

## రాజ్యాంగం ద్వారానే ప్రజలకు హక్కులు, బాధ్యతలు

- బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడమే రాజ్యాంగ నిర్మాతలకు నిజమైన నివాళులు
- హైదరాబాద్ ప్రతిష్టను పెంచేలా 'తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్-2047'
- 'మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ' లక్ష్యంగా ముందుకెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలు





ప్రజాపక్షం/హైదరాబాద్

గత రెండేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమం, వ్యవసాయం, మౌలిక వసతులు, డిజిటల్ విద్య, ఐటి రంగంలో విశేష పురోగతిని సాధించిందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. 'రాజ్యాంగం ప్రజలకు హక్కులతో పాటు బాధ్యతలను కూడా కల్పించింది. ఆ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడమే రాజ్యాంగ నిర్మాతలకు మనం అర్పించే నిజమైన నివాళి' అని అన్నారు. హైదరాబాద్ ప్రతిష్టను పెంచే విధంగా 'తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్2047' ఉన్నదని, ఈ డాక్యుమెంట్‌లో సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని, 'మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ' లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు కొనసాగుతోందన్నారు. "భారత 77వ గణతంత్ర దినోత్సవం' సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో సోమవారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు అమర జవాన్లకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సైనికాధికారులు నివాళులు అర్పించారు. అనంతరం పరేడ్ మైదానంలో గవర్నర్ సైనికుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 62,749 ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రైవేట్ సంస్థలతో సమాంతరంగా పోటీపడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం సరఫరా చేస్తున్నదని, దేశంలోనే సన్న బియ్యం సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. మహిళలకు బ్యాంకుల ద్వారా రూ.40 వేల కోట్ల రుణాలను సమకుర్చిందని, 7,450 కిలో మీటర్ల పంచాయతీ రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేయనుందని, తొలి విడత కోసం రూ.11,399 కోట్లు కేటాయించిందని వివరించారు. రాష్ట్రాన్ని సమతుల్య అభివృద్ధి దిశగా మూడు ఆర్థిక మండలాలుగా తరువాయి 2లో



## పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- ప్రజా ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి పెద్దపీట
- రెవెన్యూ, సమాచార పౌర శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, మరిపెడ మున్సిపల్ కేంద్రాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం / మహబూబాబాద్/తొర్రూరు

ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర హౌసింగ్, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, మరిపెడ మున్సిపల్ కేంద్రాల్లో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మరిపెడలో వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతోందని, రైతును రాజు చేయాలనే రైతులకు సంబంధించి రైతు బీమా, రైతు భరోసా, వివిధ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా దాదాపు రూ.3 కోట్ల వ్యయంతో మరిపెడ డివిజన్‌లో వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం అందుకు నిదర్శనమని, దశలవారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకొనుటకు ఐదు లక్షల తరువాయి 2లో

## బిజెపికి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగం మారిపోయేది!

- మెజారిటీ రాకపోవడం వల్ల రాజ్యాంగం రక్షించబడుతోంది
- ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సమాఖ్య స్ఫూర్తికి బిజెపి ప్రభుత్వం తిలోదకాలు
- ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పరిపాలన
- జాతీయ జెండా ఆవిష్కరణలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపి ఆశించినట్లుగా గత పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు వచ్చి ఉంటే ఇప్పటికే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా తిరగ రాసేందుకు సకల ప్రయత్నాలు చేసి ఉండేదని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి అన్నారు. మెజార్టీ రాకపోవడం వల్ల రాజ్యాంగం రక్షించబడుతోందని ఆయన పేర్కొన్నారు. భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో ఘనంగా నిర్వహించారు. పల్లా వెంకట రెడ్డి జాతీయ పతకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహా, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, నేదునూరి జ్యోతి, ఎస్.ఛాయా దేవి, సిపిఐ రాష్ట్ర నాయకులు ప్రేమ్‌పావని, పల్లె నర్సింహ్మా, రాపోలు సుదర్శన్, ఎం.అనిల్ కుమార్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, తరువాయి 12లో




## నేడు బ్యాంకుల సమ్మె

- ఐదు రోజుల పని కోసం ఉద్యోగుల డిమాండ్..
- ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నిలిచిపోనున్న సేవలు

**న్యూఢిల్లీ:** ఐదు రోజుల పని వారాన్ని తక్షణమే అమలు చేయాలనే డిమాండ్‌తో జనవరి 27న దేశవ్యాప్త సమ్మెకు వెళ్లాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) నిర్ణయించడంతో, మంగళవారం దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలు, సేవలు నిలిచిపోయే అవకాశం ఉంది. అధికారులు, ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే తొమ్మిది యూనియన్ల సమాఖ్య యుఎఫ్‌బియు ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. జనవరి 23న ప్రధాన కార్మిక కమిషనర్‌తో జరిగిన సమావేశం సానుకూల ఫలితం ఇవ్వకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనితో, ఇప్పటికే ఆది, సోమ (గణతంత్ర దినోత్సవం) వారాల్లో పనిచేయని తరువాయి 12లో



## విద్యుత్ బిల్లు ఉపసంహరణకు రైతుల ట్రాక్టర్ ర్యాలీలు

**హోషియార్‌పూర్/మోగా :** విద్యుత్ (సవరణ) బిల్లు, 2025 ఉపసంహరణతో సహా తమ డిమాండ్ల సాధనకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు సోమవారం పంజాబ్‌లోని అనేక చోట్ల ట్రాక్టర్ మార్చ్‌లు నిర్వహించారు. 2021లో న్యూఢిల్లీలోని ఎర్రకోటను ముట్టడించిన రోజున, ప్రస్తుతం రద్దు చేయబడిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వేలాది మంది రైతులు బారికేడ్లను తోసేసి ముందుకు వెళ్తుండగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. విద్యుత్ (సవరణ) బిల్లు 2025, విత్తనాల బిల్లు 2025, కార్మిక కోడ్‌లను రద్దు చేయడం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎం.నరేగా) పునరుద్ధరణ, పంటలపై కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కోసం చట్టపరమైన హామీని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రదర్శనలు నిర్వహించారు. హోషియార్‌పూర్‌లో దోబా కిసాన్ కమిటీ సభ్యులు ముకేరియాన్‌లో తరువాయి 12లో

## బాలిక ప్రాణం తీసిన చైనా మాంజా

ప్రజాపక్షం/హైదరాబాద్




తండ్రితో కలిసి బైక్‌పై వెళ్తున్న ఐదేళ్ల చిన్నారిని చైనా మాంజా బలి తీసుకున్న విషాదకర సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా ఖాజీపల్లి నుంచి తండ్రితో పాటు ఇద్దరు కుమార్తెలు సోమవారం ద్విచక్రవాహనంపై కూకట్‌పల్లి వైపు వెళ్తున్నారు. వివేకానందనగర్ వద్దకు రాగా నే, చైనా మాంజా బాలిక నిష్విక ఆదిత్య(5) మెడకు చుట్టుకుని కిందపడిపోయింది. మెడకు తీవ్ర గాయం కావడంతో గమనించిన స్థానికులు సమీప ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు బాలిక అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, సంక్రాంతి నేపథ్యంలో చైనా తరువాయి 12లో

## తగ్గనున్న బిఎండబ్ల్యు, మెర్సిడెస్ కార్ల ధరలు?




- దిగుమతి సుంకాలను 40 శాతం తగ్గించనున్న భారత్!
- నేడు భారత్ – ఇయుల మధ్య ఎఫ్‌టిఎ ప్రకటన
- భారత వస్త్రాలు, పాదరక్షలపై దిగుమతి సుంకం తగ్గించనున్న ఇయు?



**న్యూఢిల్లీ :** ఐరోపా దేశాల కూటమి యూరోపియన్ యూనియన్ (ఇయు)లో తయారైన కార్లపై భారతదేశం దిగుమతి సుంకాలను 40 శాతానికి తగ్గించనుంది. ప్రస్తుతం ఇది 110 శాతంగా ఉంది. ఇది ఫోక్స్‌వ్యాగన్, రెనో, మెర్సిడెస్, బిఎండబ్ల్యు కార్ల ఉత్పత్తిదారులకు ఊతమివ్వనుంది. ఈ మేరకు మంగళవారం భారత్, 27 ఐరోపా దేశాల కూటమి మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టిఎ) ప్రకటించే అవకాశం ఉన్నట్లు 'రాయ్‌టర్స్' సంస్థ ఒక కథనంలో పేర్కొంది. ప్రస్తుతం ఐరోపా కార్లపై దిగుమతి సుంకాలు 15వేల యూరోలకు పైగా ఉన్నాయని, ప్రధాని మోదీ ప్రభుత్వం తక్షణమే పరిమిత సంఖ్యలో కార్లపై పన్నును తగ్గించేందుకు అంగీకరించినట్లు అభిజ్ఞవర్గాల తెలిపాయని రాయటర్స్ వెల్లడించింది. ఏటా 2 లక్షల కార్లపై 40 శాతం దిగుమతి సుంకాలు తగ్గనున్నట్లు పేర్కొంది. అదే సమయంలో ఐదేళ్ళ పాటు ఎలక్ట్రిక్ వాహనాలపై దిగుమతి సుంకాలను తగ్గించే అవకాశం లేదు. ఆ తరువాత వాటికి కూడా సుంకాలు తగ్గుతాయి. కాగా, బదులుగా భారత వస్త్ర, పాదరక్షలపై ఇయు దిగుమతి సుంకాలను తగ్గించే తరువాయి 2లో

## అమెరికా 23 రాష్ట్రాల్లో మంచు తుఫాను బీభత్సం

### పలుచోట్ల 14 మంది మృతి, అంధకారంలో లక్షలమంది



**వాషింగ్టన్ :** అమెరికాలో గడచిన మూడు రోజులుగా మంచు తుఫాను బీభత్సం సృష్టిస్తోంది. టెక్సాస్ నుండి న్యూ ఇంగ్లాండ్ వరకూ దేశంలో వీధులన్నీ స్తంభించాయి. జనజీవనం ఆగిపోయింది. రోడ్లపై మంచు మేటలు వేసింది. మంచు తుఫాను, చలితో 14మంది మరణించారు. న్యూయార్క్‌లో మంచు బారినపడి ఐదుగురు మరణించినట్లు మేయర్ మమ్దానీ చెప్పారు. మరణించినవారిని ఇళ్లులేని పేదలుగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. లూసియానాలో హైపోథెర్మియా కారణంగా ఇద్దరు మరణించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. టెక్సాస్‌లో 16 ఏళ్ల బాలిక ప్రయాణ సమయంలో మంచు తుఫానుకు బలైంది. అనేక రాష్ట్రాలలో లక్షలమంది ప్రజలు విద్యుత్ సరఫరా లేక అంధకారంలో ఉండిపోయారు. సోమవారం 11,000 విమానాలు రద్దయ్యాయి. మరో 2,500 అదనపు విమానాలను కూడా రద్దు చేశారు. వేలాదిమంది ప్రయాణికులు ఎటూపాలుపోక విమానాశ్రయాల్లో నిలిచిపోయారు. స్కూళ్లు, దుకాణాలు కూడా బుధవారం వరకూ మూతబడ్డాయి. టెన్నెసీ, మిస్సిస్సిప్పీ,లూసియానా,జార్జియా,టెక్సాస్ సహా అనేక దక్షిణ రాష్ట్రాలలో ఉష్ణోగ్రతలు మైనస్ స్థాయికి పడిపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకున్నాయి. ఈశాన్య అమెరికా నుండి దక్షిణప్రాంతం వరకూ దాదాపు 23 రాష్ట్రాలు మంచు తుఫాను,వర్షాలు,చలి వాతావరణంలో బిగుసుకుపోయాయి. కొన్ని ప్రాంతాల్లో చలిగాలులు మైనస్ 20 నుండి మైనస్ 30 ఫారిన్‌హీట్‌లో ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ 40 డిగ్రీలుగా నమోదైనట్లు సిఎన్‌బిసి పేర్కొంది. దేశంలో 213 మిలియన్ ప్రజలు ఈ మంచు తుఫాను పరిధిలో చిక్కుకున్నట్లు అమెరికా జాతీయ వాతావరణ విభాగం తెలియజేసింది. ఆర్కాన్సస్‌లో మంచు ఎనిమిది అంగుళాల మందాన పేరుకుపోగా, ఇల్లినోయిస్, ఒహియో ప్రాంతాలలో 11 అంగుళాల మందాన పేరుకుపోయింది. ఇండియానాలో 13 అంగుళాలు, కాన్సాస్‌లో ఎనిమిది అంగుళాల మందాన మంచు గడ్డకట్టింది. మిస్సోరిలో 12 అంగుళాలు, ఓక్లహోమాలో ఏడు, టెక్సాస్‌లో ఆరు, టెన్నెస్సీలలో ఐదు అంగుళాల మందాన వీధుల్లో మంచు పేరుకుపోయింది. డేవిడ్‌సన్ కౌంటీలో ఆకస్మికంగా విద్యుత్ పోవడంతో 70వేల నివాసాలు అంధకారంలో ఉండిపోయినట్లు ఒక జాతీయుడు చెప్పా డు. కాగా ప్రజలు ముందుగానే ఆహారం నిల్వచేసుకున్నారు. న్యూయార్క్‌సిటీ 96 వీధిలోని సూపర్ మార్కెట్ యజమాని మాట్లాడుతూ, తన దుకాణంలో మొత్తం వస్తువులన్నీ విక్రయించానని, తన దుకాణం ప్రస్తుతం ఖాళీగా ఉందని చె ప్పారు.

## మెక్సికోలో కాల్పులు:11మంది మృతి

**మెక్సికోసిటీ :** సెంట్రల్ మెక్సికోలో జరిగిన కాల్పుల్లో 11 మంది హతులయ్యారు. కాల్పులకు పాల్పడినవారికోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మెక్సికో నగరం సలమంకలోని ఒక సాకర్ ఫీల్డ్‌లో సాయుధ దుండగులు జరిపిన కాల్పుల్లో 11 మంది మరణించగా, మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. మేయర్ సీజర్ ప్రిటో ఫేస్‌బుక్‌లో ఒక పోస్టింగ్ పెడుతూ, దాదాపు ఆట ముగింపు దశకు చేరుకున్న సమయంలో సాయుధులు సాక ర్ ఫీల్డ్‌లోకి ప్రవేశించారని, గాయపడినవారిలో ఒక మహిళ, ఒక బిడ్డ కూడా ఉన్నారని పేర్కొంటూ, దీనిని పిరికి చర్య అని విమర్శించారు. లోమాడి ఫ్లోర్స్ ప్రాంతంలో ఆట జరుగుతుండగా ఘటన జరిగింది. రాష్ట్రం ఎదుర్కొంటున్న విస్తృతహింసలో భాగమైన ఈ ఘటన సామాజిక విచ్ఛిన్నానికి ఒక సంకేతమన్నారు.

# భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని అడ్డుకుంటున్న వైట్‌హౌస్

### వెలుగుచూసిన రిపబ్లికన్ సెనేటర్ టెడ్ క్రజ్ ఆడియో



**వాషింగ్టన్ :** భారత్‌తో వాణిజ్య ఒప్పందం జరగకుండా వైట్‌హౌస్ అడ్డుకుంటోందని ట్రంప్ రిపబ్లికన్ పార్టీకి చెందిన టెక్సాస్ సెనేటర్ టెడ్ క్రజ్ విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, వైట్ హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో భారత్‌తో వాణిజ్య ఒప్పదం జరగకుండా అడ్డుకుంటున్నారని క్రజ్ ఆరోపించినట్లు అమెరికా మీడియా పేర్కొంది. భారత్‌పై 25 శాతం సుంకాలు తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ ఇటీవల సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో దాదాపు ఆరునెలల క్రితం క్రజ్ చెప్పారన్న ఆడియో బయట పడటంతో భారత్–అమెరికా మధ్య కొత్త ఆటంకాల పరిస్థితి వచ్చింది. రెండుదేశాల మధ్య గత ఏడాదిలో ఆరేడుసార్లు వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిగాయి. అమెరికా వాణిజ్య ప్రతినిధుల బృందం భారత్‌కు వచ్చి చర్చలు జరిపింది. భారత్ బృందం అమెరికా వెళ్లి చర్చలు కొనసాగించింది. ముఖ్యంగా భారత్ వ్యవసాయ మార్కెట్‌లో ప్రవేశించేందుకు అనుమతించాలని ట్రంప్ పట్టుపడుతున్నారు. జన్యుపరంగా మార్పిడి చేసిన వ్యవసాయ ఉత్పత్తులను భారత్‌లోకి డంప్ చేసేందుకు అమెరికా ప్రయత్నం చేస్తోంది. వ్యవసాయ మార్కెట్‌లోకి అమెరికా ప్రవేశాన్ని భారత్ తిరస్కరించడం చర్చల్లో ఒప్పందానికి ప్రధాన ఆటంకంగా ఉందని భావిస్తున్నారు.

ఈ విషయాలన్నీ ట్రెడ్ క్రజ్ దోనర్లతో మాట్లాడినప్పుడు ప్రముఖంగా ప్రస్తావించారు. ఒకవైపు పదే పదే మోదీ గొప్ప వ్యక్తి అని, గొప్ప నాయకుడని ప్రశంసిస్తూ, మరో వైపు విమర్శలు చేయడం, వాణిజ్య ఒప్పందానికి వెనుకాడటం ఏమిటో అర్థం కావడంలేదని దోనర్లతో జరిగిన ప్రైవేటు సమావేశంలో క్రజ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భారతదేశంతో వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడంలేదని, ఊగిసలాడుతున్నారని, ఈ ఒప్పందాన్ని వైట్‌హౌస్ ఇప్పటికే ఆమోదించాల్సి ఉండగా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఒప్పందం చేయడంలో ఎవరు ఆటంకంగా ఉన్నారని దోనర్లు ప్రశ్నించినప్పుడు కొన్నిసార్లు ట్రంప్‌తో పాటు పీటర్ నవారో, జె.డి.వాన్స్ ఉన్నారని క్రజ్ చెప్పారు. గత ఏడాది రెండో అర్థభాగంలో పదినిమిషాల సేపు జరిగిన ఈ సంభాషణ ఆడియో ఉన్నట్లు అమెరికా మీడియా పేర్కొందని, అయితే తాము దీనిని స్వతంత్రంగా తనిఖీ చేయలేదని పిటిఐ వార్తాసంస్థ వెల్లడించింది. టారిఫ్‌లే కాకుండా ఇతర అంశాలు కూడా రెడు దేశాలమధ్య ఉన్నాయి.

గత ఏడాది మే నెలలో భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ముగించానని ట్రంప్ ఇప్పటికి అనేకసార్లు చెప్పారు. ప్రతిసారి భారత్ దీనిని ఖండించింది. పాకిస్థాన్‌పై భారత్ దాడులు విరమించడంలో మూడోదేశం జోక్యం లేదని పదే పదే స్పష్టం చేసింది. ట్రంప్‌కు నరేంద్రమోదీ నేరుగా ఫోన్ చేసి మాట్లాడకపోవడంవల్లనే వాణిజ్య ఒప్పందం కుదరలేదని ఈనెలారంభంలో అమెరికా వాణిజ్యమంత్రి హోవర్డ్ లుత్నిక్ చెప్పారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేయడంవల్ల ట్రంప్ ఎంతమాత్రం సంతోషంగా లేరని మోదీకి తెలుసునని, తాము టారిఫ్‌లు పెంచుతామని కూడా తెలుసునని ట్రంప్ అంతకుముందు వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్న సమయంలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2028లో రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు టెక్సాస్ రిపబ్లికన్ సెనేటర్ టెడ్ క్రజ్ చాలా ఆసక్తిగా ఉన్నారు. ట్రంప్ టారిఫ్‌లు అమెరికా ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తాయని, ఈ విధానాలు చివరకు ఆయనను న్యాయస్థానంలో శిక్షకు గురిచేసేవిగా మారతాయని కూడా క్రజ్ వ్యాఖ్యానించారు. గత ఏడాది ఏప్రిల్ నెలలో ట్రంప్ అన్ని దేశాలపై వరుసగా టారిఫ్‌లను భారీగా పెంచడం ప్రారంభించారు. ఈ టారిఫ్‌ల భారాలు విధించకుండా వెనక్కు తగ్గాలని ఆనాడే కొందరు రిపబ్లికన్ సెనేటర్లు ఆయనకు సలహా ఇచ్చారు. భారత్ నుండి దిగుమతి చేసుకునే సరుకులపై 50 శాతం మేరకు సుంకాలు పెంచడంతో అమెరికాతో భారత్ సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రష్యా నుండి చమురు దిగుమతి చేసుకుంటున్నారన్న ఆరోపణలతో విధించిన 25 శాతం అదనపు సుంకాలు కూడా ఇందులో ఉన్నాయి.

## అమెరికా సెక్యూరిటీ ఒప్పందం సిద్ధం: జెలెన్‌స్కీ



**విల్నియస్ :** ఉక్రేన్‌కు అమెరికా భద్రతాహామీకి సంబంధించిన పత్రాలు సంతకం చేయడానికి సిద్ధంగా ఉన్నాయని ఆ దేశ అధ్యక్షుడు వోలోడిమైర్ జెలెన్‌స్కీ చెప్పారు. అమెరికా, రష్యా ప్రతినిధులతో అబుదాబిలో రెండురోజులపాటు జరిగిన చర్చల తర్వాత జెలెన్‌స్కీ ఈ విషయం చెప్పారు. లిథుయేనియాలో పర్యటన సందర్భంగా విల్నియస్‌లో జెలెన్‌స్కీ పాత్రికేయులతో మాట్లాడుతూ, తన భాగస్వామ్యదేశాలు సంతకాలు చేయడానికి వీలుగా ఒక తేదీని ప్రకటించడంకోసం ఉక్రేన్ ఎదురుచూస్తోందని చెప్పారు. ఉక్రేన్, అమెరికా పార్లమెంటులు ఈ భద్రతా హామీ పత్రాలను సమ్మతించిన తర్వాత ఈ సంతకాలు జరుగుతాయి. అదేవిధంగా 2027 నాటికి యూరోపియన్ యూనియన్‌లో ఉక్రేన్ సభ్యత్వం పొందేవిధంగా తాము గట్టి కృషి చేస్తామని జెలెన్‌స్కీ మరోసారి నొక్కి చెప్పారు. అయితే ఉక్రేన్–రష్యా మధ్య శాంతి చర్చల్లో రష్యాకు ఆటంకంగా ఉన్న రెండు ప్రధానాంశాల్లో ఇదొకటి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉక్రేన్‌కు యూరోపియన్ యూనియన్‌లో సభ్యత్వం ఇవ్వకూడదని రష్యా పట్టుపడుతున్నది. ఆక్రమిత భూభాగాలను తమకు స్వాధీనం చేయడంతో పాటు శాంతి సేనల పేరుతో ఉక్రేన్‌లో అంతర్జాతీయ దళాలు ఉండటాన్ని కూడా పుతిన్ వ్యతిరేకిస్తున్నారు అబుదాబిలో మొట్టమొదటిసారి ఉక్రేన్–అమెరికా–రష్యా ప్రతినిధుల మధ్య జనవరి 24,25 తేదీలలో రెండురోజులపాటు త్రైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ఉక్రేన్, రష్యాకు చెందిన సైనిక, దౌత్య ప్రతినిధులు పాల్గొన్నారు. తమ దేశ సార్వభౌమాధికారాన్ని సంపూర్ణంగా గౌరవించాలని, రష్యాతో కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత తమ దేశానికి అమెరికా పూర్తి భద్రత ఇవ్వాలని జెలెన్‌స్కీ కోరుతున్నారు. ఈ రెండు దేశాలమధ్య శాంతి ఒప్పందం కుదరడంలో భూభాగాంశమే ప్రధాన ఆటంకంగా మారింది. గడచిన గురువారం (జనవరి 22) ట్రంప్ తరపు దూతలు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్‌లు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సుదీర్ఘ మంతనాలు చేశారు. ఉక్రేన్‌తో శాంతి ఒప్పందం చేసుకోవాలంటే, తూర్పు ప్రాంతం నుండి ఆ దేశ సైన్యం వెనక్కు వెళ్లిపోవాలని పుతిన్ కోరుతున్నారు. జెలెన్‌స్కీని ఈ విషయంలో ఒప్పించేందుకు ట్రంప్ ప్రయత్నం చేస్తుండగా రష్యా కూడా రాజీకి సిద్ధంగా ఉండాలని జెలెన్‌స్కీ కోరుతున్నారు.

**అబుదాబి చర్చల్లో పురోగతి లేదు..**

అబుదాబిలో ఉక్రేన్–అమెరికా–రష్యా ప్రతినిధులమధ్య రెండు రోజుల చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని రష్యా విదేశాంగ శాఖ సహాయమంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ చెప్పారు. టాస్ వార్తాసంస్థతో ఆయన మాట్లాడుతూ, అమెరికాలో ఉన్న రష్యా దౌత్య ఆస్తులపై ఆంక్షలు తొలగించడం, విమానాల రాకపోకలకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదన్నారు. ''ఇవన్నీ చికాకు కలిగించే విషయాలు, దౌత్య ఆస్తులను విడుదల చేయడం, విమానాల రాకపోకలను పునరుద్ధరించడంపై ఎలాంటి ఒప్పందం జరగలేదు'' అన్నారు. ర ష్యా అధ్యక్ష భవనంలో పరిపాలనావిభాగం డి ప్యూటీ అధిపతి మాగ్జిమ్ ఒరెష్కిన్ మాట్లాడు తూ, అమెరికాలో స్తంభించిన రష్యా ఆస్తులపై ఆంక్షలు ఎత్తివేస్తే వాటిని ఎలా సద్వినియోగం చేయాలో తాము మార్గదర్శకం చేస్తామన్నారు. ఈ ఆస్తులలోంచి 100 కోట్ల డాలర్లు తీసి గాజా బోర్డ్ ఆఫ్ పీస్‌కు ఇవ్వాలని పుతిన్ చెప్పారన్నారు.

## ఫిలిప్పీన్స్‌లో ఫెర్రీ మునక.. 15మంది మృతి, 28మంది గల్లంతు



**మనీలా :** దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఒక ఫెర్రీ మునిగిపోవడంతో 15 మంది మరణించారు. మరో 28 మంది గల్లంతయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో ఈ ఫెర్రీలో 350 మంది ప్రయాణం చేస్తున్నారు. ప్రమాదంలో గల్లంతైన వారికోసం భారీ ఎత్తున గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బాసిలన్ రాష్ట్రం బాలుక్–బాలుక్ గ్రామానికి రెండు కి.మీ సమీపంలో ఆదివారం అర్థరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం జరిగింది. రేవు నగరం జాంబోంగా నుండి బయలుదేరిన ఎంవి త్రిష కెర్సిన్–2 ఫెర్రీ దక్షిణ సులులోని జోలో ద్వీపానికి వెళుతుండగా సముద్రంలో మునిగిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో 27 మంది సిబ్బందితోపాటు 332 మంది ప్రయాణికులు ఫెర్రీలో ఉన్నారని ఫిలిప్పీన్స్ తీరప్రాంత గస్తీ దళాలు తెలిపాయి. గడచిన అర్థరాత్రి నుండి సోమవారం మధ్యాహ్నం వరకూ 316 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు సదరన్ మిండనాయో జిల్లా తీరప్రాంత గస్తీదళ కమాండర్ రోమెల్ దుయా చెప్పారు. జాడ తెలియకుండా పోయినవారికోసం నౌకాదళం, గస్తీ హెలికాప్టర్లు ఉమ్మడిగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. మితిమీరిన బరువుగానీ, ప్రతికూల వాతావరణంగానీ బోటు మునిగిపోవడానికి కారణం కాదని, అసలు కారణం తెలియలేదని చెప్పారు. బాసిలిన్ గవర్నర్ ముజివ్ హతమన్ బాధితులకు సిబ్బంది సేవలు చేస్తున్న దృశ్యాలను ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ చేశారు.

## గణతంత్రం

(మొదటి పేజీ తరువాయి)



వాహనాలు, మనుషులు లేని స్వయం చలిత యుద్ధ వాహనాలు, రోబోటిక్ డాగ్‌లను ప్రదర్శించారు. ఈ పరేడ్ వేడుకల్లో కనిపించిన రాజస్థాన్ ఒంటెల బృందం, విభిన్న సాంస్కృతిక కళాప్రదర్శనలు చూసి ముఖ్యఅతిథులు ఆశ్చర్యపోయారు. ''భిన్నత్వంలో ఏకత్వం'' అనే ఇతివృత్తంతో 100 మంది కళాకారుల ప్రదర్శన దేశ ఐక్యతను ప్రతిబింబింబించింది. కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ భవనీశ్ కుమార్ (ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్) ఈ ఏడాది పరేడ్‌కు నాయకత్వం వహించారు. మొట్టమొదటిసారి యూరోపియన్ యూనియన్‌కు చెందిన సైనిక సిబ్బంది పతాకం,ఆపరేషన్ ఆట్లాంటా–ఆస్ప్రైడ్స్,గ్రూపింగ్ నేవల్ ఆపరేషన్స్ బృందం కూడా భారత గణతంత్ర పరేడ్‌లో పాల్గొంది.

అశ్విక దళం వెంట వస్తుంటే, గుర్రాలకు సంధానించిన సంప్రదాయ బగ్గీలో భద్రతా సిబ్బంది రక్షణలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము విదేశీ ప్రతినిధులతో కలిసి సభావేదిక దగ్గరకు చేరుకున్నారు. తర్వాత ఆమె జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పరేడ్ వేడుకలు ప్రారంభించడానికి ముందుగా, శుభాంషు శుక్లాకు రాష్ట్రపతి అశోక చక్ర పతకాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన తొలి భారతీయ వ్యోమగామిగా గత ఏడాది జూన్‌లో శుభాంషు శుక్లా చరిత్ర సృష్టించారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా కేంద్రమంత్రులు, దేశ త్రివిధ దళాల ఉన్నతాధికారులు, విదేశీ దౌత్యవేత్తలు,సీనియర్ అధికారులు, విభిన్న రంగాలకు చెందిన మొత్తం 10,000 మంది ప్రత్యేక అతిథులు కర్తవ్యపథ్‌లో జరిగిన వేడుకలను తిలకించి పులకించారు. నాలుగు హెలికాప్టర్లు కర్తవ్యపథ్‌లో సభికులపై పూలవర్షం కురిపించాయి. యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు, సాయుధ బలగాల్లో నారీశక్తిబృందాల మోటారు సైకిల్ విన్యాసాలు, ఆపరేషన్ సిందూర్ జెండాలను ప్రదర్శించిన ధ్రువ్ హెలికాప్టర్లు, మానవరహిత దివ్యాస్త్ర ప్రదర్శనలు, డ్రోన్ ప్రదర్శనలు కర్తవ్యపథ్‌కు కొత్త అందాలు తెచ్చి దేశీయ సామర్థ్యాన్ని చాటి చెప్పాయి. 30 వేలమంది భద్రతాసిబ్బంది, పోలీసులు, డ్రోన్లు, నిఘా నేత్రాల మధ్య విజయవంతంగా ఈ వేడుకలు పూర్తయ్యాయి.ఏటేటా జరుగుతున్న ఈ వేడుకలు ఈసారి భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, భిన్నత్వంలో ఏకత్వాన్ని, అమెరికా,రష్యాలకు చెందిన రక్షణరంగ వ్యవస్థలను కూడా ప్రదర్శించారు. బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులు, ఆకాశ్ ఆయుధ వ్యవస్థ సూర్యాస్త్ర, సార్వత్రిక రోదసీవవాహక నౌకా వ్యవస్థ, ప్రధాన యుద్ధ శకటం అర్జున్, పదాతిదళ తుపాకులు ధనుష్, దివ్యాస్త్రవ్యవస్థలు వేడుకల్లో ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. 30 విభాగాలకు చెందిన శకటాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వీటిల్లో 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన శకటాలు, వివిధ మంత్రిత్వశాఖలు,ప్రభుత్వ విభాగాలకు చెందిన 13 శకటాలు కనువిందు చేశాయి.

గత ఏడాది మే నెలలో ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత సైన్యం మోహరించిన ప్రధాన ఆయుధ వ్యవస్థల నమూనాలతో కూడిన త్రివిధ దళాల శకటం ఈ వేడుకలలో ప్రధాన ఆకర్షణగా మారింది. బ్రహ్మోస్–ఎస్–400 క్షిపణులు వంటివాటిని ఆపరేషన్ సిందూర్‌లో ఉపయోగించారు.త్రివిధ దళాల సమగ్ర నిర్వహణా కేంద్రం నమూనాలను ఈ శకటంపై ప్రదర్శించారు. భారత సైన్యం యుద్ధ నమూనాను మొదటిసారి ఈ పరేడ్‌లో ప్రదర్శించారు. ఇందులో గగనతల వ్యవస్థను కూడా జోడించారు. యుద్ధ యూనిఫాంలో 61వ దళాన్ని ప్రదర్శించారు. తేలికపాటి ధ్రువ హెలికాప్టర్లను, దేశీయ అస్త్రాలను ప్రదర్శించారు. టి–90 భీష్మ,ప్రధాన యుద్ధ శకటం అర్జున్‌లు భూతలంపై కర్తవ్యపథ్‌లో పురోగమిస్తూ ఉంటే గగనతలంలో వాటికి మద్దతుగా ఆపాచీ ఎహెచ్–64 ఇ, ప్రచండ్ తేలికపాటి యుద్ధ హెలికాప్టర్లు చక్కెర్లు కొట్టాయి. బిఎంపి–2 పదాతిదళ వాహనాలతో పాటు నాగ్ క్షిపణి వ్యవస్థ ఎంకె–2ను కూడా ప్రదర్శించారు.

లెఫ్టినెంట్ కరణ్ నాగ్యాల్ కమాండర్ హోదాలో ఆయన నాయకత్వాన 144 మంది యువ నావికాదళ బృందం పరేడ్‌లో పాల్గొంది. లెఫ్టినెంట్ పవన్ కుమార్ గంది, లెఫ్టినెంట్ ప్రీతీ కుమారి, లెఫ్టినెంట్ వరుణ్ ద్రేవవేరియాలు ప్లటూన్ కమాండర్లుగా వ్యవహరించారు. నావికాదళ సామర్థ్యాన్ని చాటి చెప్పే శకటాన్ని ప్రదర్శించారు. ఐదో శతాబ్దం (ఉమ్మడి శకం)నాటి నౌక నమూనాను ప్రదర్శించారు. ఐఎన్ఎస్‌వి తరిని (నావికాసాగర్ పరిక్రమ–2 సాహసయాత్ర) శకటం దాని వెంట వచ్చింది. భారతవాయుసేనకు చెందిన 144 మంది బృందం నలుగురు ఆఫీసర్ల నాయకత్వంలో పరేడ్‌లో పాల్గొంది. స్క్వాడ్రన్ లీడర్ జగదీశ్ కుమార్,స్క్వాడ్రన్ లీడర్ నికితా చౌధరి, ఫ్లీట్ లెఫ్టినెంట్ ప్రఖార్ చంద్రాకర్,ఫ్లీట్ లెఫ్టినెంట్ దినేశ్‌లు పాల్గొన్నారు. మిగ్–29, ఎస్‌యు–30, జాగ్వార్ విమానం కూడా ఫ్లయ్‌పాస్ట్‌లో పాల్గొన్నాయి. డిఆర్‌డిఓకు చెందిన హైపర్‌సోనిక్ గ్లైడ్ హిపణి ఎల్‌ఆర్–ఎఎస్‌హెచ్‌ఎంలను ప్రదర్శించారు.

ఈ ఏడాది పరేడ్‌లో అతిథుల ఎన్‌క్లోజర్లకు నదులపేర్లు రావి, బియాస్, బ్రహ్మపుత్ర, చంబల్,చీనాబ్, గండక్, గంగ,ఘాగ్ర,గోదావరి,సింధు, జీలం,కావేరి, కోసి, కృష్ణ, మహానది,నర్మత,పెన్నార్,పెరియార్, రావి, సోనే, సట్లెజ్, తీస్తా, వైగై, యమున పేర్లతో బోర్డులు పెట్టారు.



## హక్కులు, బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)

విభజించిందన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి భారత్ ఒక గణతంత్ర దేశంగా అవతరించిందని, ఆ చారిత్రాత్మక క్షణం నుంచే రాజ్యాంగం దేశానికి మార్గనిర్దేశం చేస్తోందని, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మూలసూత్రాలతో దేశాన్ని నడిపిస్తోందని ఆయన చెప్పారు. గణతంత్ర దినోత్సవం కేవలం పండుగ మాత్రమే కాదని, స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకునే పవిత్ర సందర్భమన్నారు. తెలంగాణ రైజింగ్2047 ప్రణాళిక ద్వారా గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ (బాపూఘాట్), గ్రీన్ ఫీల్డ్, డ్రైపోర్టులు, రెండోదశ మెట్రోరైలు, ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ల మధ్య రేడియల్ రోడ్లు, వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు, హైదరాబాద్ – నాగ్‌పూర్, హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్–విజయవాడ పారిశ్రామిక కారిడార్లను నిర్మించనున్నారని, ఇవన్నీ 2047 నాటికి తెలంగాణను దేశ పురోగతిలో కీలక పాత్రధారిగా నిలబెడతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తోందన్నారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా మేడారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించారని, మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరకు శాశ్వత మౌలిక వసతుల కోసం రూ.251 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు.

**రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత..**

రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, వ్యవసాయ రంగానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తుందని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780 కోట్లను చెల్లించిందని, సన్న వడ్లపై క్వింటాల్‌కు రూ.500ల చొప్పున బోనస్‌ను చెల్లిస్తున్నదన్నారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం తెలంగాణ లక్ష్యాన్ని, ఉద్దేశాన్ని ప్రపంచానికి చాటిందన్నారు. 'తెలంగాణ నెక్ట్స్‌జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ202630'ని ప్రారంభించిందని గవర్నర్ తెలిపారు.

## విజయవంతమైన భారత్

# ప్రపంచాన్ని మరింత సుస్థిరం చేస్తుంది

### ఉర్సులా వోండర్ లేయన్

**న్యూఢిల్లీ :** విజయవంతమైన భారతదేశం ప్రపంచాన్ని మరింత సుస్థిరం చేస్తుందని యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్ లేయన్ అన్నారు. న్యూఢిల్లీలో సోమవారం ఉదయం జరిగిన 77వ భారత గణతంత్ర వేడుకల వైభవాన్ని తిలకించిన తర్వాత ఆమె భారత్‌ను ప్రశంసించారు. ''భారత గణతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకావడం నా జీవితంలో దక్కిన ఒక గొప్ప గౌరవం, విజయవంతమైన భారతదేశం ప్రపంచాన్ని మరింత సుస్థిరం చేస్తుంది, దీనివల్ల మనం అందరం ప్రయోజనం పొందుతాం'' అని ఉర్సులా వ్యాఖ్యానించారు. అమెతోపాటు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా కూడా ముఖ్యఅతిథిగా ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ విధంగా యూరోపియన్ యూనియన్‌కు చెందిన ఇద్దరు అగ్రశ్రేణి నాయకులు మొదటిసారి భారతదేశ గణతంత్ర ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారిద్దరి వెంట ఉన్నతస్థాయి ప్రతినిధిబృందం కూడా వచ్చింది. వీరంతా మంగళవారం జరిగే భారత్–యూరోపియన్ యూనియన్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నారు. భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి,రక్షణమంత్రి, ఇతర కేంద్రమంత్రులు, త్రివిధ దళాల అధిపతులు, ఉన్నతాధికారులతోపాటు 10,000 మంది అతిథులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రతి సంవత్సరం గణతంత్ర వేడుకలకు విదేశీ ప్రముఖులు హాజరవుతారు. గత ఏడాది వేడుకల్లో ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబొవో సుబియంతో ముఖ్య అతిథిగా 2024లో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ పాల్గొన్నారు. 2023లో ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సిసి ముఖ్యఅతిథిగా వచ్చారు.2021, 2022 సంవత్సరాలలో కొవిడ్ మహమ్మారి కారణంగా గణతంత్ర వేడుకలకు విదేశీ ప్రముఖులను ముఖ్యఅతిథులుగా ఆహ్వానించలేదు. 2020లో బ్రెజిల్ అధ్యక్షుడు జైర్ బోల్సెనారో ముఖ్యఅతిథిగా వచ్చారు. అంతకుముందు 2019లో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సైరిల్ రామఫోసా, 2018లో పది 'ఏసియన్' దేశాలకు చెందిన ప్రతినిధులు అతిథులుగా హాజరయ్యారు.

2017లో అబుదాబి రాజకుమారుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్,2016లో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హోల్లాండ్, 2015లో ఆనాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ముఖ్యఅతిథిగా వచ్చారు. 2014లో జపాన్ ప్రధానమంత్రి షింజో అబే, 2013లో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నంగ్యేల్ వాంగ్‌ఛుక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా నికొలస్ సర్కోజీ, వ్లాదిమిర్ పుతిన్, నెల్సన్ మండేలా, జాన్ మేజర్, మహ్మద్ ఖతామి, జాక్వస్ చిరాక్ (1998 ఫ్రాన్స్ అధ్యక్షుడు), బ్రిటన్ ప్రధాని జాన్ మేజర్, సర్కోజీ (ఫ్రాన్స్ అధ్యక్షుడు 2008), నేపాల్ రాజు బీరేంద్ర బీర్ బిక్రమ్ షా దేవ్ (1999),ఇరాన్ అధ్యక్షుడు ఖతమి (2003), ఇండోనేసియా అధ్యక్షుడు సుసిలో బాంబాంగ్ (2011), మాల్దీవుల అధ్యక్షుడు మామూన్ అబ్దుల్ గయూమ్ (1991) వంటి ప్రముఖ దేశాధిపతులు అంతకు ముందు సంవత్సరాల్లో పాల్గొన్నారు.

## మెర్సిడెస్ కార్లధరలు?

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉంది. ఉభయ పక్షాల మధ్య 18 సంవత్సరాల చర్చల తర్వాత ఈ ఒప్పందం ముగింపు దశకు చేరుకుంది. 2007లో ప్రారంభమైన ఈ చర్చలు మంగళవారం ఎఫ్‌టిఏ ప్రకటనతో ముగింపునకు రానున్నాయి.భారతీయ వస్తువులపై ఇయు సుంకాలు సుమారు 3.8 శాతంగా ఉన్నాయి. కానీ అధిక కార్మికులు కలిగిన రంగాలపై సుమారు 10 శాతం దిగుమతి సుంకం విధించబడుతుంది. ఇయు వస్తువులపై భారతదేశం సగటు సుంకం దాదాపు 9.3 శాతం. ముఖ్యంగా ఆటోమొబైల్స్, విడిభాగాలు (35.5 శాతం), ప్లాస్టిక్ (10.4 శాతం), రసాయనాలు , ఔషధాలపై (9.9 శాతం) అధిక సుంకాలు ఉన్నాయి.

మంగళవారం ప్రకటించే ఒప్పందంలో అనేక సేవా రంగాలలో నిబంధనల సరళీకరణ అంశాన్ని కూడా చేర్చనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లు 'పిటిఐ' పేర్కొంది. వస్త్రాలు, తోలు, దుస్తులు, రత్నాలు, ఆభరణాలు, చేతివృత్తుల వంటి అధిక కార్మికులు పని చేసే రంగాలకు సుంకం లేని ప్రవేశం కోసం భారతదేశం పట్టుబట్టింది. భారతదేశం ఖరారు చేసిన అన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలలో ఇది ఒక కీలకమైన డిమాండ్. మరోవైపు తన ఆటోమొబైల్స్, వైన్లతో సహా మద్యంపై సుంకాల తగ్గించాలని ఇయు డిమాండ్ చేస్తోంది. భారతదేశం ఆల్కహాలిక్ పానీయాలపై 100–125 శాతం సుంకం విధిస్తుంది. సున్నితమైన వ్యవసాయ సమస్యలను ఒప్పందం నుండి దూరంగా ఉంచారు. బీఫ్, చక్కెర,బియ్యం మార్కెట్లను ఇయు రక్షిస్తోంది. మరోవైపు, భారతదేశం తన వ్యవసాయ, పాడి రంగాలను పోటీ నుండి రక్షించింది. ఎఫ్‌టిఎలో రెండు వైపులా తమ మధ్య వర్తకం కొనసాగుతున్న 90 శాతానికి పైగా వస్తువులపై దిగుమతి సుంకాలను తగ్గించడం లేదా తొలగించడం జరుగుతుంది. టెలికమ్యూనికేషన్స్, రవాణా, అకౌంటింగ్ , ఆడిటింగ్ వంటి సేవల రంగాలలో వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి నిబంధనలను సడలించడం కూడా ఒక వాణిజ్య ఒప్పందంలో ఉంటుంది.ఎఫ్‌టిఏతో పాటు, పెట్టుబడి రక్షణ, భౌగోళిక సూచికలు (జిఐ)లో కూడా ఇరుపక్షాలు ఒక ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నారు. భారతదేశం – ఇయు ఎఫ్‌టిఎలో వస్తువులు,సేవల వాణిజ్యంతో సహా 24 అధ్యాయాలను కలిగి ఉంది.

**ఇయుతో భారత్ మిగులు వాణిజ్యం**

2024–25లో ఇయుతో భారతదేశం వస్తువుల ద్వైపాక్షిక వాణిజ్యం 136.53 బిలియన్ డాలర్లు. ఇందులో 75.85 బిలియన్ల విలువైన ఎగుమతులు, 60.68 బిలియన్ల విలువైన దిగుమతులు ఉన్నాయి. భారతదేశం అతిపెద్ద వస్తువుల వ్యాపార భాగస్వామిగా ఇయు నిలిచింది. 2024లో సేవల వాణిజ్యం 83.10 బిలియన్ డాలర్లు. 2024–25లో భారతదేశం 15.17 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులును కలిగి ఉంది. భారతదేశం మొత్తం ఎగుమతుల్లో ఇయు మార్కెట్ దాదాపు 17 శాతం వాటా కలిగి ఉంది. భారతదేశానికి ఇయు ఎగుమతులు దాని మొత్తం విదేశీ ఎగుమతుల్లో 9 శాతం ఉన్నాయి.

## ప్రత్యేక కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

నగదు, రెండు పడకల గదుల నిర్మాణం చేపట్టి అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నిర్మాణ పథకంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలోస్వయం సహాయక బృందాలలో సభ్యులుగా ఉన్న మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించి ఇల్లు నిర్మాణం కోసం ఇతర అవసరాల వ్యాపార అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. తొర్రూరు పట్టణంలో రెండు పడకల గదుల నిర్మాణం పూర్తి చేసుకున్న బ్లాకులను మంత్రి సందర్శించారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అందుకు హౌసింగ్ అధికారులు రెవెన్యూ విభాగం సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ పట్టణ పరిధిలో సుమారు రూ.15 కోట్ల వ్యయంతో అంతర్గత రోడ్ల నిర్మాణం డ్రైనేజీలు, విస్తరణ తదితర పనుల ప్రారంభోత్సవం కోసం భూమి పూజ శంకుస్థాపనలు చేయడం జరిగిందని పట్టణాలు,గ్రామాలు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి అధిక నిధులు కేటాయించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే మామిండ్ల యశస్విని రెడ్డి, వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ అనిల్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, సంబంధిత విభాగాల అధికారులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ రక్షణకు పోరాడాలి



సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**న్యూఢిల్లీ:** మితవాద మతశక్తుల నుండి రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి తీవ్రస్థాయిలో పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యాలయం అజయ్‌భవన్‌లో సోమవారం గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డి.రాజా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ... భారత గణతంత్ర భావన మితవాద మత శక్తుల నుండి తీవ్రమైన ముప్పు ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలు దెబ్బతింటున్నాయని హెచ్చరించారు. రాజ్యాంగ రక్షణకు, భారత గణతంత్ర లౌకిక, ప్రజాస్వామ్య, సోషలిస్ట్ లక్షణాన్ని కాపాడుకోడాన్ని తీవ్రస్థాయిలో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు (ఆహ్వానితుడు) పల్లవ్‌సేన్ గుప్తా, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ దినేశ్‌వర్ష్ణి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణతోనే ప్రజాస్వామ్యానికి భద్రత



సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాజ్యాంగ పరిరక్షణతోనే ప్రజాస్వామ్యానికి భద్రత ఉంటుందని, ప్రస్తుత పరిస్థితిలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతీ భారతీయునిపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ ప్రజా సంఘాలు, పంచాయితీ పాలక వర్గాలు, ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామ పంచాయితీ కార్యాలయాలు, కార్మిక అడ్డాలు, బస్తీ సెంటర్లు, పార్టీ కార్యాలయాల్లో పర్యటించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, కందుల భాస్కర్, దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, భూక్య ధస్రు ఎస్‌కే ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు, నాయకులు వంగ వెంకట్, నేరెళ్ల రమేష్, గెద్దాడు నగేష్, యూసుఫ్, ధర్మరాజు, సత్యనారాయణ చారి, రత్నకుమారి, షాహీమ్ విజయలక్ష్మి, కైసర్, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

## ఈ దేశ స్వాతంత్య్రం అనేక మంది త్యాగధనుల త్యాగాల ఫలితం

సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశ స్వాతంత్య్రం అనేకమంది త్యాగ ధనుల త్యాగాల ఫలితమని సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. మణికొండ ల్యాంకోహిల్స్ కమ్యూనిటీలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ అనేక మంది మహానుభావులు, సామాన్య ప్రజలు చేసిన అపూర్వ త్యాగాల ద్వారా సాధించుకున్న ఈ స్వేచ్ఛను పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ముఖ్యంగా విద్యావంతులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారతదేశంలో ఉన్న అపార మానవ వనరులు, కష్టపడే ప్రజలు, క్రమంగా బలపడుతున్న ఆర్థిక వ్యవస్థ, ఈ అంశాలన్నీ పేదరిక నిర్మూలనతో పాటు విద్య, ఆరోగ్య రంగాలలో నాణ్యమైన సేవలు సామాన్యలకు అందేలా ఉపయోగపడాలని, ఆ దిశగా మేధావులు చురుకుగా ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ల్యాంకో హిల్స్ రెసిడెంట్స్ సొసైటీ అధ్యక్షురాలు ప్రియా తాళ్లూరి, కార్యదర్శి డిఎల్ఆర్ ప్రసాద్, మాజీ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## రూ.500 నోటుపై గాంధీ ఫొటో మార్చేస్తారేమో?



సిపిఐ సీనియర్ నాయకులు అజీజ్ పాషా

**హైదరాబాద్ :** స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామ్యం లేని బిజెపి – ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం 500 రూపాయల నోటులో గాంధీ ఫోటోను మార్చేసినా ఆశ్చర్యం లేదని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన గొప్ప జాతీయ నాయకుల త్యాగాలను, ముఖ్యంగా మహాత్మా గాంధీని ప్రస్తుత ప్రభుత్వానికి కంటగింపుగా మారిందని విమర్శించారు. హైదరాబాద్‌లోని భగత్‌సింగ్‌నగర్‌లో గణతంత్రదినోత్సవం సందర్భంగా ఆయన సోమవారం త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో మూడవ అతిపెద్దదిగా చేయాలనే భారతదేశ రాష్ట్రపతి ఆకాంక్ష అందరికీ నచ్చుతుంది, కానీ భారతదేశం, జపాన్‌ల మధ్య అంతరం చాలా భారీగా ఉంటుందని, అది సుసాధ్యమైతే, అందరూ సంతోషంగా ఉంటారని అజీజ్ పాషా అన్నారు. నారీశక్తి గురించి రాష్ట్రపతి మాట్లాడటం ప్రశంసనీయమని, అయితే గత ఏడాది నుండి మహిళలపై అత్యాచారాలు నాలుగు వాతం పెరిగాయని, భారతదేశంలో మహిళలు గంటకు 51 కేసులు నమోదు చేస్తున్నారని ఆమె గ్రహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ కార్యదర్శి ఎం.డి. మహబూబ్, ఆర్.గోపాల్, ఎస్.ఎం.కృష్ణ పాల్గొన్నారు.

# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా భారత మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 77వ గణతంత్ర దినోత్స వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రభుత్వ , ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, ప్రజా సంఘాల కార్యాలయాల్లో ఎక్కడి ఎక్కడ జాతీయ పతాకాన్ని ఎగురవేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శాసన మండలి ప్రాంగణంలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారాక రామరావు జాతీయ జెండాను ఎగురవేశారు. తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, బిసి కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జి.నిరంజన్, మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, టిజిపిఎస్‌సి కార్యాలయంలో చైర్మన్ బుర్రా వెంకటేశం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. డిజిపి కార్యాలయంలో అడిషనల్ డిజిపి డి.ఎస్. చౌహన్, చంచల్‌గూడలోని జైళ్ల శాఖ కార్యాలయంలో డిజి సౌమ్య మిశ్ర జాతీయ జెండాను ఎగరవేశారు. అగ్నిమాపక శాఖ రాష్ట్ర కార్యాలయంలో డైరెక్టర్ జి.నారాయణరావు, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ప్రధాన కార్యాలయం ఎల్‌బిస్టేడియంలో వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలా దేవి జాతీయ జెండాను ఎగురవేశారు.ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో కమిషనర్ సి.హరికిరణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

**పోలీసు అకాడమీలో..**

ఆర్‌బివిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన డిప్యూటీ డైరెక్టర్ డి.మురళీధర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగం 1950



జనవరి 26న అమలులోకి వచ్చిందని, దేశ ప్రజలందరికీ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, స్వేచ్ఛలు, రక్షణలు సమర్థవంతంగా అందుతున్నాయంటే అందుకు ప్రధాన కారణం పోలీసు వ్యవస్థేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కేఆర్‌కె.ప్రసాద్ అడ్మిన్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఘంటా వెంకట్రావ్, వివి రమణ, వి.శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ డిఎస్‌పిలు సతీష్ కుమార్, పిజి రెడ్డి, ఆదూరి శ్రీనివాసరావు, అమృత రెడ్డి, సందీప్‌రెడ్డి, దేవా రెడ్డి, భాస్కర్, రామారావు, రవీంద్రాజు, ఇంటెలిజెన్స్ డిఎస్‌పి ఆనందరెడ్డి, కృష్ణ, టి.శ్రీనివాసరావు, జగదీశ్వరావు, తిరుపతి, లా ఫ్యాకల్టీ డాక్టర్ రవికుమార్, వరలక్ష్మి , యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ యాదమ్మ, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్‌లు, ఇతర అధికారులు, ఫ్యాకల్టీ సభ్యులు, శిక్షణార్థులు, క్వార్టర్‌లో ఉన్న అధికారుల ఫ్యామిలీ మెంబర్స్ కూడా పాల్గొని గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

దేశంలో ప్రస్తుతం ప్రజల హక్కులు, కార్పొరేట్ అవసరాల మధ్య తీవ్రమైన ఘర్షణ కొనసాగుతోందని టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తూ, సామాన్య ప్రజల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. '77వ గణతంత్ర దినోత్సవ' సందర్భంగా హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో జాతీయ జెండాను సోమవారం ఆయన ఆవిష్కరించారు.

## టిజిపిఎస్‌సి బాధ్యత, గౌరవాన్ని కలిగిన రాజ్యాంగ సంస్థ

చైర్మన్ బుర్రా వెంకటేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం టిజిపిఎస్‌సి కార్యాలయంలో చైర్మన్ బుర్రా వెంకటేశం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు అమీర్ ఉల్లా ఖాన్, ప్రొఫెసర్ నారి యాదయ్య, లక్ష్మీ కాంత్ రాథోడ్, కార్యదర్శి ఎం.హరిత, అధికారులు సిబ్బంది సమక్షంలో బుర్రా వెంకటేశం, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనేది గొప్ప బాధ్యత, గౌరవాన్ని కలిగి ఉన్న రాజ్యాంగ సంస్థ అని అన్నారు. గతంలో పలు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ముగిసేందుకు చాలా ఏళ్లు పట్టేదని, కాని ప్రస్తుతం అన్ని నియామకాలని సకాలం పూర్తి చేశామని తెలిపారు.

# రాజ్యాంగ విలువలను కాపాడటమే లక్ష్యం




ఐద్వా 14వ జాతీయ మహాసభలలో వక్తల పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా మహిళల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విమర్శించింది. హైదరాబాద్‌లో జరుగుతున్న ఐద్వా 14వ జాతీయ మహాసభలు రెండవ రోజుకు చేరుకున్నాయి. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాజీ ఎంపి మాలిని భట్టాచార్య జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం రెండవ రోజు సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై ఐద్వా అధ్యక్షురాలు పి.కె.శ్రీమతి, ప్రధాన కార్యదర్శి మరియం దావులే జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై నివేదికను సమర్పించారు. మోదీ ప్రభుత్వం ప్రపంచ సామ్రాజ్యవాద ప్రయోజనాలకు లోబడి పనిచేస్తోందని, ఓటు హక్కు, ఉపాధి, ఆహార భద్రత, ఆరోగ్యం, విద్య వంటి రంగాలపై దాడులు జరుగుతున్నాయని ఆ నివేదికలో వెల్లడించింది. ట్రంప్ విధానాలకు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను, మత విద్వేషాలను వ్యతిరేకిస్తూ, బీహార్ ఎన్నికల ముందు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరుతో ఓట్లు తొలగించడాన్ని తప్పుబడుతూ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది.

**బిజెపివి బూటకపు హామీలు..**

దేశవ్యాప్తంగా బూటకపు హామీలతో బిజెపి అధికారంలోకి వస్తుందని ఐద్వా అధ్యక్షురాలు పి.కె.శ్రీమతి, ప్రధాన కార్యదర్శి మరియం ధావలే అన్నారు. మీడియా సమావేశంలో ఐద్వా జాతీయ సంయుక్త కార్యదర్శి అర్చన ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి లతో కలిసి వారు మాట్లాడారు. మణిపూర్‌లో కార్పొరేట్ కంపెనీల కోసం విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, మహిళలపై జరిగిన హింసలో ఒక్క హంతకుడిని కూడా శిక్షించలేదని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడలేని భయానక పరిస్థితులు ఉన్నాయని, బాధితులను బిజెపి నేతలు బెదిరిస్తున్నారని విమర్శించారు. మహారాష్ట్ర, ఒడిశాల్లో బిజెపి మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఒడిశాలో బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రహం స్టెయిన్స్ హత్యకేసు నిందితుడు ధారాసింగ్‌ను విడుదల చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. కనీస మద్దతు ధర, ఉచిత విద్యుత్, పెన్షన్లు వంటి హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. అటవీ భూములను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు.

## మహిళల హక్కులను కాలరాస్తున్న మోదీ సర్కార్ : ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ ప్రధాన కార్యదర్శి నిషాసిద్దు



మహిళల హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి నిషాసిద్దు విమర్శించారు. హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణమండపంలో జరిగిన 'ఐద్వాజాతీయ 14వ మహాసభ'లో నిషాసిద్దు సౌహార్ద సందేశమిచ్చారు. సామ్రాజ్యవాదం పెరిగిపోతుందని, గజాలో అమానీయ పరిస్థితులు నెలకొన్నాయని, 19 వేల మంది పిల్లలను చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ కనీసం ఆహారం లభించని పరిస్థితులు నెలకొన్నాయని, సహాయం చేసే వారిపైన కూడా ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతోందన్నారు. అమెరికా సామ్రాజ్యవాద దాడులకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీచట్టాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సవరణ పేరుతో ఆ చట్టం లక్ష్యాన్ని నీరుగార్చిందన్నారు. సమాచర హక్కు చట్టాన్ని కూడా నీరుగార్చారని, ప్రస్తుత సవరణ ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఖనీజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మహిళల ఓటు హక్కును కూడా తొలగిస్తున్నారని నిషా సిద్దు దుయ్యబట్టారు.

# తూటాలను ఎదుర్కొన్న పోలీసుకు గ్యాలంటరీ అవార్డు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎదురుగా 125 కేసుల్లో నిందితుడైన కరడుగట్టిన నేరస్థుడు. అదును చూసి పోలీసులపైకి తుపాకీ ఎక్కుపెట్టాడు.. రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. తూటా దూసుకుపోయి కాలికి గాయమైనా, రక్తం వస్తున్నా గాయాన్ని పట్టించుకోకుండా ప్రాణాలకు తెగించి ఆ నిందితుడిని హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి పట్టుకోగలిగారు. గచ్చిబౌలిలోని ప్రిజం పబ్ వద్దజరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో మోస్ట్ వాంటెడ్ ప్రభాకర్ అలియాస్ రాహుల్ రెడ్డి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు.

**అసలేం జరిగిందంటే..?**

నానక్‌రామ్‌గూడకు చెందిన ప్రభాకర్ (30) సాదాసీదా నేరస్థుడు కాదు. ఇతనిపై తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 125కు పైగా కేసులు ఉన్నాయి. 2022లో విశాఖ సెంట్రల్ జైలు ఎస్కార్ట్ నుంచి తప్పించుకుని అప్పటి నుంచి పోలీసుల నుండి తప్పించుకు తిరుగుతున్నాడు. గౌలిదొడ్డిలోని 'ప్రిజం పబ్'కు ప్రభాకర్ వస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మర్రి వెంకటరెడ్డికి పక్కా సమాచారం అందింది.వెంటనే అప్రమత్తమైన వెంకటరెడ్డి, తన సహచర సిబ్బంది ప్రదీప్ రెడ్డి, వీరాస్వామిలతో కలిసి పబ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నిందితుడిని గుర్తించి, లొంగిపోవాలని ఆదేశించారు.

**కాల్పులతో విరుచుకుపడ్డ నిందితుడు**

పోలీసులను చూడగానే కంగుతిన్న ప్రభాకర్, తప్పించుకోవాలనే ఉద్దేశంతో తన వద్ద ఉన్న తుపాకీ తీసి పోలీసుల వైపు గురిపెట్టి రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఈ క్రమంలో ఒక తూటా వెంకటరెడ్డి ఎడమ కాలి బొటనవేలికి తగిలి రక్తస్రావమైంది. అయినప్పటికీ వెనకడుగు వేయకుండా, తన గాయాన్ని లెక్కచేయకుండా వెంకటరెడ్డి ఇతర కానిస్టేబుళ్లతో కలిసి నిందితుడిపైకి దూకి అతడిని కట్టడి చేశారు. ప్రాణాలకు తెగించి నిందితుడిని పట్టుకోవడంతో పెద్ద ప్రమా దం తప్పినట్లయింది.

**సాహసానికి గుర్తింపు గ్యాలంటరీ అవార్డు**

గత 20 ఏళ్లుగా పోలీస్ శాఖలో అంకితభావంతో పనిచేస్తున్న మర్రి వెంకటరెడ్డి, గతంలోనూ పలువురు భయంకరమైన నేరస్థులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారు. గచ్చిబౌలి పిఎస్ పరిధిలో నమోదైన ఉదంతంలో ఆయన చూపిన ధైర్యసాహసాలకు గుర్తింపుగా, 2026 రిపబ్లిక్ డే సందర్భంగా ఆయనను కేంద్ర ప్రభుత్వ 'మెడల్ ఫర్ గ్యాలంటరీ' అవార్డు దక్కింది. ప్రస్తుతం నిందితుడిపై హత్యాయత్నం, ఆయుధాల యాక్ట్ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భారత్ సర్వసత్తాక సౌర్వభౌమిక దేశం

మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో సర్వసత్తాక సౌర్వభౌమిక దేశం మన భారతదేశం అని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 1947లో స్వాతంత్ర్యం వచ్చాక ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించాలనే సంకల్పంతో డా.బి.ఆర్.అంబేద్కర్ రచించిన ఈ రాజ్యాంగం 1950 జనవరి, 26వ తేదీ నుండి అమలులోకి వచ్చిందన్నారు. అదే విధంగా తెలంగాణ మీడియా అకాడమీ జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణా తరగతుల ద్వారా జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలు పెంపొందించడానికి కృషి చేయాలని అన్నారు. రాబోయే రోజులలో జర్నలిస్టుల సంక్షేమం, జర్నలిస్టుల శిక్షణా కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలంగాణ మీడియా అకాడమీ దేశంలోనే మొదటిస్థానంలో ఉండేలా అకాడమీ సిబ్బంది అందరం కలిసి పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ సెక్రటరీ నాగులపల్లి వెంకటేశ్వర రావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణ చందర్ రావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, ఎమ్.కె. రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

# ఇ– ఫైలింగ్‌తో గణనీయమైన మార్పు



డైరెక్టర్ నవీన్ నికోలస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్య ప్రధాన కార్యాలయంలో భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఇ.నవీన్ నికోలస్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2025–26 సంవత్సరంలో ఈఫైలింగ్ పూర్తి అంకితభావం, బాధ్యతతో నిర్వర్తించడం అభినందనీయమన్నారు, తద్వారా డిజిటల్ పరిపాలనకు సజావుగా సమర్థవంతంగా మారడానికి గణనీయంగా దోహదపడిందని పేర్కొన్నారు. ఈ ఫైలింగ్ ప్రక్రియలో విశేష సేవలందించిన పాఠశాల విద్య డైరెక్టరేట్, సమగ్ర శిక్ష, మోడల్ స్కూల్స్, వయోజన విద్య, ఎస్‌సిఈఆర్‌టి విభాగాల నుంచిఎంపిక చేసిన 15 మంది సిబ్బందికి ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ పి.మదన్ మోహన్, అదనపు డైరెక్టర్ (మోడల్ స్కూల్స్) ఎస్.శ్రీనివాస చారి, డైరెక్టర్ (వయోజన విద్య) జి.ఉషారాణి, జాయింట్ డైరెక్టర్ రాజీవ్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలోని తన నివాసంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## భారత్‌ను అగ్ర దేశంగా తీర్చిదిద్దాలి

యువతకు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేదరికం, దరిద్రం, నిరుద్యోగం, నిరక్షరాస్యత లేని దేశంగా, ఆకలి, అజ్ఞానం, అసమానతలు, దోపిడి, పీడన, వివక్ష, అణచివేతలు లేని దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దాలని, అందుకోసం విద్యార్థులు, యువకులు కృషి చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. హైదరబాద్‌లో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కృష్ణయ్య విద్యానగర్‌లో జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, జి.అనంతయ్య, పగిళ్ళ సతీష్, శివ కుమార్ యాదవ్, మోడీ రాందేవ్, అఖిల్ ముదిరాజ్, జితేందర్ యాదవ్, విశాల, వంశీ, వేణుమాధవ్ యాదవ్, క్రరే సిద్దార్థ సాయి, తన్వీర్, మోహిత్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.





## రాజ్యాంగ స్ఫూర్తితోనే ప్రజా పాలన

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/ఆలేరు** : ప్రతి పౌరుడికి హక్కులు, గౌరవాన్ని ప్రసాదించిన భారత రాజ్యాంగమే దేశానికి దిక్సూచి అని, ఆ స్ఫూర్తితోనే రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందని తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో పండుగ వాతావరణంలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించిన ఆయన, అనంతరం పట్టణంలోని గౌడ సంఘం భవనం ,కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన పతాకావిష్కరణ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గ ప్రగతిపై తనకున్న నిబద్ధతను చాటుతూ.. విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతుల కల్పనలో ఆలేరును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏజాజ్, కొండ్రాజు వెంకటేశ్వర్ రాజు,జనగామ ఉపేందర్ రెడ్డి, చింతల ఫణి శ్రీనివాస్ రెడ్డి,అంగడి ఆంజనేయులు, పర్రె రమేష్, అజయ్ కుమార్ విక్రమ్ పాల్గొన్నారు.

## పద్మ విజేతలకు ఎంపి చామల అభినందనలు

**ప్రజాపక్షం/యాదాద్రి:** గణతంత్ర దినోత్సవం 2026 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాల్లో తెలంగాణ రాష్ట్రానికి విశేష ప్రాధాన్యత లభించడం గర్వకారణమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసి, అత్యున్నత పౌర పురస్కారాలకు ఎంపికైన విజేతలకు ఆయన తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రంగంలో విశేష సేవలందించిన చంద్రమౌళి, కృష్ణమూర్తి, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో నిరుపమాన సేవలందించిన డాక్టర్ గూడూరు వెంకట్ రావు, డాక్టర్ విజయ ఆనంద్ రెడ్డి, కూచిపూడి నృత్య కళాకారిణి దీపికా రెడ్డి, పశుసంవర్ధక రంగంలో విశిష్ట కృషి చేసిన రామారెడ్డి మామిడి (మరణానంతరం) గారికి పద్మశ్రీ పురస్కారాలు దక్కడం తెలంగాణ ప్రతిభకు దక్కిన గౌరవమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అవార్డు గ్రహీతలందరి సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని, వారి కృషి నేటి యువతకు గొప్ప స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై పుట్టిన ఆణిముత్యాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని, ఈ ఘనత సాధించిన ప్రతి ఒక్కరికీ తన తరపున, తెలంగాణ ప్రజల తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## రైతుల ఆర్థికాభివృద్ధికే ప్రాధాన్యం

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్** : వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతుల ఆర్థికాభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీని ప్రవేశపెట్టిందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ పనిముట్ల పంపిణీ కార్యక్రమంనిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యంత్రాల వినియోగంతో సాగు వ్యయాలు తగ్గి దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి సబ్సిడీలు అందలేదని, రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆయన విమర్శించారు. ఈకార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి,అగ్రికల్చర్ ఇన్చార్జి ఏడి జామియా నాయకులు బిజిఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్ పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం

కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలు మరువలేనివని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, మహిళ మండలి, వ్యవసాయ మార్కెట్ కమిటి, గ్రంథాలయం, మండల సమాఖ్య కార్యాలయం, మున్సిపాలిటి, తహసిల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాల్లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాలను ఎగురవేశారు. స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. రాజ్యాంగ స్పూర్తిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ శంకుస్థాపన



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గోపాలపురం గ్రామంలో నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యేబీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల పోషణ, ప్రాథమిక విద్యాభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామన్నారు. మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తుర్కపల్లి మండలంలోని పల్లెపహాడ్, రుస్తాపురం గ్రామంలో జరిగిన మల్లన్న జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపాల్ పురం గ్రామ సర్పంచ్ పుట్ట సాయిలు ముదిరాజ్ పాల్గొన్నారు.

## ప్రజా భాగస్వామ్యంతోనే జిల్లా సమగ్రాభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్





**ప్రజాపక్షం/నల్లగొండ** : జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి,నిర్మాణాత్మకంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఎమ్మెల్సీ లు నెల్లికంటి సత్యం,శంకర్ నాయక్,జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ లతో కలసి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ ప్రసంగించారు.జనవరి 26 మనందరికి పండుగ రోజు ప్రపంచంలోనే గొప్ప సర్వసత్తాక, సామ్యవాద,లౌకిక, ప్రజాస్వామ్య,గణతంత్ర దేశంగా భారతదేశమును నిలుపుకునేందుకు భారత రత్న డాక్టర బిఆర్ అంబేద్కర్ సారథ్యంలో భారత రాజ్యాంగం 1950,జనవరి 26న అమలులోకి తెచ్చుకున్నాం.భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించిన అమరవీరులకు,భారత రాజ్యాంగం రూపొందించిన రాజ్యాంగవేత్తలకు ఈ సందర్భంగానా జోహార్లు అర్పించారు.అనేక ఉద్యమాలు,పోరాటాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న విషయము మనందరికీ తెలుసు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు జిల్లాలో అమలవుతున్న పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి అన్నారు. అనంతరం స్వతంత్ర సమర యోధులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హఫీజ్ ఖాన్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,అడిషనల్ ఎస్పి రమేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి,వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## భారతదేశం ప్రపంచలోనే గొప్ప సర్వసత్తాక లౌకిక రాజ్యం

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** మన దేశం ప్రపంచంలోనే గొప్ప సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా నిలిపిన ఘనత భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కే దక్కిందని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ అభిప్రాయపడ్డారు. ఆయన సారథ్యంలోనే భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి తెచ్చుకున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని ప్రజలకు తెలియజేసినందుకు సంతోషిస్తున్న ట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. మహాలక్ష్మి ప థకంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు మొ త్త ం 4కోట్ల 32 లక్షల మంది మహిళ ప్రయాణికులు ఉచిత ప్రయాణాన్ని పొంది 250 కోట్ల 75 లక్షల మొతాన్ని ఆదా చేసుకోవడం జరిగిందన్నారు.

ఆకట్టుకున్న సంస్కృతిక ప్రదర్శనలు

గిరిజన బాలికల అశ్రమ పాఠశాల చివ్వెంల ప్రభుత్వ ఉన్నత పాఠశాలసూర్యాపేట శ్లోక వైష్ణవి పాఠశాలలకు చెందిన విద్యార్థులచే చేపట్టిన సంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులతో జిల్లా కలెక్టర్, ఎస్పి లు ఫోటోలు దిగి వారిని ప్రోత్సహించారు.

**స్టాల్స్ ప్రదర్శన** : పోలీస్, గ్రామీణాభివృద్ధి సంస్థ, అటవిశాఖ, పౌర సరఫరాలశాఖ, జిల్లా సంక్షేమ, మెప్మా, వైద్య ఆరోగ్యశాఖ, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమశాఖలు, మత్స్యశాఖ, మిషన్ బగీరధ, విద్యాశాఖ, అగ్నిమాపక, యువజన సర్వీసులు, క్రీడల శాఖ, హౌసింగ్, వ్యవసాయ, ఉద్యానవన, రవాణశాఖ, పశు సంవర్ధక శాఖలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జిల్లా ఎస్పి కలిసి కలెక్టర్ సందర్శించారు.

**ప్రశంస పత్రాలు అందజేత** : జిల్లాలో విధి నిర్వహణలో అత్యంత ప్రతిభ చూపెట్టిన వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులకు, పోలీసులకు, ఉద్యోగులకు, సిబ్బందికి ప్రశంస ప్రతాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సీతరామారావు, అదనపు ఎస్పి రవీందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నర్సింహాచారి, అర్డీవో వేణుమాదవ్, జిల్లా అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

## సంక్షేమ ఫలాలు ప్రతి గడపకూ చేరాలి

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు పిలుపు



**ప్రజాపక్షం /యాదాద్రి** : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందించడమే లక్ష్యంగా జిల్లా అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. సోమవారం 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా కలెక్టరేట్ ఆవరణలో స్థానిక సంస్థల, రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ హనుమంతరావు డా.బి ఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్ర పటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవ కా ర్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై డీసీపీ అక్షాంక్ష్ యాదవ్ తో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎస్పీ అక్షాంష్ యాదవ్, ఇతర అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జి ల్లాలో అమలవుతున్న వివిధ పథకాల ప్రగతిని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ 4,500 ఎకరాల్లో సాగు చేపట్టగా, ఖరీఫ్ సీజన్లో 3.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ. 758 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 9,735 మందికి ఇళ్లు మం జూరు చేసి, నిర్మాణ దశను బట్టి రూ. 195.10 కోట్లు అందజేశారు. నీటి పారుదల రంగంలో ప్యాకేజీ15 పనులు 79.88% పూర్తి కాగా, ప్యాకేజీ16 ద్వారా 1.65 లక్షల ఎకరాలకు సాగునీరు అం దించే పనులు వేగంగా జరుగుతున్నాయి. జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయి న గంధమల్ల జలాశయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారని, దీని ద్వారా 56 వేల ఎకరాలకు లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. వైద్య రంగంలో ఆరోగ్య శ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచి, జిల్లాలో 15,105 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు : ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ప్రధాన వేడుకల్లో వివిధ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ భక్తి రూపకాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వికలాంగులకు బ్యాటరీ వాహనాలు, ల్యాప్టాప్లు, వీల్ చైర్లను కలెక్టర్ పంపిణీ చేశారు.



## భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం : పల్లా

**ప్రజాపక్షం/దేవరకొండ** :భారత రాజ్యాంగాన్ని ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి భారతీయునిపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను నర్సింహారెడ్డి ఎగరవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ అమలు ఈరోజు దేశ వ్యాప్తంగా పంగడ రోజని భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరు విశ్వాస పాత్రులుగా, దేశం పట్ల భక్తి భావంతో మెలగాలని అన్నారు. భారత రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికి చేరాలని ఆకాంక్షించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, మండల కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు, నీలా వెంకటయ్య, పట్టణ సహాయ కార్యదర్శులు జ్యోతిబస్, నగేష్, పట్టణ ఏరియా శాఖ కార్యదర్శులు, సభ్యులు మైనోద్దిన్, బుచ్చయ్య, వెంకటయ్య, మల్లయ్య, శ్రీను, మల్లేష్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శివకుమార్, పట్టణ సమితి సభ్యులు శ్రీను, ఆనంద చారి, గిరి, వాహబ్, బ్రహ్మాచారి, మోహన్‌బాబు పాల్గొన్నారు.

## కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాల్సిందే

ఎస్‌కెఎం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా సూర్యాపేట జిల్లాలో బైకు ర్యాలీ




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఎంసిపిఐటియు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్నలు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌కెయం జాతీయ కమిటి పిలుపులో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో బాలాజీ రైస్ మిల్లు నుండి కొత్త బస్టాండ్ , శంకర్ విలాస్, పోస్టాఫిక్, పూల సెంటర్, పొట్టి శ్రీరాములు సెంటర్, రాఘవప్లాజా, నల్లాల బావి సెంటర్, ఏపూరి బస్టాండ్ మీదుగా వాణిజ్య భవన్ వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. నరేంద్రమోడి సర్కార్ పాలనలో ప్రజా వ్యతిరేక రైతు కార్మిక వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న సమస్యలన్ని పరిష్కరించాల్సింది పోయి కొత్త సమస్యలను తీసుకవస్తున్నారని అన్నారు. మహాత్మాగాంధీ పేరును తొలగించడమే ప్రధాన ఉద్దేశ్యంతో పలకడానికి వీలు లేనటువంటి హిందీ, ఇంగ్లీష్ పదాలతో కూడిన వికాసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ) అనే కొత్త చట్టాన్ని తీసుకవచ్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టపల్లి సైదులు, దూళిపాళ ధనుంజయనాయుడు, బొడ్డు శంకర్, కంబాల పల్లి శ్రీను, కందాల శంకర్‌రెడ్డి, షేక్ నజీర్, గంటా నాగయ్య, పులుసు సత్యం, వల్లభూజ సాయికుమార్, బత్తుల సుధాకర్; మందడి రామ్‌రెడ్డి, నాగిరెడ్డి శేఖర్‌రెడ్డి, నారాయణ, వీరారెడ్డి, లక్ష్మి నారాయణ, బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్‌కుమార్, చిలకరాజు శ్రీను, దేశగాని హేమలత, సైదులు, నల్లగొండ నాగయ్య పాల్గొన్నారు.

## ఎఐటియుసి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/భువనగిరి** : 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఐటీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భువనగిరి కొత్త బస్టాండ్ వద్ద బిడిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మెరుగు మధు, స్వర్ణగిరి, రేణుక ఎల్లమ్మ తల్లి ఆటో స్టాండ్‌ల వద్ద జాతీయ జెండాను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు కార్మిక వర్గానికి పూర్తిగా అమలయ్యేలా పోరాటాలు కొనసాగించడం ఏఐటీయూసీ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాటూరి అశోక్, ఆనంద్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు గనబోయిన వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సామల భాస్కర్, పుట్ట రమేష్, చింతల మల్లేష్, గొర్ల లక్ష్మ ణ్, కొత్త కృష్ణ, పుట్ట రాజు, దుర్గ, కరీం, షరీఫ్, శేఖర్, శ్రీశైలం, సాయి, తదితరులు పాల్గొన్నారు.



## ఉమ్మడి జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారులమని బెదిరింపులు

నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల మోసాలపై హెచ్చరిక : జ్యోతిర్మయి

**ప్రజాపక్షం/నల్లగొండ** : ఉమ్మడి జిల్లాలో కొందరు వ్యక్తులు తాము ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు లేదా ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారులమని చెప్పుకుంటూ ఆహార వ్యాపారులను బెదిరిస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. శ్రీకాంత్ రెడ్డి, విక్రమ్ నాయుడు,శ్రీనివాస్ నాయక్ అనే పేర్లతో కొందరు నకిలీ వ్యక్తులు జిల్లాలో తిరుగుతూ మోసాలకు పాల్పడుతున్నట్లు ఫుడ్ సేఫ్టీ విభాగం గుర్తించింది. 8074735461, 7386160150, 8886397761 అనే మొబైల్ నంబర్లను ఉపయోగించి ఈ నకిలీ వ్యక్తులు కిరాణా షాపులు,హోటళ్లు,రెస్టారెంట్లు,బేకరీలు,స్వీట్ షాపులు,టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మీట్ షాపులు, చికెన్‌మటన్ షాపులు, ఫ్రూట్ జ్యూస్ సెంటర్లు,క్యాటరింగ్ యూనిట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, హోల్‌సేల్ మరియు రిటైల్ ఫుడ్ గోదాములు వంటి అన్ని రకాల ఆహార వ్యాపార సంస్థలకు ఫోన్ చేసి లేదా ప్రత్యక్షంగా వెళ్లి అధికారులమని చెప్పుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. మిర్యాలగూడ,నల్లగొండ, హాలియా,సూర్యాపేట, కోదాడ,చౌటుప్పల్ తదితర ప్రాంతాల్లో షాప్ సీజ్ చేస్తాం..లైసెన్స్ రద్దు చేస్తాం..కేసులు నమోదు చేస్తాం అంటూ భయపెట్టే మాటలతో వ్యాపారులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు.ఇటువంటి చర్యలు పూర్తిగా చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీమతి వి. జ్యోతిర్మయి మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఈ విధంగా ఫోన్ కాల్స్ చేసి హెచ్చరికలు ఇవ్వడం,బెదిరింపు స్వరంలో మాట్లాడడం లేదా తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పడం అధికారిక విధానం కాదన్నారు. అధికారిక తనిఖీలు ఎప్పుడూ చట్టబద్ధమైన ప్రక్రియ ప్రకారమే, ప్రభుత్వ గుర్తింపు కార్డుతో, రాతపూర్వక విధానంలో మాత్రమే నిర్వహిస్తామని తెలిపారు.అనుమానాస్పద కాల్స్ లేదా వ్యక్తులు ఎదురైతే వ్యాపారులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని సూచించారు.వెంటనే సమీప ఫుడ్ సేఫ్టీ అధికారి,జిల్లా ఫుడ్ సేఫ్టీ కార్యాలయం లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల ఆరోగ్యం,ఆహార భద్రత, వ్యాపారుల హక్కుల రక్షణే ఫుడ్ సేఫ్టీ విభాగం ప్రధాన లక్ష్యమని,నకిలీ వ్యక్తుల మోసాలకు తావు లేకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## కమనీయం... రమణీయం కైలాసగిరి వాసుడి కల్యాణం

ఓంకార నామ స్మరణతో మారుమోగిన చెర్వుగట్టు క్షేత్రం

పెళ్లి కొడుకు,పెళ్లి కూతుర్లగా భక్తులకు దర్శనం

తలంబ్రాలు,పట్టు వస్త్రలు అందించిన ఎమ్మెల్యే వీరేశం





**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి:** శైవ క్షేత్రాల్లో అత్యంత ప్రాధాన్యత పొంది,తెలంగాణలో రెండవ శ్రీశైలంగా పేరుగాంచిన నల్లగొండ జిల్లా నార్కెట్ పల్లి మండలం చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి.బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం మాఘా శుద్ధ రథ సప్తమి సోమవారం తెల్లవారుజామున లక్షలాది భక్తుల శివ నామ స్మరణలతో వేద మంత్రాల సాక్షిగా రథసప్తమి తిధిని పురస్కరించుకొని సూర్య భగవానుని కిరణాలు స్వామి అమ్మవారులను తాకుతుండగ మాంగళ్య ధారణ కార్యక్రమాన్ని అంగరంగ వైభోవోపేతంగా,కన్నుల పండుగగా నిర్వహించారు. ఆదిదంపతులగు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణంతో చెర్వుగట్టు పులకరించింది.స్వామివారి కల్యాణ తంతు ఆది నుండి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతుల చేతుల మీదుగా జరిపించారు. స్వామి వారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రలను ఎమ్మెల్యే దంపతులు సమర్పించారు. కళ్యాణ మహోత్సవంలో నల్లగొండ ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి,ఆలయ అసిస్టెంట్ కమీషనర్ భాస్కర్,ఆలయ కార్యనిర్వహణ అధికారి మోహన్ బాబు,ఉత్సవ కమిటీ చైర్మన్ వారాల రమేష్,ధర్మకర్తలు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తుల ఉశయ్య, స్థానిక సర్పంచ్ నేతగాని కృష్ణ,వడ్డే గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

**జనగట్టుగా..చెరువుగట్టు క్షేత్రం ..**

శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న శివ పార్వతుల కల్యాణమును విక్షించేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా అంతర్ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు ఆదివారం రాత్రి నుంచే గట్టు పైకి చేరుకున్నారు.

**ప్రసాదాల కౌంటర్లు పెంచాం : ఆలయ ఈవో మోహన్ బాబు**

స్వామివారి కల్యాణానికి రాష్ట్ర నలుమూలల నుండి తలంబ్రాలు సమర్పించడానికి వచ్చే భక్తులకు ఏటేటా వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించేలా చర్యలు చేపట్టామని ఆలయ ఈవో మోహన్ బాబు తెలిపారు.

**వేయి మంది పోలీస్‌లతో ప్రత్యేక బందోబస్త్ : డిఎస్‌పి శివరాం రెడ్డి**

బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టిబందో బస్తు ఏర్పాటు చేశారు. భారీగా తరలి వచ్చే భక్తులు తొక్కిసలాట జరగొద్దనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బారికేడ్లలో భక్తులు భారీగా క్యూలైన్లో నిలబడి దర్శించుకున్నారు. భక్తులను అదుపు చేసేందుకు నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి సారథ్యంలో నార్కట్ పల్లి సీఐ కె నాగరాజు,ఎస్ఐ విష్ణుమూర్తిల ఆధ్వర్యంలో భారీ బందోబస్తును నిర్వహించి డ్రోన్ కెమెరాలతో నడకదారిలో భక్తులకు ఇక్కట్లు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

# అలరించిన శకటాల ప్రదర్శన















**న్యూఢిల్లీ:** భారత 77వ గణతంత్ర దినోత్సవ పరేడ్ ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాలు ప్రదర్శించిన 30 శకటాలు అలరించాయి. వీటిలో 4 శకటాలు వందేమాతరం థీమ్‌తో, మరో 7 శకటాలు ఆత్మనిర్భర్ భారత్ థీమ్‌తో ఆకట్టుకున్నాయి. మిగతా శకటాలను రాష్ట్రాల సంస్కృతులు, సంప్రదాయాలు, కళలను అద్దంపట్టేలా, ప్రభుత్వ పథకాల విజయాన్ని చాటిచెప్పేలా కళాత్మకంగా రూపొందించారు. మొత్తం 30 శకటాల్లో 17 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలవి కాగా, 13 కేంద్ర మంత్రిత్వ శాఖలవి.

**పుదుచ్చేరి:** కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరికి చెందిన శకటం అక్కడి సంస్కృతి, సంప్రదాయ హస్తకళల వారసత్వాన్ని అద్దంపట్టింది. యునెస్కో గుర్తింపు పొందిన ఆరో విల్ టౌన్‌షిప్ నమూనాను ఇందులో హైలైట్ చేశారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా మానవ ఐక్యతను ప్రదర్శించే ప్రతీకగా ఆరోవిల్‌ను చూపించారు.

**తమిళనాడు:** 'అభివృద్ధి మంత్రం : స్వయం సమృద్ధ భారత్ ఈవీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్' అనే థీమ్‌తో తమిళనాడు రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. ప్రత్యేకించి ఎలక్ట్రిక్ వాహనాల తయారీ హబ్‌గా రాష్ట్రం మారుతున్న తీరును ఇందులో చూపించారు.

**కేరళ:** వాటర్ మెట్రో 100 శాతం **డిజిటల్:** ఆత్మనిర్భర్ కేరళ ఫర్ ఆత్మనిర్భర్ భారత్' థీమ్‌తో కేరళ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. కొచ్చి పరిధిలోని అన్ని ద్వీపాలను వాటర్ మెట్రో వ్యవస్థకు చెందిన బోట్ల ద్వారా అనుసంధానించిన తీరును ఇందులో చూపించారు. వాటర్ మెట్రో వ్యవస్థను నూటికి నూరుశాతం డిజిటలైజ్ చేసిన అంశాన్ని శకటంలో హైలైట్ చేశారు.

**మహారాష్ట్ర :** 'గణేశోత్సవ్ : ఆత్మనిర్భరతకు ప్రతీక' అనే థీమ్‌తో శకటాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శించింది. గణేశోత్సవ్‌లో ఢంకా బజాయిస్తున్న మహిళ ప్రతిమను ఇందులో హైలైట్ చేశారు.

**ఒడిశా:** 'నేల నుంచి సిలికాన్ దాకా : సంప్రదాయంతో మమేకం, వైవిధ్యంతో వికాస పయనం' అనే థీమ్‌తో ఒడిశా రాష్ట్రం శకటాన్ని ప్రదర్శించింది. ఈ సందేశాన్ని చెబుతున్న విధంగా ఒకరి వెనుక మరొకరు నిలబడిన మహిళల ప్రతిమలను ఇందులో హైలైట్ చేశారు.

**గుజరాత్:** 'స్వతంత్రతా కా మంత్ర వందేమాతరం' అనే థీమ్‌తో గుజరాత్ రాష్ట్రం శకటాన్ని ప్రదర్శించింది. ఇందులో భారత స్వాతంత్ర్య సమరయోధురాలు భిఖాజీ కామా ప్రతిమను హైలైట్ చేశారు. 1906 నుంచి 1947 వరకు భారత జాతీయ పతాకం రూపాంతరం చెందిన తీరును ఇందులో చూపించారు. శకటంపై గాంధీజీ, చరఖా, అశోక ధర్మ చక్రం ప్రతిమలను కూడా ప్రదర్శించారు. వందేమాతర గేయం 150 వసంతాలను పూర్తి చేసుకున్న అంశాన్ని చూపించారు.

**మధ్యప్రదేశ్:** 'పుణ్య శ్లోక్ లోకమాతా దేవి అహల్యా బాయి హోల్కర్' థీమ్‌తో మధ్యప్రదేశ్ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. అహల్యాబాయి శివలింగాన్ని చేతుల్లో పట్టుకున్న ప్రతిమను ఇందులో హైలైట్ చేశారు. మాల్వా రాజ్యపు రాణిగా ఆమె అందించిన సేవలను గుర్తుచేసేలా ఈ శకటాన్ని తీర్చిదిద్దారు.

**ఛత్తీస్‌గఢ్ :** 'స్వాతంత్ర్య మంత్రం : వందేమాతరం' అనే థీమ్‌తో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. ఇందులో ధుర్వ సామాజిక వర్గం దిగ్గజ నేత వీర్ గుండాధుర్ ప్రతిమను హైలైట్ చేశారు. 1910లో జరిగిన భూమ్కల్ తిరుగుబాటుకు ఆయనే సారథ్యం వహించారు.

**ఉత్తర్‌ప్రదేశ్:** 'బుందేల్‌ఖండ్ సంస్కృతి' అనే థీమ్‌తో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. బుందేల్‌ఖండ్ ప్రాంతంలోని కాళింజర్‌లో ఉన్న ఏకముఖ లింగం, అక్కడి హస్తకళలు, కాళింజర్ కోట, నీలకంఠ మహాదేవ ఆలయాలను శకటంపై హైలైట్ చేశారు.

బెంగాల్ : 'భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బెంగాల్' అనే థీమ్‌తో బంగాల్ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. వందేమాతరం గేయాన్ని రచించిన స్వాతంత్ర్య సమరయోధుడు బంకిమ్ చంద్ర ఛటోపాధ్యాయ్ ప్రతిమను ఇందులో హైలైట్ చేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమం సందర్భంగా బెంగాల్‌లో చోటుచేసుకున్న చారిత్రక ఘట్టాలను శకటంపై ప్రదర్శించారు.

**రాజస్థాన్:** 'ఒంటెల స్వారీ, గోల్డెన్ ఆర్ట్' అనే థీమ్‌తో రాజస్థాన్ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. ఒంటెలపై స్వారీ చేస్తున్న మనుషుల ప్రతిమలను ఇందులో హైలైట్ చేశారు. బికనీర్‌కు చెందిన ఉస్తా కళారూపాలను ప్రత్యేకంగా చూపించారు.

**పంజాబ్:** 'శ్రీ గురుతేజ్ బహదూర్ అమర వీరుడైన 350వ వసంతం అనే థీమ్‌తో పంజాబ్ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. శ్రీ గురుతేజ్ బహదూర్ ఆశీర్వాదాన్ని అందించే హస్తం ప్రతిమను ఇందులో హైలైట్ చేశారు. ఏక్ ఓంకార్, హింద్ దీ చాదర్, షాబాద్ కీర్తన్, గురుద్వారా సిస్ గంజ్ సాహిబ్, గురుతేజ్ బహదూర్ సహచరుల త్యాగాల ప్రతిమలను ఈ శకటంపై చూపించారు.

**హిమాచల్ ప్రదేశ్ :** 'హిమాచల్ ప్రదేశ్ దేవ భూమి, వీర భూమి' అనే థీమ్‌తో ఈ రాష్ట్రం శకటాన్ని ప్రదర్శించింది. భారత సాయుధ దళాల్లో రాష్ట్ర ప్రజలు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ గ్యాలంటరీ అవార్డులు గెల్చుకున్న సైనికుల ప్రతిమలను ఇందులో హైలైట్ చేశారు.

**జమ్ముకశ్మీర్:** 'హస్తకళలు, జానపద నృత్యాలు' అనే థీమ్‌తో జమ్ముకశ్మీర్ శకటాన్ని ప్రదర్శించారు. ఇక్కడి హస్తకళలు, జానపద నృత్యాలను ఇందులో హైలైట్ చేశారు. కశ్మీరు సాంస్కృతిక వైవిధ్యాన్ని, సామాజిక సమీకరణాలను చాటేలా శకటాన్ని అలంకరించారు.



**అసోం:** 'ఆశిరా కాండీ : హస్తకళా గ్రామం' థీమ్‌తో అసోం సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. ధుబ్రి జిల్లా అనేది ఆశిరా కాండీ ఎర్రమట్టి హస్తకళా ఉత్పత్తుల తయారీకి పెట్టింది పేరు. వీటినే శకటంపై హైలైట్ చేశారు. అసోం ప్రాచీన నదీ వారసత్వాన్ని గుర్తుచేసేలా నెమలి ఆకారంలోని బోటు నమూనాను కూడా శకటంపై ప్రదర్శించారు.

**మణిపుర్:** 'వికాసం దిశగా పయనం : పంట పొలాల నుంచి అంతర్జాతీయ మార్కెట్ల దాకా' అనే థీమ్‌తో మణిపూర్ శకటాన్ని ప్రదర్శించారు. రైతుల పంట దిగుబడిని పెంచడంలో మణిపూర్ సాధించిన వికాసాన్ని ఇందులో హైలైట్ చేశారు.

**నాగాలాండ్:** 'హార్న్‌బిల్ ఫెస్టివల్ సాంస్కృతిక వికాసం, పర్యాటక పురోగతి, ఆర్థిక స్వయం సమృద్ధిలతో కూడిన వేడుక' అనే థీమ్‌తో నాగాలాండ శకటాన్ని ప్రదర్శించింది. రాష్ట్ర పక్షి బ్లిత్స్ ట్రాగోపన్ ప్రతిమను ఇందులో హైలైట్ చేశారు.



## కేంద్ర ప్రభుత్వ శకటాల థీమ్‌లు

* యుద్ధాలలో వీరత్వాన్ని చూపించి దేశ నిర్మాణానికి పాటు పడిన సైనిక యోధులను గుర్తు చేసుకుంటూ దేశ వాయుసేన శకటాన్ని ప్రదర్శించింది.
* సముద్రం నుంచి సమృద్ధి వరకు అనే థీమ్‌తో దేశ నౌకాదళం శకటాన్ని ప్రదర్శించింది.
* త్రివిధ దళాల సంయుక్త పోరాటంతో ఆపరేషన్ సిందూర్‌లో సాధించిన విజయాన్ని సైనిక వ్యవహారాల విభాగం శకటంలో చూపించారు.
* గుజరాత్‌లోని భుజ్‌లో భూకంపం వచ్చి 25 ఏళ్లు గడిచాయి. అప్పట్లో ఎన్‌డీఎంఏ, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సాహసోపేతంగా సహాయక చర్యలను చేపట్టారు. ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ శకటాన్ని కేంద్ర హోం శాఖ ప్రదర్శించింది.
* భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అనే మూడు కొత్త చట్టాలు దేశంలో అమల్లోకి వచ్చిన అంశాన్ని గుర్తు చేస్తూ ఒక శకటాన్ని కేంద్ర హోంశాఖ ప్రదర్శించింది.
* కేంద్ర సాంస్కృతిక, పట్టణ వ్యవహారాల శాఖలు వందేమాతరం థీమ్‌తో శకటాలను ప్రదర్శించాయి.
* కేంద్ర విద్య, పంచాయతీరాజ్, ఇంధన, నైపుణ్య వికాస శాఖలు ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ థీమ్‌లతో శకటాలను ప్రదర్శించాయి.
* ఆయుష్ కా తంత్ర, స్వాస్థ్ కా మంత్ర అనే థీమ్‌తో కేంద్ర ఆయుష్ శాఖ శకటాన్ని ప్రదర్శించింది.
* భారత్ కథ : శ్రుతి, క్రితి, ద్రిష్టి అనే థీమ్‌తో కేంద్ర సమాచార ప్రసార శాఖ శకటాన్ని ప్రదర్శించింది.

### శుభాన్షు శుక్లాకు

# అశోక చక్ర ప్రదానం

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని అడుగుపెట్టిన తొలి భారతీయుడు గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ అత్యున్నత శౌర్య పురస్కారం అశోక చక్రతో గౌరవించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో కెప్టెన్ శుభాన్షు శుక్లాకు ఆమె ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లేందుకు యాక్సియమ్4 మిషన్ చేపట్టిన సమయంలో గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా అసాధారణ ధైర్యంతో పాటు ఆయన సంకల్పానికి గౌరవంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్కరించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. 2025 జూన్‌లో 'యాక్సియమ్4' మిషన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి శుభాన్షు శుక్లా అడుగుపెట్టారు. దాదాపు 18 రోజుల పాటు ఆయన అక్కడే ఉండి అంతరిక్ష పరిశోధనలకు అవసరమైన కీలక ప్రయోగాలు చేశారు. ఖగోళంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టం, మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పని చేస్తుందనే అంశాలపై ఆయన వీడియో చిత్రీకరించారు. అలాగే అంతరిక్షంలో మానవ వ్యోమగాముల పరిస్థితిపై సైతం ఆయన అధ్యయనం చేశారు.



## ఆకట్టుకున్న మోదీ తలపాగా, ఉర్సులా డ్రెస్

**న్యూఢిల్లీ:** దేశంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ధరించిన తలపాగా అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ భారతీయత ఉట్టిపడేలా డ్రెస్ ధరించారు. ప్రధాని మోదీ ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు, ఉదా, ఆకుపచ్చ రంగులు కలగలిసిన తలపాగాను ధరించారు. జరీతో నేసిన బంగారు రంగు మోటిఫ్‌లతో అది ఆకర్షణీయంగా కనిపించింది. ఈ రాజస్థానీ సంప్రదాయ తలపాగా.. పండగ వాతావరణాన్ని ప్రతిబింబించింది. అందులోని ఎరుపు.. అభిరుచి, ఉత్సుకత, ధైర్యసాహసాలకు నిదర్శనంగా చెప్తారు. అలాగే ముదురునీలం, తెలుపు రంగుల్లో ఉన్న కుర్తా పైజామా ధరించారు. పైన లేత నీలంలో ఉన్న జాకెట్ వేసుకున్నారు. మరోవైపు ఉర్సులా.. మెరూన్ రంగులో గోల్డ్ డిజైన్ చేసిన డ్రెస్ ధరించారు. ఈ వస్త్రధారణతో ఈ వేడుకకు తగ్గట్టుగా ఆమెలో భారతీయ సంప్రదాయం ఉట్టిపడింది. ఆమె సాధారణంగా ధరించే ప్యాంట్ సూట్స్‌కు భిన్నంగా ఈ దుస్తులు వేసుకున్నారు.



## భారత్—అమెరికాల మధ్య చారిత్రాత్మక అనుబంధం

"భారతదేశానికి 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. అమెరికా ప్రజల తరపున భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రపంచంలోనే పురాతన, అతి పెద్ద ప్రజాస్వామ్యదేశాలుగా అమెరికా, భారతదేశం చారిత్రాత్మక అనుబంధాన్ని పంచుకుంటున్నాయి."

**— అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**

## భారత—చైనాలు మంచి ఇరుగుపొరుగులు

"భారతదేశం, చైనా 'మంచి ఇరుగుపొరుగులు, స్నేహితులు, భాగస్వాములు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు శుభాకాంక్షలు. డ్రాగన్, ఏనుగు కలిసి నృత్యం చేయడమనేది ఇరు దేశాలకు సరైన ఎంపిక. ఉభయ దేశాలు, ప్రజల మౌలిక ప్రయోజనాలను సమరేఖలో మెరుగుపడడం, అభివృద్ధి చెందడం కొనసాగుతోంది. ఇది ప్రపంచ శాంతి, శ్రేయస్సును కొనసాగించడంలో, ప్రోత్సహించడంలో గొప్ప ప్రాముఖ్యత కలిగి ఉంది. ఉభయపక్షాలు సహకారంలో భాగస్వామ్యం, అభివృద్ధిలో అవకాశాల విషయంలో ఏకాభిప్రాయానికి కట్టుబడి ఉండడం ముఖ్యం"

**— జిన్హువా వార్తాసంస్థతో చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్**

## వ్యూహాత్మక భాగస్వామ్య బలానికి శక్తివంతమైన..

"హ్యాపీ రిపబ్లిక్ డే ఇండియా! భారత రాజ్యాంగం, ప్రజాస్వామిక స్ఫూర్తి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంలో రిపబ్లిక్ డే పరేడ్‌కు మొదటిసారి హాజరవ్వటాన్ని గౌరవంగా భావిస్తున్నాను. అమెరికా రూపొందించిన ఎయిర్ క్రాఫ్ట్‌లు భారతీయ గగనంలో దూసుకపోవటాన్ని చూసి ఉద్వేగానికి గురయ్యా. ఇది అమెరికా — భారత వ్యూహాత్మక భాగస్వామ్య బలానికి శక్తివంతమైన సంకేతం"

**— భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్**

## ప్రజాహక్కుల రక్షణకు 'రాజ్యాంగం' కవచం

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ:** రాజ్యాంగం ప్రతి భారతీయుడికి గొప్ప ఆయుధం, కవచం అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని రక్షించాలనే సంకల్పం శిలలా బలమైనదన్నారు. భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జాతీయ జెండాను ఆవిష్కరించారు. మన రాజ్యాంగ సూత్రాలు, స్ఫూర్తిని రక్షించడంలో దృఢంగా నిలబడటం ఈ సమయంలో అవసరమన్నారు. 'న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం మన వ్యవస్థాపక పితామహులు మనకు అందించిన శాశ్వత విలువలు. వాటిని రక్షించడం మన పవిత్ర కర్తవ్యం. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అవసరమైన ప్రతి త్యాగం చేయడానికి మనం సిద్ధంగా ఉండాలి' అని ఖర్గే ఎక్స్‌లో హిందీలో పోస్ట్ చేశారు. 'ఇది మన పూర్వీకుల త్యాగాలకు మా నిజమైన నివాళి అవుతుంది' అని ఆయన అన్నారు. మరోసారి హృదయపూర్వకంగా గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. రాహుల్‌గాంధీ కూడా శుభాకాంక్షలు తెలిపారు. 'మన రాజ్యాంగం ప్రతి భారతీయుడికి గొప్ప ఆయుధం. అది మన గొంతు, మన హక్కులను కాపాడే కవచం. మన గణతంత్రం ఈ బలమైన పునాదిపై నిలుస్తుంది. సమానత్వం, సామరస్యం ద్వారా మాత్రమే బలోపేతం అవుతుంది' అని గాంధీ ఎక్స్‌లో హిందీలో పోస్ట్‌లో అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించడం అంటే భారత గణతంత్రాన్ని రక్షించడం అని, ఇది మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నిజమైన నివాళి అని అన్నారు. జై హింద్! జై సంవిధాన్! అని కర్తవ్య పథంలో జరిగిన గణతంత్ర దినోత్సవ కవాతుకు హాజరైన ప్రతిపక్ష నేత అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా గణతంత్ర దినోత్సవం సందర్భంగా పౌరులకు స్వాగతం పలికారు. 'నేడు మన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ప్రతి భారతీయుడికి స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సోదరభావం విలువలను హామీ ఇస్తుంది. మన రాజ్యాంగం 140 కోట్ల మంది భారతీయులందరినీ రక్షించే కవచం. దానిని రక్షించాలనే మా సంకల్పం ఒక శిలలా బలంగా ఉంది. రాజ్యాంగం వర్ధిల్లాలి! జై హింద్!' అని ఆమె ఎక్స్‌పై హిందీలో పోస్ట్‌లో అన్నారు.

## కర్తవ్యపథ్ వెంబడి ఎన్‌క్లోజర్లకు నదుల పేర్లు

**న్యూఢిల్లీ:** గణతంత్ర దినోత్సవ పరేడ్ కోసం కర్తవ్య మార్గం వెంబడి ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్‌లకు గంగా, యమునా, కృష్ణ, నర్మద, పెరియార్ వంటి భారతదేశ నదుల పేర్లు పెట్టారు. కవాతు వేదిక సమీపంలోని వీధుల్లో లేఅవుట్ మ్యాప్‌లు, బ్యానర్‌లను ఉంచారు. తద్వారా అతిథులను వారి ఎన్‌క్లోజర్‌లకు మార్గనిర్దేశం చేశారు. సాంప్రదాయ ఆచారం నుండి నిష్క్రమించి, ఎన్‌క్లోజర్‌లను గుర్తించడానికి వివిఐపి, ఇతర లేబుల్‌లను ఉపయోగించలేదు. బదులుగా, వీటికి భారతదేశంలో ప్రవహించే నదుల పేర్లు పెట్టారని రక్షణ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు ఈ నెల ప్రారంభంలో తెలిపారు. వీటిలో బియాస్, బ్రహ్మపుత్ర, చంబల్, చీనాబ్, గండక్, గంగా, ఘాగ్రా, గోదావరి, సింధు, జీలం, కావేరి, కోసి, కృష్ణ, మహానది, నర్మద, పెన్నార్, పెరియార్, రావి, సోన్, సట్లెజ్, తీస్తా, వైగై, యమునా ఉన్నాయి. అదేవిధంగా, ఈనెల 29న జరిగే బీటింగ్ రిట్రీట్ వేడుక కోసం, బాన్సూరి, డమరు, ఏక్తారా, ఎస్రాజ్, మృదంగం, నాగడ, పఖావాజ్, సంతూర్, సారంగి, సరిందా, సరోద్, షెహనాయ్, సితార్, సుర్బహార్, తబలా, వీణ వంటి భారతీయ వాయిద్యాలపై ఎన్‌క్లోజర్‌లకు పేర్లు పెట్టనున్నారు. 'వందేమాతరం' 60వ వార్షికోత్సవం ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రధాన ఇతివృత్తం. కర్తవ్య మార్గం వెంబడి పాత చిత్రాలను ప్రదర్శించే ఎన్‌క్లోజర్ నేపథ్యాలు, దాని ప్రారంభ చరణాలను వివరిస్తాయి. 'వందేమాతరం'ను 1875లో బంకిం చంద్ర ఛటర్జీ స్వరపరిచిన విషయం తెలిసిందే. 'వందేమాతరం'తో పాటు 'సారే జెహాన్ సే అచ్చా', 'కదం కదం బధాయి జా', ఇతర పాటల ట్యూన్‌లు లౌడ్‌స్పీకర్లలో 'వందేమాతరం'తో పాటు ప్లే చేశారు. ఇది ఈ సందర్భంగా దేశభక్తి ఉత్సాహాన్ని పెంచింది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ఈ కవాతుకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



**వందేమాతరం ప్రారంభ చరణాల చిత్రీకరణ**

గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కర్తవ్య మార్గం వెంబడి ఉన్న ఆవరణకు 'వందేమాతరం' ప్రారంభ చరణాలను చిత్రీకరిస్తూ కళాకారుడు తేజేంద్ర కుమార్ మిత్రా గీసిన పాత చిత్రాల ప్రింట్లు అలంకరించారు. 1875లో బంకిం చంద్ర ఛటర్జీ రాసిన 'వందేమాతరం' స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఒక ర్యాలీ నినాదంగా మారింది. దీనిని 1950లో రాజ్యాంగ సభ భారత జాతీయ గీతంగా స్వీకరించింది. ఈ సంవత్సరం ఉత్సవ కవాతులో 'వందేమాతరం' నూటయాభైవ వార్షికోత్సవం ప్రధాన ఇతివృత్తం. ఇక్కడ ఉత్సవ కవాతుకు ఆహ్వాన కార్డులు పాట నూటయాభైవ వార్షికోత్సవం లోగోను, ఛటర్జీ సిల్హౌట్ చిత్రం, 'వందేమాతరం' వాటర్‌మార్క్‌గా ఏర్పాటు చేశారు. అలాగే, జనవరి 19 నుండి 26 వరకు అనేక నగరాల్లో జరిగిన సైనిక, కేంద్ర సాయుధ పోలీసు దళాల బ్యాండ్‌ల ప్రదర్శనలు 'వందేమాతరం' అనే థీమ్‌పై ఉన్నాయి.

# ఢిల్లీలో 30 వేల మందితో భద్రత

**న్యూఢిల్లీ:** గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం ఢిల్లీ పోలీసులు నగరవ్యాప్తంగా 30,000 మందికి పైగా సిబ్బందిని బహుళ అంచెల భద్రతా వలయంలో మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తమయ్యారు. సెరిమోనియల్ పరేడ్ రూట్, హైసెక్యూరిటీ జోన్‌లను కలిగి ఉన్న న్యూఢిల్లీ జిల్లాలోనే దాదాపు 10,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించినట్లు అధికారులు తెలిపారు. అదనపు పోలీసు కమిషనర్ (న్యూఢిల్లీ) దేవేష్ కుమార్ మహాలా మాట్లాడుతూ 'గణతంత్ర దినోత్సవ వేడుకల భద్రతకు న్యూఢిల్లీ ప్రాంతంలో దాదాపు 10,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించామన్నారు. పికెట్లు, బారికేడ్లు, అన్ని ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలు అమలులో ఉన్నాయని చెప్పారు. విస్తరణ ప్రణాళికలు, పాయింట్ల వారీగా బ్రీఫింగ్‌లు, ఆకస్మిక చర్యలను సిబ్బంది అందరికీ వివరించామన్నారు. రిహార్సల్స్ కూడా నిర్వహించామని చెప్పారు. పరేడ్‌రూట్, సమీప ప్రదేశాలతో సహా న్యూఢిల్లీ ప్రాంతంలో అధునాతన వీడియో విశ్లేషణలు, ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్)తో కూడిన 3,000 కంటే ఎక్కువ సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కెమెరాల నుండి ప్రత్యక్ష ప్రసారాలను దాదాపు 150 మంది సిబ్బంది నిర్వహించే 30కి పైగా కంట్రోల్ రూమ్‌ల ద్వారా 24 గంటలూ పర్యవేక్షిస్తున్నారని ఆయన అన్నారు. భద్రతా గ్రిడ్‌లో బహుళపొరల బారికేడింగ్, నియమించబడిన అన్ని ఎంట్రీ పాయింట్ల వద్ద బహుళ స్థాయిల తనిఖీలు, కవాతు మార్గంలో, పరిసర ప్రాంతాలలో కఠినమైన యాక్సెస్ నియంత్రణ చర్యలు ఉన్నాయన్నారు. న్యూఢిల్లీ, ఉత్తర, మధ్య జిల్లాలలో వేలాది పైకప్పుల వద్ద స్నిపర్ల బృందాలను మోహరించారు. డిప్యూటీ కమిషనర్లు రూట్ సర్వేలు, విధ్వంసక నిరోధక తనిఖీలు చేశారు. అయితే నగరంలోని మార్కెట్లు, బస్ టెర్మినల్స్, మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీగా ఉండే ప్రాంతాలలో నిఘా ముమ్మరం చేశారు. భద్రతా కసరత్తులో భాగంగా పోలీసులు అద్దెదారుల ధృవీకరణ, గృహ సహాయ ధృవీకరణ డ్రైవ్‌లను కూడా నిర్వహిస్తున్నారు. 'సమాచార భాగస్వామ్యం, నిఘా సమన్వయం, సంసిద్ధతను నిర్ధారించడానికి పొరుగు రాష్ట్రాల పోలీసు దళాలతో అంతర్‌రాష్ట్ర సమన్వయ సమావేశాలు కూడా నిర్వహించబడతాయి' అని ఒక అధికారి తెలిపారు. భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిషేధిత వస్తువులను తీసుకెళ్లకుండా ఉండాలని అదనపు పోలీసు కమిషనర్ పౌరులను కోరారు. సీటింగ్ ఎన్‌క్లోజర్‌లకు నదుల పేర్లు పెట్టారు.



### రిపబ్లిక్ డే వేళ 10,000 కిలోల

# పేలుడు పదార్థాలు స్వాధీనం

**న్యూఢిల్లీ:** గణతంత్ర దినోత్సం వేళ రాజస్థాన్‌లో భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాగౌర్ జిల్లాలోని హర్సౌర్ గ్రామంలో ఆదివారం రాత్రి దాదాపు పది వేల కేజీల అమ్మోనియం నైట్రేట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాటితోపాటు డిటోనేటర్లు ఫ్యూజ్ వైర్లను కూడా సీజ్ చేశారు. భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం తనీఖీలు చేపట్టారు. 187 బస్తాల్లో 9,550 కేజీల అమ్మోనియం నైట్రేట్‌ను గుర్తించి సీజ్ చేశారు. దీంతో పాటు 9 కార్టన్ల డిటోనేటర్లు, 12 కార్టన్లు, 15 ప్యాకెట్ల నీలిరంగు ఫ్యూజ్ వైర్, ఐదు ప్యాకెట్ల ఎరుపు రంగు ఫ్యూజ్ వైర్‌లు సీజ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. ఈ ఘటనలో సులేమాన్ ఖాన్ అనే నిందితుడిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. గతకొన్ని రోజులుగా జిల్లాలో పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు కొనుగోలు చేయడం, అమ్మడం, నిల్వ చేస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి తమకు సమాచారం వచ్చిందని నాగౌర్ ఎస్పి మృదల్ కచావా తెలిపారు. 'హార్సౌర్ ప్రాంతంలో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలు ఉన్నట్లు సమాచారం రావడంతో ఆదివారం ఆపరేషన్‌ను నిర్వహించాం. అదనపు పోలీస్ సూపరిటెండెంట్ పర్యవేక్షలో ప్లాన్ ప్రకారం ఆ స్థావరంపై దాడి చేశాం. నిందితుడు సులేమాన్‌ను అరెస్ట్ చేశాం. మొత్తం 10,000 కిలోగ్రాముల అమ్మోనియం నైట్రేట్‌ను స్వాధీనం చేసుకున్నాం. పెద్ద మొత్తంలో డిటోనేటర్లు, డిటోనేటింగ్ వైర్, మైనింగ్ సంబంధిత బ్లాస్టింగ్‌కు ఉపయోగించే ఇతర పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నాం' అని ఎస్పీ మృదల్ కచావా తెలిపారు.



# కేజ్రీవాల్ కేసులో ఇడి తలంటిన మేజిస్ట్రేట్

ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) పేరు బాగా ప్రాచుర్యం పొందింది. అక్రమంగా డబ్బు తరలింపు (మనీ లాండరింగ్) కేసులంటూ దేశంలో ప్రతిపక్షపార్టీల నాయకులు ఇళ్లు, వ్యాపారాలపై, వారి బంధువుల ఇళ్లలో సోదాలు చేయటం, కేసులతో వేధించటంలో సిబిఐతో అది పోటాపోటీగా పనిచేస్తోంది. ఈ రెండు సంస్థలనూ తమ ఎన్నికల లబ్దికోసం దుర్వినియోగపరుస్తున్నట్లుగా ప్రతిపక్షాలనుంచి బిజెపి కేంద్రప్రభుత్వం ఆరోపణలకు గురవుతోంది. ప్రతిపక్షపార్టీల పాలనలోని రాష్ట్రాల్లో ఎన్నికలకు కొద్ది మాసాల ముందు బిజెపి ప్రత్యర్థులపై సోదాలు, కేసులు ఇడి ప్రతిష్టను దిగజార్చుతున్నాయి. అది పెట్టిన కేసులతో పోల్చితే ఫలితం సాధించిన కేసులు నామమాత్రంగా ఉంటున్నాయి. ప్రతిపక్ష నాయకులను కీలక సమయంలో ఏదోక సాకుతో అరెస్టు చేసి జైల్లోపెట్టి, బిజెపికి సహాయపడుతున్న ఇడి ఉన్నతాధికారుల వక్రబుద్ధిని, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను అక్రమ అరెస్టు నుంచి నిర్దోషిగా విడుదల చేసిన న్యూఢిల్లీ అడిషనల్ ఛీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ (ఎసిజెఎం) తీర్పు బహిర్గతం చేసింది. రెండు ఇ.డి. సమన్స్ కేసులనుంచి కేజ్రీవాల్‌కు విముక్తి కలుగజేస్తూ ఎసిజెఎం పారస్ దలాల్ జనవరి 22న తీర్పు చెప్పారు. ఇడి తన అధికారాల పరిధిని మీరి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి ఢిల్లీలో పార్లమెంటు ఎన్నికల్లో, ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ రాజకీయ ప్రచారాన్ని పట్టాలు తప్పించి బిజెపికి ఎలా తోడ్పడిందో ఈ ఉదంతం దేశానికి గుర్తు చేస్తున్నది. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఇడి పంపిన 9 సమన్‌లకు కేజ్రీవాల్ స్పందించలేదు. దాంతో 2024 మార్చి 21న ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న కేజ్రీవాల్ నివాసగృహంపై ఇడి అధికారులు దాడిచేసి ఆయన్ను అరెస్ట్ చేశారు. పార్టీ అధినేతను జైల్లో పెట్టటంతో ఎన్‌సిటి ఢిల్లీలో ఆప్ ఎన్నికల ప్రచారం చతికిలపడి 7లోక్‌సభ సీట్లూ బిజెపి గెలుచుకుంది. ఆ తర్వాత 2025 ప్రారంభంలో ఢిల్లీ విధాన్ సభ ఎన్నికల్లో బిజెపి అధికారం చేజిక్కించుకుంది. ఆ సమన్‌ల కేసులోనే ఇప్పుడు ఎసిజెఎం ఆప్ నాయకుణ్ణి నిర్దోషిగా నిర్ధారించారు.

తమ ఎదుట హాజరు కావలసిందిగా తాము 9సార్లు సమన్‌లు జారీచేసినా కేజ్రీవాల్ ఏవో అల్పమైన కారణాలతో హాజరుకాకుండా 'అవిధేయత' ప్రదర్శించారన్న ఇడి వాదనను మేజిస్ట్రేట్ త్రోసిపుచ్చారు. ''ఇమెయిల్స్ ద్వారా సమన్స్ పంపినట్లు ఇడి నిరూపించలేదు; లేదా మనీ లాండరింగ్ చట్టంలోని సెక్షన్ 50(2) కింద ఒక వ్యక్తికి ఇ మెయిల్ ద్వారా సమన్‌లు పంపే నిర్దేశిత క్రమాన్ని చట్ట ప్రకారం పాటించినట్లు రుజువు చేయలేదు'' అని ఆయన పేర్కొన్నారు. 'ఇ మెయిల్ ద్వారా సమన్‌లు జారీ చేయటం సిఆర్‌పిసి లేదా పిఎంఎల్‌ఎ కింద చెల్లుబాటుకాదు లేదా చట్టబద్ధం కాదు' అని స్పష్టం చేశారు.

కేజ్రీవాల్ ప్రభుత్వం రూపొందించిన నూతన మద్యం విధానంలో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందని, ఆప్‌కు ఆర్థిక లబ్ది చేకూరిందని ఇడి అప్పుడు హడావుడి చేసిన మనీలాండరింగ్ కేసు కొద్దికాలం తర్వాత మరుగునపడింది. ఆ కేసు నమోదు రికార్డుల్లో తప్ప దర్యాప్తు జరుగుతున్నట్లు రూఢి చేసే పురోగతి వార్తలేవీలేవు. కెసిఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి నాయకురాలు కవిత ఈ కేసులోనే కొన్ని మాసాలపాటు జైల్లో నిర్బంధంలో ఉన్నారు. తర్వాత బెయిలుపై విడుదలైనారు.

ఇలాంటి మరో కట్టుకథ కేసులో సహనిందితుడిగా ఉన్న ఆప్ ఎంఎల్‌ఎ అమానుతుల్లాఖాన్ కూడా నిర్దోషిగా విడుదలైనారు. అదీ ఇడి సమన్‌లు పాటించని కేసే. అతనికి ప్రొసీజర్ ప్రకారం సమన్‌లు అందజేయలేదని, అవి జారీ చేశాక తమ ముందు హాజరయ్యేందుకు అతనికి కనీసం 24గంటలు సమయం ఇవ్వలేదని కోర్టు పేర్కొన్నది. ఆయన అప్పటికే హైకోర్టును ఆశ్రయించి ఉన్నందున ఇడి సమన్‌లు 'అపసవ్యం' అని చెప్పింది.

అది ఇడి పనితీరుకు ఉదాహరణ. కేజ్రీవాల్ 'సత్యమేవ జయతే' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. నువ్వు ఇంకా కేసులో నెం.1 నిందితునిగానే ఉన్నావు సుమా అంటున్నారు బిజెపి వారు.

ఢిల్లీ లిక్కర్ కేసుగా పిలబడుతున్నదాన్ని 2022 ఆగస్టు 17 న సిబిఐ రిజిస్టర్ చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా 2022 జులై 20 న ఫిర్యాదు చేశారు. ఇడి 2022 ఆగస్టు 22న పిఎంఎల్‌ఎ కేసు నమోదు చేసింది. కేజ్రీవాల్‌ను ప్రధాన కేసులో 2024 మార్చి 21న అరెస్టు చేశారు. ముఖ్యమంత్రిగా ఉంటూ అరెస్టు అయిన తొలి వ్యక్తి ఈయనే. ఎన్నికల కారణంగా సుప్రీంకోర్టు 2024 మే 10నుంచి జూన్ 1వరకు బెయిలు ఇచ్చింది. జూన్ 2న తిహార్ జైలుకు లొంగిపోయారు. జులై 12 న సుప్రీంకోర్టు రెగ్యులర్ బెయిల్ ఇచ్చింది, అయితే సిబిఐ కేసు కారణంగా ఆయన జైల్లోనే ఉండిపోయారు. ఆ కేసులో కూడా 2024 సెప్టెంబర్ 13న బెయిలు దొరికింది. ఆయన జైల్లో నుంచే ముఖ్యమంత్రిగా పనిచేశారు. సుప్రీంకోర్టు బెయిలిచ్చిన మరునాడు సెప్టెంబర్ 15న రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలోనే మోదీ ప్రభుత్వం ఏ మంత్రి అయినా ఐదేళ్లు, ఆపై కాలం శిక్ష విధించదగిన కేసులో అరెస్టు కాబడి, వరుసగా 30 రోజులు నిర్బంధంలో ఉన్నట్లయితే అతన్ని పదవి నుంచి తొలగించాలని ఆదేశిస్తున్న 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. దానిపై జెపిసి పబ్లిక్ విచారణ ఈ నెలలో ప్రారంభమైంది.

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల పనులు చూస్తున్న ఐ–ఫోన్ కార్యాలయంపై జనవరి 8న ఇడి దాడి చేయటం, ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని తమ ఫైళ్లు తీసుకెళ్లటంపై ఇడి కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టు ముందు ఉంది. ప్రతిపక్షాల అవకాశాలు దెబ్బతీయటానికి ఇడిని దుర్వినియోగం చేస్తున్న తీరుకు కేజ్రీవాల్ కేసు ఉదాహరణ. ●



## అంతర్గత ఘర్షణలను పరిష్కరించుకుందాం

వెనిజులాలోని రాజకీయ నాయకుల గురించి వాషింగ్టన్ నుంచి చాలా ఆదేశాలు వచ్చాయి. వెనిజులా రాజకీయ నాయకులు మధ్య విభేదాలను, అంతర్గత ఘర్షణలను పరిష్కరించుకుందాం. విదేశీ శక్తులు ఇక చాలు. దేశంలో శాంతి, స్థిరత్వం కోసం ప్రజలుగా మనం ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉంది. విదేశీ శక్తి నుంచి దాడి ఎదుర్కొంటామని వెనిజులా ఎన్నడూ ఊహించలేదు. జాతీయ సమగ్రత కోసం విదేశీ జోక్యం లేకుండా స్థానిక రాజకీయ చర్చల ద్వారా అంతర్గత విభేదాలను పరిష్కరించుకొందాం. మనకు (ప్రతిపక్షాలతో) విభేధాలు ఉన్నప్పటికీ, మనం పరస్పర గౌరవంతో మాట్లాడుకోవాలి. మనం ఏకతాటిపై రావాలి. అంగీకారానికి రావాలి.

వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్వెజ్

---



# సాగును కాటేస్తున్న 'నకిలీ' విషం

ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు, మార్కెట్ మాయాజాలం మరోవైపు నకిలీ విత్తనాలు ఇంకొకవైపు రైతును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వీటికి తోడు, నకిలీ పురుగుమందుల విషం సాగును లోపల నుంచే మెల్లగా చంపేస్తోంది. పంటను కాపాడాలన్న రైతు ఆందోళననే పెట్టుబడిగా మార్చుకుని, రసాయన మాఫియా లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించింది. ఈ ప్రమాదకర దందాకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'పురుగుమందుల నిర్వహణ బిల్లు– 2025'ను ప్రతిపాదించి, నకిలీ తయారీదారుల ఆటకట్టించేందుకు రంగం సిద్ధం చేసింది.

**భయం చుట్టూ విస్తరిస్తున్న వ్యాపార సామ్రాజ్యం**

నేటి వ్యవసాయంలో పురుగుమందుల వినియోగం ఒక అవసరం కాదు – రైతుకు ఒక అత్యవసర పరిస్థితిగా మారిపోయింది. పంటలో చిన్న తెగులు, పురుగు కనిపించినా, మొత్తం పంట నాశనం అవుతుందేమో అన్న భయం రైతును వెంటాడుతుంది. అదే భయాన్ని అవకాశంగా మలుచుకుని, కొన్ని కంపెనీలు నాణ్యత లేని రసాయనాలను ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లతో మార్కెట్లోకి నెట్టేస్తున్నాయి. నిపుణుల అంచనాల ప్రకారం, దేశంలో ఏటా రూ.6,000–8,000 కోట్ల వరకు నకిలీ పురుగుమందుల వ్యాపారం సాగుతోంది.

**నకిలీల కాటు – రైతుకే కాదు,వ్యవస్థకే ముప్పు**

నకిలీ పురుగుమందుల ప్రభావం రైతు జేబుతోనే ఆగిపోవడం లేదు. వ్యవసాయ వ్యవస్థ మొత్తం దీని వల్ల దెబ్బతింటోంది. రోగాలు తగ్గకపోగా పంట ఎండిపోవడం, పెరుగుదల ఆగిపోవడం దిగుబడులు పడిపోవడంతో రైతు అప్పుల ఊబిలోకి జారుకోవడం. భూసారం క్రమంగా నాశనం కావడం భూగర్భజలాలు,పర్యావరణం కలుషితం కావడం ఇవే కాకుండా, పిచికారీ సమయంలో సరైన రక్షణ లేకపోవడం వల్ల రైతుల్లో శ్వాసకోస వ్యాధులు, చర్మ సమస్యలు పెరుగుతున్నాయి.

ప్రస్తుతం అమల్లో ఉన్న 1968 నాటి కీటక నాశిని చట్టం నేటి పరిస్థితులకు సరిపోవడం లేదు. నామమాత్రపు జరిమానాలు, బలహీన శిక్షలు నకిలీ మాఫియాకు ఎలాంటి భయం కలిగించలేకపోయాయి. ఈ లోపాలను సరిదిద్దేందుకే కేంద్ర ప్రభుత్వం 'పురుగుమందుల నిర్వహణ బిల్లు–2025'ను తీసుకొచ్చింది. ఈ బిల్లుపై ఫిబ్రవరి 4లోపు అభిప్రాయాలు, సూచనలు పంపాలని కేంద్రం కోరింది..

**అప్రమత్తతే రైతును కాపాడేది:** నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువుల నియంత్రణకు చట్టాలు ఎన్ని కఠినంగా రూపొందించినప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతు అప్రమత్తతే అన్నింటికన్నా బలమైన రక్షణ కవచం. ప్రతి కొనుగోలులోనూ పారదర్శకత ఉండాలి; కంపెనీ పేరు, బ్యాచ్ సంఖ్య స్పష్టంగా నమోదైన 'పక్కా బిల్లు' తీసుకోవడం రైతు బాధ్యత మాత్రమే కాదు, మోసపోతే పోరాడేందుకు ఒక ఆయుధం కూడా. అనవసర రసాయన ప్రయోగాలతో సాగును సంక్షోభంలోకి నెట్టుకోకుండా విజ్ఞతతో వ్యవహరించాలి. ఎక్కడ నకిలీల ఆనవాళ్లు కనిపించినా, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా తనతో పాటు తోటి రైతుల ప్రయోజనాలను కాపాడే సామాజిక బాధ్యతను ప్రతి కర్షకుడు స్వీకరించాలి'. అన్నదాతను పట్టి పీడిస్తున్న నకిలీల బెడదను అరికట్టడం వ్యవస్థల కర్తవ్యమే కాదు, సామాజిక బాధ్యత కూడా.

**జి.అజయ్ కుమార్**

---

# 2026లో ఆర్థిక అస్థిరతను పెంచే భౌగోళిక రాజకీయాలు

**సాత్యకీ చక్రవర్తి**

జనవరి 14న విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) 'గ్లోబల్ రిస్క్స్ రిపోర్ట్ 2026', ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక సంఘర్షణను అగ్రస్థానంలో ఉన్న ముప్పుగా గుర్తించింది. తరువాతి స్థానాలలో అంతర్ రాజ్య సంఘర్షణ, విపరీత వాతావరణ పరిస్థితులు, సామాజిక విభజన, తప్పుడు సమాచారం, దుష్ప్రచారం ఉన్నాయి.

నాయకులు, నిపుణుల దృక్పథం తీవ్ర ఆందోళనను కలిగిస్తుంది. సర్వేలో పాల్గొన్న వారిలో సగం మంది రాబోయే రెండేళ్లలో ప్రపంచం అస్థిరంగా లేదా కల్లోలం వంటి పరిస్థితులతో ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇది గతేడాది కంటే 14 పాయింట్లు పెరిగింది. మరో 40 శాతం మంది రాబోయే రెండేళ్ల కాలం కనీసం అశాంతిగా ఉంటుందని భావిస్తుండగా, 9 శాతం మంది స్థిరత్వాన్ని, ఒక్క శాతం మంది ప్రశాంతతను అంచనా వేస్తున్నారు. రాబోయే 10 ఏళ్ల కాలం విషయానికి వస్తే, 57 శాతం మంది అస్థిరమైన లేదా విపరీత ప్రపంచాన్ని ఊహిస్తున్నారు. 32 శాతం మంది పరిస్థితులు అశాంతిగా ఉంటాయని, 10 శాతం మంది స్థిరత్వాన్ని , ఒక్క శాతం మంది ప్రశాంతతను అంచనా వేస్తున్నారు.

ప్రధాన శక్తులు తమ ఆసక్తి ఉన్న రంగాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నందున కొత్త పోటీతత్వ వ్యవస్థ ఏర్పడుతోంది. సహకారం నిన్నటికంటే భిన్నంగా మారుతున్న దృశ్యం ఒక ఆచరణాత్మక వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. భాగస్వామ్య విధానాలు, చర్చల స్ఫూర్తి ఇప్పటికీ అత్యవసరం అని డబ్ల్యుఇఎఫ్ అధ్యక్షుడు, సిఇఒ బోర్గే బ్రెండే అన్నారు. దావోస్‌లో జరిగే తమ వార్షిక సమావేశం ప్రమాదాలను, అవకాశాలను అర్థం చేసుకోవడానికి,వాటిని పరిష్కరించడానికి అవసరమైన వారధుల నిర్మాణానికి ఒక కీలక వేదికగా ఉపయోగపడుతుందన్నారు.

పోటీ యుగం భౌగోళిక ఆర్థిక ఘర్షణ నుండి అనియంత్రిత సాంకేతికత, పెరుగుతున్న అప్పుల వరకు ప్రపంచ ముప్పులను పెంచుతున్న తరుణంలో, గ్లోబల్ రిస్క్స్ రిపోర్ట్ ఒక ముందస్తు హెచ్చరిక వ్యవస్థను అందిస్తుంది. అయితే, ఈ ప్రమాదాలేవీ ముందే నిర్ణయించబడిన ఫలితాలు కావు అని డబ్ల్యుఇఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ సాదియా జాహిది అన్నారు. నివేదికలో ప్రముఖంగా పేర్కొన్న సవాళ్లు మనం ఎదుర్కొంటున్న సంభావ్య ప్రమాదాల స్థాయిని, తదుపరి జరగబోయే దానికి ఒక రూపం ఇవ్వటంలో మన ఉమ్మడి బాధ్యతను నొక్కి చెబుతున్నాయి అన్నారు.


ముప్పులను ఈ నివేదిక మూడు కాలపరిమితులలో విశ్లేషిస్తున్నది. తక్షణ (2026); స్వల్ప నుంచి మధ్యకాలిక (తదుపరి రెండు సంవత్సరాలు); దీర్ఘకాలిక (తదుపరి 10 సంవత్సరాలు). సమీప కాలంలో, సైనిక ఘర్షణలు, ఆర్థిక సాధనాలను ఆయుధాలుగా ఉపయోగించటం, సామాజిక విచ్ఛిన్నం ఒకదానితో ఒకటి ఢీకొంటున్నాయి. ఈ తక్షణ ప్రమాదాలు తీవ్రమవుతున్న కొద్దీ, సాంకేతిక వేగం నుండి పర్యావరణ క్షీణత వరకు దీర్ఘకాలిక సవాళ్లు కూడా గొలుసుకట్టు ప్రభావాలను సృష్టిస్తున్నాయి.

సమీప కాల ర్యాంకింగ్‌లలో ప్రపంచ ఆర్థిక ఘర్షణ అగ్రస్థానంలో ఉంది. స్పందించిన వారిలో 18శాతం మంది దీనిని 2026లో ప్రపంచ సంక్షోభాన్ని ప్రేరేపించే అవకాశం ఉన్న ముప్పుగా భావిస్తున్నారు. అలాగే రాబోయే రెండేళ్లలో తీవ్రత పరంగా ఇది ఒకటవ స్థానంలో ఉంది. ఇది గత ఏడాది కంటే ఎనిమిది స్థానాలు పెరిగింది. 2026 సంవత్సరానికి దేశాల మధ్య సాయుధ సంఘర్షణ 2వ స్థానంలో ఉంది, ఇది రెండేళ్ల కాల పరిమితిలో 5వ స్థానానికి పడిపోయింది.

పెరుగుతున్న శతృత్వాలు, సుదీర్ఘ పోరాటాల ప్రపంచంలో, ఘర్షణలు సరఫరా గొలుసులకు, విస్తృత ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి, అలాగే ఆర్థిక ఒడిదొడుకులను పరిష్కరించడానికి అవసరమైన సహకార సామర్థ్యానికి ముప్పు కలిగిస్తాయి. భౌగోళిక రాజకీయ దృక్పథం విషయానికి వస్తే, 68శాతం మంది రాబోయే దశాబ్దంలో 'బహుళ ధృవ లేదా ముక్కలుగా ఉండే వ్యవస్థను' ఊహిస్తున్నారు. ఇది గత ఏడాది కంటే నాలుగు పాయింట్లు పెరిగింది.

రెండేళ్ల కాలంలో ఆర్థిక ముప్పులు అతిపెద్ద ఉమ్మడి పెరుగుదలను చూపుతున్నాయి. ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం ప్రమాదాలు రెండూ ఎనిమిది స్థానాలు పెరిగి వరుసగా 11, 21వ స్థానాలకు చేరుకోగా, అస్సెట్ బబుల్ బరెస్ట్ (స్థిరాస్తి బుడగ పేలడం) ఏడు స్థానాలు పెరిగి 18వ స్థానానికి చేరుకుంది. భౌగోళిక ఆర్థిక ఉద్రిక్తతల మధ్య, పెరిగిపోతున్న రుణాల గూర్చిన ఆందోళనలు, సంభావ్య స్థిరాస్తి బుడగలు అస్థిరత స్థితిలో కొత్త దశను ప్రేరేపించగలవు.

రెండేళ్ల అంచనాలో తప్పుడు సమాచారం, దుష్ప్రచారం 2వ స్థానంలో ఉండగా, సైబర్ అభద్రత 6వ స్థానంలో ఉంది. ఎఐ ప్రతికూల ఫలితాలు




అత్యంత స్పష్టమైన పథాన్ని చూపుతున్నాయి. ఇవి రెండేళ్ల కాలంలో 30వ స్థానం నుండి 10 ఏళ్ల కాలంలో 5వ స్థానానికి చేరుకున్నాయి. ఇది కార్మిక మార్కెట్లు, సమాజాలు, భద్రతపై ప్రభావాల పట్ల ఉన్న ఆందోళనను ప్రతిబింబిస్తుంది. సామాజిక విభజన 2026లో 4వ స్థానంలో, 2028 నాటికి 3వ స్థానంలో ఉంటుంది. అసమానత రెండు, పదేళ్ల అంచనాలలో 7వ స్థానంలో ఉంది. సామాజిక చైతన్యం తగ్గుతున్న తరుణంలో, అసమానత వరుసగా రెండో ఏడాది ఇతర ముప్పులను ప్రేరేపించే అత్యంత అనుసంధాన ముప్పుగా ఎంపిక చేయబడింది. ఆర్థిక మాంద్యం రెండవ అత్యంత అనుసంధానిత ముప్పు. ఈ అనుసంధానాల వెనుక జీవన వ్యయాల ఒత్తిడి, కె–ఆకారపు ఆర్థిక వ్యవస్థలు స్థిరపడిపోతున్నాయనే ఆందోళనలు ఉన్నాయి.

స్వల్పకాలిక ఆందోళనలు దీర్ఘకాలిక లక్ష్యాలను అధిగమించడంతో, రెండేళ్ల అంచనాలో పర్యావరణ ముప్పుల ర్యాంకింగ్ తగ్గింది. విపరీతమైన వాతావరణం 2 నుండి 4వ స్థానానికి, కాలుష్యం 6 నుండి 9వ స్థానానికి పడిపోగా, భూమి వ్యవస్థలో కీలక మార్పులు, జీవవైవిధ్యం కోల్పోవడం వరుసగా ఏడు, ఐదు స్థానాలు పడిపోయాయి. అన్ని పర్యావరణ ప్రమాదాల తీవ్రత స్కోరు తగ్గింది. ఇది కేవలం సాపేక్షమైన మార్పు మాత్రమే కాదు, సంపూర్ణమైన మార్పును సూచిస్తుంది. అయినప్పటికీ 10 ఏళ్ల కాలంలో, అవి అత్యంత తీవ్రమైనవిగా ఉన్నాయి. మొదటి మూడు స్థానాల్లో విపరీతమైన వాతావరణం, జీవవైవిధ్యం కోల్పోవడం, భూమి వ్యవస్థలో కీలక మార్పులు ఉన్నాయి. ముప్పావు వంతు ప్రతివాదులు పర్యావరణ దృక్పథం అస్థిరంగా లేదా తుపానులాగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇది ఏ ఇతర విభాగం కంటే అత్యంత ప్రతికూలమైనది.

**అస్థిరత యుగంలోకి సప్లయ్ చైన్ వ్యవస్థ**

అలాగే జనవరి 19న విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) నివేదిక ప్రకారం, ప్రపంచ విలువ గొలుసులు నిర్మాణాత్మక అస్థిరత యుగంలోకి ప్రవేశించాయి. ఇది కంపెనీలు, ప్రభుత్వాలు ఎక్కడ, ఎలా పెట్టుబడి పెట్టాలి, ఉత్పత్తి చేయాలి అనే విషయాలను పునఃసమీక్షించుకునేలా చేస్తోంది. దాదాపు నలుగురిలో ముగ్గురు వ్యాపార దిగ్గజాలు ఇప్పుడు 'స్థిరత్వం' ఉండే పెట్టుబడులకు ప్రాధాన్యత ఇస్తున్నారని, 74 శాతం మంది దీనిని వృద్ధికి చోదకశక్తిగా చూస్తున్నారని నివేదిక కనుగొంది.

భౌగోళిక రాజకీయ విచ్ఛిన్నం, వేగవంతమైన సాంకేతిక మార్పులు, పెరుగుతున్న వనరుల కొరతలపై కియర్నీ సహకారంతో అభివృద్ధి చేసిన గ్లోబల్ వాల్యూ చైన్స్ అవుట్‌లుక్ 2026: ఆర్కెస్ట్రేటింగ్ కార్పొరేట్, నేషనల్ ఎబిలిటీ అనే కొత్త నివేదిక, అంతరాయాలు అనేవి తాత్కాలిక ఒడిదొడుకుల కంటే శాశ్వత లక్షణంగా మారిన తరుణంలో కంపెనీలు, ప్రభుత్వాలు ఎలా పోటీ పడగలవో పరిశీలిస్తుంది.

అస్థిరత అనేది ఇకపై తాత్కాలిక అంతరాయం కాదు. అది నాయకులు ప్రణాళికాబద్ధంగా ఎదుర్కోవాల్సిన ఒక నిర్మాణాత్మక పరిస్థితి అని డబ్ల్యుఇఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ కివా ఆల్‌గుడ్ అన్నారు. పోటీతత్వ ప్రయోజనం ముందస్తు ఆలోచన, ప్రత్యామ్నాయాలు, వ్యవస్థల సమన్వయం నుండి వస్తుంది. ఈ సామర్థ్యాలను కలిసికట్టుగా నిర్మించే కంపెనీలు, దేశాలు పెట్టుబడులను ఆకర్షించడానికి, సరఫరాను సురక్షితం చేసుకోవడానికి, విచ్ఛిన్నమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని కొనసాగించడానికి ఉత్తమ స్థితిలో ఉంటాయి.

ఈ మార్పు స్థాయి ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తోంది. 2025లోనే, ప్రధాన ఆర్థిక వ్యవస్థల మధ్య సుంకాల విస్తరణ వల్ల 400 బిలియన్ డాలర్లకు పైగా ప్రపంచ వాణిజ్య ప్రవాహంలో మార్పులకు గురైంది. అదే సమయంలో ప్రధాన నౌకా రవాణా మార్గాల్లో అంతరాయాల కారణంగా కంటైనర్ షిప్పింగ్ ఖర్చులు ఏడాదికి 40శాతం పెరిగాయి. ఇది స్వల్పకాలిక ఒడిదొడుకులు నుండి శాశ్వత అనిశ్చితి వైపుకు నిర్ణయాత్మక మార్పును సూచిస్తుంది. అదే సమయంలో, అభివృద్ధి చెందిన దేశాలలో వస్తూత్పత్తి రంగం 2009 తర్వాత అతి బలహీనమైన వేగంతో పెరుగుతోంది. 2025 లోనే ప్రపంచవ్యాప్తంగా 3,000 కంటే ఎక్కువ కొత్త వాణిజ్య, పారిశ్రామిక విధాన చర్యలు ప్రవేశపెట్టబడ్డాయి. ఇది ఒక దశాబ్దం క్రితం నమోదైన వార్షిక స్థాయి కంటే మూడు రెట్లు ఎక్కువ. ఈ శక్తులన్నీ కలిసి సరఫరా గొలుసు స్థిరత్వం (సప్లయ్ చైన్ రెసిలెన్స్) అనేది జాతీయ పోటీతత్వానికి, కార్పొరేట్ వ్యూహానికి ఎందుకు కేంద్ర బిందువుగా మారిందో నొక్కి చెబుతున్నాయి.

''సరఫరా గొలుసు అంతరాయాలు 2026లో నిలకడగా, వ్యవస్థాగతంగా ఉంటాయి. భౌగోళిక రాజకీయ విభజనలు, వాణిజ్య రూల్సులో మార్పులు, కార్మిక కొరతలు – ఇవన్నీ విలువను సృష్టించటమెలాగో, పంచటమెలాగో పునర్ నిర్వచిస్తున్నాయి. సరఫరా నాయకులకు సంబంధించి రానున్న అంతరాయాలను ఊహించటం ఇంకెంత మాత్రమూ ప్రాధాన్యత కాదు. శాశ్వత అస్థిరత మధ్య పనిచేసేందుకు ఆపరేటింగ్ మోడల్స్‌ను కొత్తగా రూపొందించటం వారి ప్రాధాన్యతగా ఉంటుంది'' అన్నారు పెర్ క్రిస్టీన్ హాంగ్ – కియర్నీ భాగస్వామి.

---

# భూభారతి చట్టంతో రైతులకు మేలు చేసేదెప్పుడు?

రెవెన్యూ శాఖను తొలగిస్తే తప్ప దేశం బాగుపడదని హైకోర్టు 2025 నవంబర్ 5న ఘాటు వాఖ్యాలు చేసింది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం

అడవిమల్లెల శివారులోని సర్వే నంబర్ 11,12,13, 29,30,31 లలోని తమ భూములను 'మిషన్ కాకతీయ పథకం' లో చేర్చడాన్ని సవాలు చేస్తూ బి. కృష్ణారెడ్డి తదితరులు పిటిషన్ ను దాఖలు చేశారు.దానిపై జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ ధర్మాసనం విచారణను చేపట్టింది.చెరువు (ఎఫ్టీల్/ ఫుల్ ట్యాంక్ లెవెల్)మధ్యలో ఉన్న భూములకు పట్టాలు ఎలా ఇస్తారని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువుల ఎఫ్టీల్ నిర్ణయించని కారణంగానే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని వ్యాఖ్యానించింది.ఖమ్మం జిల్లా కలెక్టర్ ను కౌంటర్ దాఖలు చేయమని ఆదేశించింది.2025 ఆగస్టులో తమ భూములకు పట్టాలు మంజూరు చేయడంలో కామారెడ్డి జిల్లా తాడ్వాయి తహాశీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎల్లారెడ్డి–కామారెడ్డి ప్రధాన రహదారిపై రైతులు 'రాస్తారోకో' చేశారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ మొఖా మీదికి వచ్చి రిపోర్ట్ సమర్పించి ఏడాది గడుస్తున్నా పట్టాలు ఇవ్వడం లేదని ఆరోపించారు.అన్నదాతలకు న్యాయం చేయని తహాశీల్దార్ వద్దంటూ నినదించారు.

కరీంనగర్ జిల్లా గంగాధర మండలానికి చెందిన రైతులు, రెవిన్యూ అధికారులు లంచాలు అడుగుతున్నారని ఆరోపిస్తూ కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. విరాసత్ చేయడానికి లంచాలు అడుగుచున్నారని ఫిర్యాదు చేశారు. శంకరపట్నం మండలం 'యరడపల్లి'శివారులోని సర్వే నంబర్ 200/2 లో 0.38 గుంటల పట్టా భూమిని 'ఖారిజ్'ఖాతా భూమిగా నమోదు చేసిన భూమికి పట్టా ఇవ్వాలని మూడు సార్లు దరఖాస్తును ఇచ్చిన నిరాకరించారు. ఆఖరికి 'సిసిఎల్ఎ' (చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్)ఖారిజ్ ఖాతా అంటే? ప్రభుత్వ భూమి కాదని స్పష్టత ఇచ్చినా ప్రతికూలంగా వ్యవహరించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ ఎమ్మార్వో కె. విజయా రెడ్డిపై తన కార్యాలయంలోనే 2019 నవంబర్ 4న గౌరెల్లి గ్రామానికి చెందిన కె. సురేశ్ అనే రైతు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటలను ఆర్పే ప్రయత్నంలో అటెండర్ చంద్రియా,డ్రైవర్ గురునాథానికి కూడా తీవ్ర గాయాలైనవి. తహాశీల్దార్ కె.విజయా రెడ్డి సంఘటన స్థలంలోనే మరణించగా,డ్రైవర్ గురునాథం చికిత్స పొందుతూ చనిపోయాడు. కె. సురేశ్ రైతు కూడా చనిపోయాడు.అయితే సురేశ్ కుటుంబ సభ్యులు చెప్పిన వివరణ ప్రకారం 30 కుటుంబాలకు చెందిన 110 ఎకరాల భూవివాదం కేసు కోర్టులో ఉందని, మతి స్థిమితం కోల్పోయిన కె. సురేశ్ ఈ దారుణానికి పాల్పడినాడని తెలిపారు.

భూవివాదాల వలన జరిగిన ఘర్షణలలో చాల మంది రైతులు నష్టపోతున్నారు. చనిపోతున్నారు.దీనికి కారణం రైతులను ఆదుకుని సులువుగా పరిష్కరించే చట్టాలు, ప్రభుత్వ యంత్రాంగం లేకపోవడం వలననే అశాంతి సాగుచున్నది.అందుకే 2023 నవంబర్ 30న జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో రైతుల భూవివాదాల సమస్య ఎన్నికల మేనిఫెస్టోగా తెరమీదకు వచ్చింది.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 'ధరణి పోర్టల్ ' ను రద్దు చేసి,రైతులకు మేలు చేసే చట్టాన్ని తెస్తామని హామీ ఇచ్చింది.అనుకున్నట్టుగానే కాంగ్రెస్



అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ 7న ముఖ్యమంత్రిగా ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.కొత్తగా 'తెలంగాణ రాష్ట్ర భూభారతి చట్టం(భూమిపై హక్కుల రికార్డు) 2025' ఏప్రిల్ 14న ప్రారంభించారు.మూడు దశలలో రెవిన్యూ సదస్సులు నిర్వహించారు.జూన్ 21న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారుల తో సమావేశం జరిపారు.భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులలో రైతులు పెట్టుకున్న 8.50 లక్షల దరఖాస్తులను పరిశీలించి ఆగస్ట్ 15 నాటికి పరిష్కారం చేస్తామని భరోసా ఇచ్చాడు.కాని ఇప్పటి వరకు రైతులు ఇచ్చిన దరఖాస్తులను కనీసం పరిశీలించిన దాఖలాలు కూడా కానరావడం లేదు.

ఎమ్మార్వోలు/తహాశీల్దార్‌లు, రెవెన్యూ ఉద్యోగులు కనీస బాధ్యత లేకుండా విధులు నిర్వహిస్తూ రైతుల కష్టాలకు, కన్నీళ్లకు కారణమవుతున్నారు. బొగ్గు, కరంటు ఉత్పత్తి చేసే ఉద్యోగులు, కార్మికులు ప్రయాణికుల బస్సు, రైలు విమానం నడిపే డ్రైవర్ లు రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారు. అలాంటిది రెవెన్యూ ఉద్యోగులు, అధికారులు ఎందుకు? సక్రమంగా విధులు నిర్వహిస్తాలేరని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయినా ప్రభుత్వం ఆలకించడం లేదు. ఎమ్మెల్యేలు, ఎంపీలు చట్ట సభలలో ప్రశ్నించి రైతులకు అండగా ఉండటం లేదు. ఎన్నెన్నో అక్రమాలు కొనసాగుతూనే ఉన్నా యి. మంత్రుల మాటలకు తగిన ఆచరణ కనిపించటం లేదు.

2023 మే1నాటి ప్రజావాణిలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ కు 'సైదాపూర్ మండల తహాశీల్దార్ సిబ్బందిపై చర్యలు తీసుకుని మేరుగు నారాయణ పేర సర్వే నంబర్ 645/అ,విస్తీర్ణం 0.05 గుంటల భూమిని పట్టా నమోదు చేయాలని విన్నవించినప్పటికీ చర్యలు తీసుకోలేదు.సైదాపూర్ మండల తహాశీల్దార్ మాత్రం 'మెమో నెంబర్ బి.424/2023, తేది 06/05/2023 ద్వారా మొఖా మీద విచారణ జరుపగా దుద్దెనపల్లి శివారులోని సర్వేనంబర్ 645/అ విస్తీర్ణం 0.05 గుంటల భూమిని మేరుగు నారాయణనే వరి పంట సాగు చేసి కోత అయింది. కాని ఆఫీస్ రికారడ్స్ లో కేశవేని కనకయ్య పేర పట్టా ఉన్నందున ప్రస్తుతం 'ధరణిలో'పట్టా దారుడిని రద్దు చేయుటకు వీలు కానందున 'సివిల్ కోర్టు'కు పోయి పరిష్కరించుకోగలరని సలహా ఇస్తూ

మెమో ఇచ్చాడు.మరల భూభారతి చట్టం 2025 మార్గదర్శకమున నిర్వహించిన సదస్సులో కూడా దరఖాస్తు ఇవ్వడం జరిగింది.ఇప్పటి వరకు కనీస స్పందన కూడా లేదు.తహాశీల్దార్/మండల రెవెన్యూ ఆఫీసర్(ఎమ్మార్వో )అంటే 'ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ',రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్(ఆర్డీవో)అంటే 'సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్', కలెక్టర్ అంటే పాలనాధికారి 'ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్' లుగా ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, ఆదాయ సేకరణ,భూమి రికార్డుల వివాదాలు, మ్యూటేషన్,శాంతి భద్రతలు,కార్యనిర్వహణ , మెజిస్ట్రీయల్ అధికారాలు కలిగిన ప్రభుత్వ యంత్రాంగం రైతుల భూమి హక్కుల రికార్డులను ఎందుకు సక్రమంగా నమోదు చేయడం లేదు.అవినీతి, అక్రమాలు జరుగుచున్న చర్యలు తీసుకోకుండా ఎందుకు ఉదాసీనంగా ఉంటున్నారు? చట్టాలను రూపొందించే చట్ట సభలు రైతుల కష్ట నష్టాల గురించి ఎందుకు చర్చించి చర్యలకు ఉపక్రమించడం లేదని రైతులు ఆందోళన చెందుచున్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన తెలంగాణ భూభారతి చట్టం 2025 'ను సక్రమంగా అమలు చేసి రైతుల భూవివాదాలను, తప్పుడు నమోదులను సరిదిద్ది రైతులకు మేలు చేయాలని కోరుకుంటున్నారు.

**మేరుగు రాజయ్య,**
9441440791.



## వెయిటింగ్ హాల్ ప్రారంభం

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మచ్కూరి వార్ పార్వతి హుల్లాజీ జ్ఞాపకార్థం వారి కుమారుడు మచ్కూరివార్ సంతోష్‌మేస్త్రి ఏర్పాటు చేసిన వెయిటింగ్‌హాల్‌ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతా రావు ప్రారంభించారు. అనంతరం మద్నూర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో 30 లక్షలతో మొదటి అంతస్తులో మీటింగ్‌హాల్, చైర్మెన్ చాంబర్ నిర్మాణ పనులకు, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.



## విద్యార్థులకు గ్రంథాలయం నిశ్శబ్ద గురువు

### మండల విద్యాధికారి తోట రమేష్ బాబు

**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** గ్రంథాలయాలు విద్యార్థులకు నిశ్శబ్ద గురువుల వంటివని, వాటిని సద్వినియోగం చేసుకోవడం వల్ల భాషా నైపుణ్యాలు మెరుగుపడతాయని మండల విద్యాధికారి తోట రమేష్ బాబు అన్నారు. చేడ్వాయి జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల గ్రంథాలయ పుస్తకాల కేటలాగ్‌ను సర్పంచ్ చౌదరి శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తారతో కలిసి ఆయన విడుదల చేశారు. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ గ్రంథాలయాల వినియోగం ద్వారా విద్యార్థుల్లో స్వయం అధ్యయనం పెరుగుతుందని, ఇది వారి సమగ్ర అభివృద్ధికి పునాది వంటిదని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యార్థులకు మరిన్ని మౌలిక సదుపాయాలు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** విద్యార్థులకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తానని ఏదుల్లాపూర్ సర్పంచ్ కల్లూరి హనుమంతరావు అన్నారు. మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణతో కలసి రూ. 10లక్షలతో చేపట్టబోయే పాఠశాల ప్రహరిగోడ నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతూనే పాఠశాల విద్యార్థులకు మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మ్యాకల యాదిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కల్లూరి వెంకటేష్, కొమిరెల్లి సునందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రభట్టాచారీ, మర్రి మహేందర్ రెడ్డి, కల్లూరి పాండురంగం, డాక్టర్ కల్లూరి సంతోష్, గొసికె సాయిలు, పైనం నర్సింలు, భూరెడ్డి పద్మ, కల్లూరి సహదేవ్, మహిపాల్‌రెడ్డి, బాలకుంద జనార్దన్, ఫీల్డ్ అసిస్టెంట్ అనిత గ్రామస్థులు పాల్గొన్నారు.



## సంగారెడ్డి జిల్లాల్లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

### సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరికి గణతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవించాలని ఎక్కడా అన్యాయం జరగకుండా సమన్యాయం జరగాలని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, మాజీ సిడిసి చైర్మేన్లు బుచ్చిరెడ్డి విజేందర్ రెడ్డి ,సీనియర్ నాయకులు ,హక్కిమ్, డా శ్రీహరి, మందుల వరలక్ష్మి , వేణుగోపాల స్వామి, పట్టణ అధ్యక్షులు ,ఆర్ వెంకటేశ్వర్లు కార్యదర్శి నర్సింలు ,మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు పాల్గొనారు.

**సిపిఐ కార్యాలయంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవవేడుకలు**

దేశానికి గణంత్రం సిద్ధించి 77 సంవత్సరాలు పూర్త అవుతున్న సందర్భంగా సధాశివపేట సిపిఐ కార్యాలయంలో ఘనంగా 77వ గణంతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎండి షఫి, అనుసూజ, బుజ్జమ్మ, వినోద, పూలమ్మ, దేవి బాయి, ఆర్‌లక్ష్మి , ఏఐటియుసి మండల కార్యదర్శి శంకరప్ప సాధకలి, ముస్తాఫా, యాకూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు








### జెండా ఆవిష్కరించిన కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్/రూరల్ :** నిర్మల్ జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాలయంలో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఈ వేడుకల్లో పాల్గొని పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులకు,విద్యార్థులకు,జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులకు మిఠాయిలు,బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్,ఆర్డీవో రత్నకళ్యాణి పాల్గొన్నారు.

**సమీకృత కలెక్టరేట్‌లో మువ్వన్నెల పండుగ :**
**అధికారులకు,సిబ్బందికి కలెక్టర్ శుభాకాంక్షలు..**

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి,జాతీయ గీతాలాపనలో పాల్గొన్నారు. గణతంత్ర స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ చాటాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం,వివిధ శాఖల అధికారులు,పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**అంబేద్కర్, గాంధీజీ విగ్రహాలకు నివాళులర్పించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా బిజెఎల్పీ నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, గాంధీ పార్క్, ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి, గాంధీపార్క్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, బిజెపి నాయకులు రావుల రాంనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### రెబ్బెన ఎస్ఐ వెంకటకృష్ణకు ప్రశంసా పత్రం

#### ఎస్పీ నీతిక పంత్ చేతుల మీదుగా పురస్కారం

**రెబ్బెన :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా రెబ్బెన ఎస్ఐ బి.వెంకటకృష్ణ జిల్లా ఎస్‌పి నీతిక పంత్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో విశేష పాత్ర పోషించినందుకుగాను ఆయనకు ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా తోటి పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆయనను అభినందించారు.

### కేరమెరి ఎస్ఐ మదుకర్‌కు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రం

**ప్రజాపక్షం/కేరమెరి :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కేరమెరి ఎస్ఐ నాయిని మదుకర్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కేరమెరి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో విశేష పాత్ర పోషించినందుకు గాను ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సహచర సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఎస్ఐ మదుకర్‌ను అభినందించారు.

**పెంచికల్‌పేట్ అధికారులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు**

**పెంచికల్‌పేట్ :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పెంచికల్‌పేట్ మండలానికి చెందిన ముగ్గురు అధికారులు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఎస్ఐ అనిల్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి వంశీ, ఉమెన్ కానిస్టేబుల్ సాయిలత తమ విధుల్లో చూపిన ప్రతిభకు గాను ఈ గౌరవాన్ని పొందారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా వారికి ఈ పురస్కారాలను అందజేశారు.

**బైంసా :** బైంసా పట్టణంలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ పాల్గొని బైంసా ఏరియా ఆసుపత్రిలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, సిపి సాయిచైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, అదనపు డిసిపి బస్వారెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ..**

**నిర్మల్ టౌన్ :** జిల్లా పోలీసు కార్యాలయం,ఎస్పీ క్యాంపు కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి,సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 2026 పోలీసు క్యాలెండర్‌ను ఆమె విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏఎస్పీ సాయి కిరణ్,ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది**

### సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్య రమేష్

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ భూక్య రమేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేడు అందరిపై ఉందన్నారు. ఎస్.ఎన్,రెడ్డి, పుండలీక్, నారాయణ, కైలాష్ పాల్గొన్నారు.

**ఫిబ్రవరి 12న జాతీయ సమ్మెను విజయవంతం చేయండి : కేంద్ర కార్మిక సంఘాల పిలుపు..**

నిర్మల్ పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి అధ్యక్షతన కేంద్ర కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎస్.విలాస్, టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ల రాజన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కార్మిక వ్యతిరేక కోడ్లను తక్షణమే రద్దు చేయాలని,కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరారు.రాబోయే ఫిబ్రవరి 12న నిర్వహించనున్న జాతీయ సమ్మెను, అలాగే ఫిబ్రవరి 3న జరిగే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న, జిల్లా కార్యదర్శి రామలక్ష్మ ఖ,గంగన్న,సుజాత(సిఐటియూ) తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐ ఆధ్వర్యంలో ..**

**నిజామాబాద్ అర్బన్ :** సిపిఐ ఆధ్వర్యంలో నిజామాబాద్ పార్టీ కార్యాలయ ఆవరణలో 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని జాతీయ జెండాను పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై.ఓమయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు ఇమ్రాన్ అలీ, ముత్యాలు, అనిల్, నాయకులు రఘురాం, సుబోద్, స్వప్న, తిరుపతి, గోవర్ధన్, అంజయ్య, శ్రీనివాస్, భనుచందర్, రాములు, నరేష్, సులోచన తదితరులు పాల్గొన్నారు.

**కామారెడ్డి గాంధీభవన్‌లో ఘనంగా...**

**నిజాంసాగర్ :** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లాకేంద్రంలోని గాంధీభవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో పాల్గొని జెండా వందనం చేశారు.

**కానిస్టేబుల్‌కు ఉత్తమ అవార్డు**

**నిజాంసాగర్ :** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజాంసాగర్ మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శ్యామ్ అనే కానిస్టేబుల్ కామారెడ్డిలో అదనపు కలెక్టర్ విక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్, జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో శ్యామ్ సేవలకు గాను ఈ అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది కానిస్టేబుల్ శ్యాంకు తమ అభినందనలు తెలియజేశారు.

**నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని నగరం గ్రామ అంగన్వాడీ సెంటర్ లో పని చేసే అంగన్వాడీ హెల్పర్ గౌరీకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను గణతంత్ర దినోత్సవం సందర్భంగా మెదక్ గౌరవ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ గారిచే ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. దీనికి గాను గ్రామ సర్పంచ్ అంతంపల్లి సుశీల సురేష్ బాబు మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్, అంగన్వాడీ టీచర్ గుగ్లోత్ స్వప్న మరియు గ్రామస్థులు అభినందించారు.

**మెదక్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల అమలులో మెదక్ జిల్లా ఎప్పుడూ ముందడుగులో ఉంటుందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం 77వ రిపబ్లిక్‌డే వేడుకలను జిల్లా కేంధ్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ హాజరై జాతీయజెండాను ఎగురవేశారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగఫలితంగా సిద్దించిన స్వాతంత్ర్య ఫలాలు అందరికి అందాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించి 26.1.1950లో మనకు అందించారని, ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాతలైన మహనీయులను గుర్తుచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** భారత గణతంత్ర దినోత్సవాలన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జాతీయ పథాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ,సాదించిన ప్రగతి వివరాలను సంక్షిప్తంగా వివరించారు. వేడుకల్లో భాగంగా డీఆర్డీ ,హౌసింగ్ ,వైద్య ఆరోగ్యశాఖ ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ, అగ్నిమాపక శాఖ, మహిళాశిశు మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగుల, వయోవృద్దుల సంక్షేమ శాఖ ,పోలీస్ ,రవాణా, శాఖల ఆద్వర్యంలో శకట ప్రదర్శనలు నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోద్ధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు మాదురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, రెవెన్యూ డివిజనల్ అధికారులు రాజేందర్, దేవుజా, అధికారులు ,ఉద్యోగులు ,విద్యార్థులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్ టౌన్ :** సోమవారం, పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి,పోలీసు పరేడ్ వాహనంపై పరేడ్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లా లో వివిధ శాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిల,అదనపు కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్‌లు, బైంసా ఎ ఎస్పీ రాజేష్ మీనా,అదనపు ఎస్పీలు సాయికిరణ్, ఉపేంద్రా రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు,పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** జిల్లా కలెక్టరేట్లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య జాతీయ జెండాను ఆవిష్కరించి అనంతరం జాతీయ గీతాలాపనతో పాటు తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ భారత రాజ్యాంగం అందరికి సమాన హక్కులు ,బాద్యతలు, కల్పిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఉద్యోగ నిబద్ధతతో పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాదురి, పాండు, జిల్లా అధికారులు ,విద్యార్థులు కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



















### గవర్నమెంట్ డిగ్రీ కళాశాల

## ఆచార్యులకు ప్రతిష్టాత్మక అవార్డులు

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని గోపాల్ రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరోసారి జిల్లాలో తన ప్రత్యేకతను చాటుకుంది. కళాశాలలో పనిచేస్తున్న ఇద్దరు అధ్యాపకులు తమ సేవలకుగాను జిల్లా స్థాయి ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకొని కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. కళాశాలలో జంతు శాస్త్ర విభాగ ఆచార్చులుగా విధులు నిర్వహిస్తున్న డా.కొసారి సంతోష్ కుమార్,విద్యారంగంలో వారు అందించిన విశిష్ట సేవలను గుర్తించి''ఉత్తమ అధ్యాపకులుగా ప్రశంసా నీయ అవార్డు'' ప్రధానం చేయడం జరిగింది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే కాకుండా, పరిశోధన, అకడమిక్ అభివృద్ధిలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని అధికారులు పేర్కొన్నారు. అలాగే కళాశాలలో జాతీయ సేవ పథకం(ఎన్‌ఎస్‌ఎస్) కార్యక్రమాల నిర్వహణలో చురుకుగా పనిచేస్తూ, విద్యార్థులతో కలిసి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిన ఆరె రాజు,వారంరోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక సేవా కార్యక్రమాలకు గాను''ఉత్తమ జాతీయ సేవా సమన్వయ కార్యకర్త ప్రశంసా అవార్డు'' లభించింది.గ్రామాభివృద్ధి,శుభ్రత,అవగాహన కార్యక్రమాలలో ప్రత్యేక శిబిరాల్లో వారి సేవలు ప్రశంసలందుకున్నాయి. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా ఎస్.పిలు అభిలాష అభినవ్,ఫైజాన్ అహ్మద్,జానకి



షర్మిల చేతుల మీదుగా అవార్డులను అందుకోవడం అభినందనీయమని ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ళ బుచ్చయ్య, మాట్లాడుతూ,కళాశాల అధ్యాపకులు విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పని చేయడం వల్లే ఇటువంటి గౌరవాలు లభిస్తున్నాయి.ఇది మొత్తం కళాశాల కుటుంబానికి గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,సిబ్బంది పాల్గొని అవార్డు గ్రహీతలను హృదయపూర్వకంగా అభినందించారు.విద్యార్థుల కోసం చేసిన సేవలు,సమాజానికి అందించిన సేవలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని వారు తెలిపారు.

## సమ్మక్క-సారలమ్మ జాతర పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** గిరిజన ఆరాధ్య దేవతలు సమ్మక్కసారలమ్మ జాతర మహోత్సవ పోస్టర్లను సోమవారం మండల తహసీల్దార్ తిరుపతి, ఎంపిడిఓ ఆల్బర్ట్ ఆవిష్కరించారు. పెంచికల్‌పేట్ గ్రామంలో ఈ నెల 28, 29 తేదీల్లో (బుధ, గురువారాలు) రెండు రోజుల పాటు జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తిరుపతి మాట్లాడుతూ సమ్మక్కసారలమ్మలు గిరిజనుల ఆత్మగౌరవానికి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్, డిపిఓ ఆదేశాల మేరకు జాతర నిర్వహణకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపిడిఓ ఆల్బర్ట్ తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉస్మాన్, ఉప సర్పంచ్ శేఖర్, జాతర నిర్వహణ కమిటీ సభ్యులు, డిప్యూటీ తహసీల్దార్ చిన్ను, ఆర్ఐ రాజేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ జూగాడి రావు, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### అదనపు 8.68 కోట్లకు పరిపాలన

## అనుమతులు మంజూరు చేయాలి

**ప్రజాక్షం/నిజామాబాద్ :** అదనపు 8.68 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర ఆర్అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎంపీ ధర్మపురి అరవింద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించినట్లు తెలిపారు. గత 15 నెలలుగా పెండింగ్‌లోని మాధవ్‌నగర్ 193 సవరించిన అదనపు 8.68 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేయాల్సిందిగా రాష్ట్ర ఆర్అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తక్షణమే మంజూరు ఉత్తర్వులను జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.

## ఇప్పటికీ అట్టడుగు వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందడం లేదు



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 77 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ దళితులకు అట్టడుగు వర్గాలకు రాజ్యాంగ పలాలు అందడం లేదని సిపిఐ కార్యదర్శి మంద సుదర్శన్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సిపిఐ కార్మిక భవనంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 2002 వరుకు ఆరెస్సెస్ కార్యాలయంలో జాతీయ జెండాను గుర్తించని,ఎగురవేయని ఆరెస్సెస్ బిజెపి పార్టీ నేడు మేమే నిజమైన దేశబక్తుల మని ప్రజల్ని నమ్మించి మోసం చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటి సభ్యులు కామ్రేడ్ కడారి రాములు,కే వి అనసూయ, సోమ నాగ రాజు, వడ్డెపల్లి లక్ష్మన్, గాజుల లింగం, మంత్రి చంద్రన్న,వెంగళ ప్రసాద్,టి.పవిత్ర,స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తి ఉంటే భవిష్యత్తులో ఏదైనా సాధ్యమే

ప్రజాపక్షం /మల్లాపూర్ : యువతలో క్రీడా స్ఫూర్తి ఉంటే భవిష్యత్తులో ఏదైనా సాధ్యమవుతుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కెవిఎస్ఆర్ మినీ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మల్లాపూర్ ప్రీమియర్ లీగ్ నాలుగవ సీజన్ టోర్నీలోవిజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులను అందజేశారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో మొదటి విజేతగా నిలిచిన రఫీ రాయల్స్ 30 వేల రూపాయలు, రెండో విజేతగా నిలిచిన సామ నైట్ రైడర్స్ జట్టుకు 15వేల రూపాయల నగదు అందించి బహుమతులను ప్రధానం చేసి, మాట్లాడారు. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మ ణ్, మాజీ జెడ్పిటిసి సంధి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం సోమారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు తోట శ్రీనివాస్, తిట్ల లహరి రాజేష్, జెల్ల రాజు, నాయకులు డీలర్ మల్లయ్య, రంగు రామ గౌడ్, దశ రెడ్డి, నరేష్, మల్లాపూర్ పాలకవర్గ సభ్యులు ,ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

## చట్టబద్ధంగా పోలీస్‌లవిధులు



ప్రజాపక్షం/గోదావరిఖని : పోలీసులు నిరంతరం చట్టాన్ని గౌరవిస్తూ, నిబద్ధత, క్రమశిక్షణ, ధైర్యంతో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని రామగుండం సిపిఅంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను సిపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ద్వారా దేశ పౌరులకు సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి మౌలిక విలువలు లభించాయన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ సిపి ప్రశంస పత్రాలను అందజేశారు. అడిషనల్ డిసిపి(అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసిపి ఎం .రమేష్, ఏసిపి స్పెషల్ బ్రాంచి నాగేంద్రగౌడ్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఎఆ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచి ఇన్స్‌పెక్టర్లు, వివిధ ఇన్స్‌పెక్టర్లు, సిపిఒ సిబ్బంది, సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

## ‘డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ’ర్యాలీ




ప్రజాపక్షం/కొత్తపల్లి:గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ, డ్రీమ్ జూనియర్ కాలేజీల ఆధ్వర్యంలో దేశభక్తి వాతావరణంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించి 5 కిలోమీటర్ల మేర అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సంధర్భంగా సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా స్వేచ్ఛ, సమానత్వం, హక్కులు బాధ్యతలను అందించిన చారిత్రక రోజు అని పేర్కొన్నారు. దేశ ఐక్యత, క్రమశిక్షణ, సేవ అనే సందేశాన్ని సమాజానికి చే రవేయాలన్నదే ర్యాలీ లక్ష్యమన్నారు. 100 మీటర్ల త్రివర్ణ పతాకంతో విధ్యార్థు లు పాల్గొన్నారు. అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నా రు.

## జాతీయ జెండాకు అవమానం

ప్రజాపక్షం/దుబ్బాక: గణతంత్ర దినోత్సవం రోజు జాతీయ జెండాకు అవమానం జరిగింది. దుబ్బాక పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద రిపబ్లిక్ డే వేడుకల్లోభాగంగాదుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండాను ఆవిష్కరించే సమయంలో జెండా తలకిందులుగా ఎగిరింది. దీంతో వెంటనే గ్రహించిన ఎమ్మెల్యే జెండాను కిందికి దించి జెండాను సరిచేశారు.జెండాను ఆవిష్కరించిన తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ తీరును విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగదుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు అక్కడే ఉన్నకాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ జై కాంగ్రెస్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో బిఆర్ఎస్ నాయకులు జై తెలంగాణ అంటూ పోటాపోటీగా నినాదాలు చేయదంలో ఒక్కసారిగా ఇరువర్గాలమధ్య మాటమాట పెరిగి, పరస్పరం నెట్టుకుంటూ బాహాబహికి దిగారు. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పోలీసులు కలగజేసుకోని ఇరు పార్టీలనాయకులను శాంతింపజేశారు. ఎమ్మెల్యే కాన్వాయ్‌ను కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/చొప్పదండి:77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకున చొప్పదండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పార్టీ నాయకులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గుర్రం నీరజ, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పెరుమాండ్ల మానస గంగయ్య, కొట్టె అశోక్, మాజీ పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి, మునిగాల చందు, గుంటి స్వరూప, కనుమల్ల రాజశేఖర్, అఖిల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం

సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి : భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా అనేకమంది అమరులు చేసిన త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందని, దేశ స్వాతంత్ర ఫలాలను అన్ని వర్గాల ప్రజలకు అందించాలనే ఆలోచనతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని రాష్ట్ర ఎస్‌సి, ఎస్ టి , వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ శాఖ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు .సోమవారం 77 గణతంత్ర దినోత్సవ సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ఎగురవేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మంత్రి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ గాంధీజీ, నెహ్రూ, సర్దార్ వల్లబాయిపటేల్ వంటి అనేక మంది మహనీయుల ప్రాణత్యాగం ఫలితంగా దేశానికి స్వాతంత్రం వచ్చిందని మంత్రి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. దేశంలో రానున్న రోజుల్లో ప్రజలు సామరస్యంగా ఐక్యతతో ఉండాలని ఆశిస్తున్నాట్లు తెలిపారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమ కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నామని అన్నారు. గడిచిన రెండు సంవత్సరాలుగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు.రానున్న రోజుల్లో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముందుకు వెలుతున్నారని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ అధికారులు సహకరించి అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.కాంగ్రెస్ పార్టీలో చేరిక...

ధర్మపురి పట్టణంలోని 12వ వాడికి చెందిన చుక్క భీం రాజ్ సంధ్య దంపతులు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు బిఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన చుక్క భీమ్ రాజ్ సంధ్య దంపతులు కాంగ్రెస్‌లో చేరికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. చుక్క భీంరాజ్ సంధ్య గత మున్సిపల్ ఎన్నికల్లో 12 వ వార్డు నుండి పో టీ చేసి ఏడు ఓట్ల తేడాతో పరాజితులయ్యారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంఘనబ ట్ల దినేష్ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్ నాయకులు అప్పం తిరుపతి, కాశెట్టి రాజేష్ ,తదితరులు ఉన్నారు.

## ప్రతి పౌరుడు తన బాధ్యత నిర్వర్తించాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/ సిద్దిపేట : గణతంత్ర్య దినోత్సవం రాజ్యాంగ విలువలైన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పట్ల ప్రతి పౌరుడికి అవగాహన కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సిద్దిపేట పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రజల నుద్దేశించి మాట్లాడుతూ 1950 జనవరి 26న భారతరాజ్యాంగం అమల్లోకి రావటంతో భారత ఒక సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా అవతరించిందన్నారు. మన హక్కులతో పాటు మన కర్తావ్యాలను కూడ గుర్తుచేసుకొనే సందర్భమన్నారు. దేశ అభివృద్ధి, ఐక్యత ప్రజాస్వామ్య బలోపేతం కోసం ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేయూత పింఛన్‌లో జిల్లాలో 1.83 లక్షల మందికి ప్రతి నెల 39 కోట్ల 70 లక్షల పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు. పేదలకు సన్న బియ్యం ప్రతి నెల 3లక్షల 31వేల 970 కుటుంబాల్లో 10 లక్షల 32వేల 608 లబ్ధిదారులకు నెలకు 6556 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వరిధాన్యం 1లక్ష 2వేల 58 మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి 901.53 రూపాయలను నేరుగా రైతుల ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. సిద్దిపేటను అందరి సహకారంతో అన్ని రంగాల్లో ముందువరసలో నిలిపేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైఉన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు,శాంతిభద్రల రక్షణకు అహర్నిశలు కృషిచేసుతన్న పోలీసు యంత్రాంగానికి, వైద్యులకు . పారిశుధ్య కార్మికులకు,మీడియాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే స్వాతంత్ర్య సమరయోదుల కుటుంబాలకు జిల్లా పోలీస్ కమిషన్ రశ్మీపేరుమాల్‌తో కలసి సన్మానించారు.

## క్యాంపు కార్యాలయంపై జెండాను ఎగురవేసిన మంత్రి



ప్రజాపక్షం/హుస్నాబాద్: సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకను హుస్నాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. హుస్నాబాద్ పట్టణంలోని తెలంగాణ బిసి ,రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తన క్యాంపు కార్యాలయంతో పాటుస్థానికనాయకులతో పాటు పట్టణంలోని పలు అంబేద్కర్ చౌరస్తాలో,నేహ్రూ, గాంధీ, జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఘనతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతరాజ్యాంగం అమలులోకి వచ్చిన సందర్బంగా గణతంత్ర వేడుకను ఘనంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. అనంతరం బస్సుడిపోలో సిసిపనులకు శంకుస్తాపన చేశారు. అనంతరం మేడారం వెళ్లు ప్రయాణికులకు జెండాఊపి బస్సు ప్రారంభించారు. అనంతరం చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు చెందిన 16 మంది వికలాంగులకు బ్యాటరీ వీల్,ట్రై సైకిల్లాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ భి శివయ్య, గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, వైస్ చైర్మన్ బంక చందు, డి ఎం వేంకటేశ్, కమీషనర్ తో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఉత్సాహభరితంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు




ప్రజాపక్షం/కరీంనగర్:రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా పెరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిని వేడుకల్లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. బాలబాలికలు అందరూ ఏకరూప దుస్తులు ధరించి తమ అభినయంతో అలరింపజేశారు. జాతీయ సమైక్యతా భావం పెంపొందేలా దేశభక్తి గేయాలు ఆలపిస్తూ నృత్య ప్రదర్శనలతో అందరి దృష్టిని ఆకర్షించారు. అంతకుముందు క్యాంపు ఆఫీసులో, కరీంనగర్ క్లబ్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మువ్వన్నెల జెండా ఆవిష్కరించారు. **కలెక్టరేట్లో:**కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్డీవో మహేశ్వర్, ఏవో సుధాకర్, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కాళీ చరణ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

**పోలీస్ కమిషనరేట్‌లో:**కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కమిషనరేట్ కేంద్రం లోని క్వార్టర్స్ గార్డ్స్ మరియు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. కమిషనరేట్ పరిపాలన కార్యాలయం (సిపిఓ) వద్ద అడిషనల్ డిసిపి (అడ్మిన్) వెంకటరమణ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ వేడుకల్లో కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీసు ఉన్నతాధికారులు, మినిస్టీరియల్ విభాగం అధికారులు, సిబ్బంది మరియు ఇతర పోలీస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జిల్లా కేంద్రంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు వాడవాడల ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, విద్యాలయాలు, ఇతర సంస్థలలో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ హైమావతి, పోలీస్ కమిషనరేట్‌లో సిపి రశ్మీపేరుమాల్. సిద్దిపేట బిఆర్ఎస్ పార్టీ పక్షాన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి హరీష్‌రావు, లాల్ కమాన్ వద్ద చైర్మన్ మంజుల రాజనర్సు, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అశ్రీత్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. **విద్యార్థులు బాగా చదివి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధిస్తే తానే ఫీజు చెల్లిస్తా :**పదవ తరగతి ఉజ్వల భవిష్యత్‌కు పునాది అని.. పది ఫలితాల్లో సిద్దిపేట ఫస్టుగా నిలపాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సోమవారం స్థానిక సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవతరగతివిద్యార్థులకు అల్పాహారం. డిజిటల్ కంటెట్ బుక్స్ విద్యార్థులకు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కెసిఆర్ సిఎం అయ్యాక బిసి రెసిడెన్సియల్ స్కూల్స్‌ను వచ్చాయని.. బాలికలకు 50 శాతం బిసి గురుకులాలు ప్రారంభం చేసింది కెసిఆర్ అన్నారు. అన్ని గురుకులాలకును కెసిఆర్ ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. 35 బిసి రెసిడెన్సియల్ డిగ్రీ కళాశాలలు కెసిఆర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాగా చదవి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. బాసరలో త్రిపుల్ ఐటిలో సీటు సాధించినవారికి సొంతంగా ఐప్యాడ్ కొనిస్తానన్నారు. బైపిసివిద్యార్థులు బాగ చదివి ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధిస్తే మీ ఫీజును తాను భరిస్తానని హామీనిచ్చారు. వచ్చే ఏడాది సిద్దిపేట మెడికల్ కాలేజీలో 280 సీట్లు పెంచుతామన్నారు. ఆనంతరం సిద్దిపేట ప్రభుత్వవైద్య కళాశాలను అకస్మీకంగామాజీ మంత్రి హరీష్‌రావు తనిఖీ చేశారు.క్యాన్సర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇందులోపనిచేస్తున్నవారికి3నెలలుగా వేతనాలు లేవని వెంటనేవారికి జీతాలు చెల్లించాలని చెప్పారు.



## బ్రిటిష్ కబంధల హస్తాల నుంచి స్వాతంత్ర్యం

వేములవాడ శాసన సభ్యుడు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : భిన్నత్వంలో ఏకత్వం నినాదంతో బ్రిటిష్ కబంధహస్తాల నుంచి స్వాతంత్రం సిద్ధించిన అనంతరం మహాత్మా గాంధీ నేతృత్వంలో నాయకులు స్వాతంత్రం కోసం పోరాటం చేసి స్వాతంత్రం సాధించారని వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ అన్నారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సిరిసిల్ల డిసిసి కార్యాలయంలో జాతీయ జెండాను అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దేశంలోని వివిధ ప్రాంతాలు, మతాలు, కులాల సమూహాలను పాలించేందుకు అవసరమైన చట్టాలను రూపొందించే ప్రక్రియలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ రచన చేసి 1950 జనవరి 26న అమలు చేసుకోవడం జరిగిందన్నారు. స్వాతంత్ర్యనంతరం 1950లో డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో నిర్మింపబడిన రాజ్యాంగం అమలు చేసుకున్న రోజును పురస్కరించుకొని గణతంత్ర దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆకునూరి బాలరాజు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, గడ్డం నరసయ్య, సూర దేవ రాజు, వెంగళ లక్ష్మీ నరసయ్య, నేరెళ్ల శ్రీకాంత్ గౌడ్, చందన, రవి, యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు ఎన్ఎస్ఐ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదేశాలున్నా అంతా తూచ్

ప్రజాపక్షం/మల్లాపూర్ : జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసి జాతీయ జెండాను పంచాయతీ కార్యదర్శులు ఆవిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్న ఓ పంచాయతీ కార్యదర్శి మాత్రం ఆదేశాలకు విరుద్ధంగా అంత తూచ్ అనే విధంగా వ్యవహరించారు. మండల వ్యాప్తంగా 23 గ్రామపంచాయతీ ఉండగా 22 గ్రామపంచాయతీలో సర్పంచ్కు బదులు పంచాయతీ కార్యదర్శి లే జెండా ఆవిష్కరణ చేయగా ఒక్క నడికుడ గ్రామంలో మాత్రం పంచాయతీ కార్యదర్శి అలసత్వమో లేక మరేమో గాని సర్పంచ్ తో జెండా ఆవిష్కరణ చేయడం చర్చనీయాంశమైంది. కాగా జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఫోటోలు వీడియోలు సోషల్ మీడియాలో రావడంతో మిగతా గ్రామాల సర్పంచులు కంగుతిన్నారు . గెలిచిన మొట్టమొదటిసారి తమకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేకపోయామని, జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయంటూ పంచాయతీ కార్యదర్శులు జెండాను ఆవిష్కరించదంతో సర్పంచులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలోనే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జెండాను ఆవిష్కరించేలా అవకాశం ఇవ్వాలని కోరగా కలెక్టర్ ఆదేశాలు జారీ అయ్యాయని కానీ ఆదేశాలనుల్లంగించి జెండా ఆవిష్కరణ సర్పంచ్ తో చేయించడం మిగతా సర్పంచులలో, అధికారులు ప్రశ్నార్థకంగానే మారింది.

## రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కార్మికుల కృషి

సింగరేణి సంస్థ ను కాపాడుకోవాలి
సిపిఐ, ఎఐటియుసి నాయకులు



ప్రజాపక్షం/పెద్దపల్లి:దేశంలో రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రజలు,కార్మికులు కృషి చేయాలని, సింగరేణి సంస్థ ను కాపాడుకోవాలని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, సీనియర్ నాయకులు వేల్పుల నారాయణ, సిపిఐ నగర కార్యదర్శి కే.కనకరాజు లు పిలుపునిచ్చారు. సోమవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ , ఏఐటియుసి ల ఆధ్వర్యంలో జరిగిన పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎల్లా గౌడ్, కనకరాజు లు జాతీయ పతాకాలను ఆవిష్కరణ అనంతరం వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 26 జనవరి 1950న అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికత వంటి విలువలను దేశానికి అందించిందన్నారు. కానీ నేడు ఈ రాజ్యాంగ హక్కులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు, కార్మిక, రైతు వర్గాల హక్కులు కాలరాస్తూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా విధానాలు అమలు అవుతున్నాయని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పాలకులు, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ వర్గాలకు అప్పగిస్తూ, పేద ప్రజల జీవితాలను మరింత దుర్భరంగా మారుస్తున్నారన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతు సంక్షోభం దేశాన్ని కుదిపేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మిక వర్గానికి తీవ్ర నష్టం అని, సింగరేణి లో కొత్త గనులు రాక ఉన్న గనులు మూసివేత కు దగ్గరలో ఉన్నాయని, సంస్థ పరిరక్షణ కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా, రాజ్యాంగ విలువలను రక్షించేందుకు, ప్రజాస్వామ్య హక్కుల కోసం, శ్రమజీవుల ఐక్యతను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సిపిఐ , ఏఐటియుసి పిలుపునిస్తోందన్నారు. ప్రజలే నిజమైన పాలకులు అన్న సత్యాన్ని తిరిగి నిలబెట్టేందుకు సమిష్టి పోరాటాలు ఆవశ్యమన్నారు. ఏఐటియుసి అర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ , ఏఐటియుసి ప్రజా సంఘాల నాయకులు మాదన మహేష్, ఎస్ వెంకట్ రెడ్డి, తాల్లపెల్లి మల్లయ్య, సిద్దమల్ల రాజు, దొంత సాయన్న, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, బలుసు రవి, బండి మల్లేష్, బోయిన స్వామి, వై.లెనిన్, సూర్య, ప్రీతం, భక్తి శ్రీనివాస్, ఏ.వి.ఎస్. ప్రకాశ్, ఎర్రల రాజయ్య, శివ, ఆసాల రమ, తిరుమల, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ ,తదితరులు పాల్గొన్నారు.

# టి–20 సిరీస్‌కు దూరమైన తిలక్

## ప్రపంచ కప్‌లోపు సుందర్ కోలుకునేనా!

టి–20 ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌ను హ్యాట్రిక్ విజయాలతో కైవసం చేసుకున్న భారత జట్టుకు షాకింగ్ న్యూస్. సర్జరీ కారణంగా తొలి మూడు మ్యాచ్‌లకు దూరమైన తిలక్ వర్మ ఇంకా ఫిట్నెస్ సాధించలేదు. చివరి రెండు మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉంటాడని ఆశించిన టీమిండియాకు నిరాశే మిగిలింది. న్యూజిలాండ్‌తో చివరి రెండు మ్యాచ్‌లో సైతం తిలక్ ఆడడం లేదని సోమవారం బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వెల్లడించింది. దాంతో.. ఆసియా కప్ హీరో స్థానంలో స్క్వాడ్‌లోకి వచ్చిన శ్రేయాస్ అయ్యర్ టీంతోనే ఉండనున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో గాయపడిన తిలక్ వర్మ జట్టుకు దూరమయ్యాడు. సర్జరీ తర్వాత కోలుకుంటున్న ఆసియా కప్ హీరో పునరాగమనం మరింత ఆలస్యం కానుంది. 'సర్జరీ నుంచి కోలుకున్న తిలక్ వ్యాయామాలు చేస్తున్నాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిపుణుల పర్యవేక్షణలో అతడి రోజురోజుకు మెరుగవుతున్నాడు. అయితే.. మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించేందుకు తిలక్‌కు మరికొంత సమయం పట్టనుంది. కాబట్టి.. అతడు చివరి రెండు టి–20లకు అందుబాటులో ఉండడు. ఫిబ్రవరి 3లోపు పూర్తిస్థాయిలో ఫిట్గా ట్‌గా మారితే వామప్ మ్యాచ్, ప్రపంచకప్ కోసం భారత స్క్వాడ్‌తో కలుస్తాడు' అని బిసిసిఐ వెల్లడించింది.





# టి–20ల్లో తిరుగులేని టీమిండియా

## పాకిస్థాన్ రికార్డు బ్రేక్ చేస్తుందా!

టి–20 క్రికెట్‌లో అంచనాలు తలకిందులవుతుంటాయి. తమది కాని రోజున చిన్న జట్ల చేతిలో పెద్ద టీమ్‌లు సైతం కంగుతినడం ఈ ఫార్మాట్లో చూశాం. కానీ, భారత జట్టు మాత్రం మాకు మాత్రం ఇవేవీ వర్తించవంటోంది. స్వదేశమైనా, విదేశమైనా.. వేదిక మారినా సరే ఎదురైన ప్రత్యర్థినల్లా వేటాడుతూ.. వరుసగా సిరీస్ విజయాలతో అదరహో అనిపిస్తోంది. స్వదేశంలో టి–20 ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ.. సంచల న ఆటతో మరో రెండు మ్యాచ్‌లు ఉండగానే న్యూజిలాండ్‌ను చావుదెబ్బ కొడుతూ ట్రోఫీని కైవసం చేసుకుంది టీమిండియా. 11వ సిరీస్ విక్టరీతో అజేయ శక్తిగా అవతరించింది సూర్యకుమార్ సేన. గత రెండేళ్లలో భారతజట్టు టి–20ల్లో నమ్మశక్యంకాని విధంగా దూసుకుపోతోంది. విజయాన్ని ఆస్వాదిస్తూనే సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్‌శర్మ, రవీంద్ర జడేజాలు వీడ్కోలు పలికినా జోరు మాత్రం తగ్గలేదు. కుర్రాళ్లు అభిషేక్‌శర్మ, తిలక్‌వర్మ, ఆల్రౌండర్ హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్, బుమ్రా, కుల్దీప్లు.. విశేషంగా రాణిస్తూ విజయాల్లో కీలకమవుతున్నారు.

జనవరిలో మొదలై.. పురుషుల అంతర్జాతీయ టి–20ల్లో 2024 జనవరిలో మొదలైన టీమిండియా గెలుపు ప్రస్థానం నిరాటంకంగా సాగుతోంది. స్వదేశంలో అఫ్గనిస్థాన్‌కు చుక్కలు చూపిస్తూ సిరీస్ గెలుపొందిన టీమిండియా జూన్‌లో బార్బడోస్ వేదికగా టి–20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి రెండోసారి కప్‌ను కొట్టేసింది. విశ్వ విజేతగా శుభమిన్ గిల్ సారథ్యంలో జింబాబ్వే వెళ్లిన బృందం.. తిలక్ వర్మ మెరుపులతో అక్కడా జయకేతనం ఎగురవేసింది.

# ఇండియా-పాక్ మ్యాచ్ లేనట్లేనా..

## టి–20 వరల్ కప్‌ను పాకిస్తాన్ బహిష్కరిస్తుందా?

టి–20 వరల్ కప్ 2026లో పాల్గొనే అంశంపై పాకిస్తాన్ ఇంకా అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఐసిసి హెచ్చరించిన తర్వాత కూడా పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ (పిసిబి) వైఖరిలో మార్పు రానట్లు కనిపిస్తోంది. టోర్నీలో పాల్గొనే అంశంపై ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తోంది. టోర్నీ నుంచి బంగ్లాదేశ్ను ఐసిసి తొలగించి, ఆ స్తానంలో స్కాట్లాండ్‌కు అవకాశం కల్పించింది. దీంతో బంగ్లాకు మద్దతుగా తాము కూడా టోర్నీలో పాల్గొనే అంశంపై ఆలోచిస్తామని, తమ ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకుంటామని పాక్ ఐసిసికి తెలిపింది.

దీనికి స్పందించిన ఐసిసిసీసీ.. టోర్నీలో పాల్గొనకుంటే తీవ్ర ఆంక్షలు విధిస్తామని హెచ్చరించింది. దీంతో స్పందించిన పాక్.. టి–20 జట్టును ప్రకటించింది. ఇక.. టోర్నీలో పాక్ గ్యారెంటీగా



ఆడుతుందని అంతా అనుకుంటుండగా.. ఇక్కడే మెలిక పెట్టింది. తాము జట్టును మాత్రమే ప్రకటించామని.. దానర్థం టోర్నీలో తప్పకుండా ఆడుతామని కాదని పాక్ క్రికెట్ వర్గాలు అంటున్నాయి. ఈ విషయంలో పాకిస్తాన్ రెండు ఆప్షన్లు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటి.. బంగ్లాకు మద్దతుగా టోర్నీని పూర్తిగా బహిష్కరించడం. రెండోది ఇండియాతో జరిగే మ్యాచును మాత్రమే బహిష్కరించడం. ఈ రెండింటిలో ఏదో ఒకటి చేయాలని చూస్తోంది. మరోవైపు టోర్నీలో పాల్గొనడంపై అక్కడి ప్రభుత్వ అనుమతి కోసం పాక్ జట్టు ఎదురుచూస్తోంది. పాక్ ప్రభుత్వం సూచిస్తే టోర్నీని వీడేందుకు పాక్ సిద్ధంగా ఉంది.

ఇండియాలో టోర్నీ జరుగుతుండటమే బంగ్లా, పాక్ ఒత్తిడికి కారణం. ఇప్పటికే పాకిస్తాన్ ఆడే మ్యాచుల్ని శ్రీలంకలో నిర్వహించనుండగా.. తాము కూడా ఇండియాకు రాలేమని, తమకు కూడా మరో వేదిక కావాలని బంగ్లా డిమాండ్ చేసింది. కానీ, దీనికి ఐసిసి ఒప్పుకోకుండా.. స్కాట్లాండ్‌ను రంగంలోకి దించింది. ఇండియా–పాక్ మధ్య ఫిబ్రవరి 15న శ్రీలంకలోని కొలంబోలో మ్యాచ్ జరగనుంది.

యువతరంగం

# ఉపాధ్యాయులకూ నైపుణ్యాలు అవసరం

కేవలం విద్యార్థులు మాత్రమేకాదు... ఉపాధ్యాయులు కూడా నిత్య విద్యార్థిగా ఉండాలి. అప్పుడే వృత్తికి న్యాయం చేయగలుగుతారు. ప్రత్యేకించి శాస్త్రవిజ్ఞానం పరుగులు తీస్తున్న ఈకారంలో ఉపాధ్యాయులు నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఆధునిక విద్యార్థులను శక్తివంతం చేయడానికి అనుకూలత, సృజనాత్మకత, నవీనత వంటి అలవాట్లు చేసుకోవాలి. జీవితాంతం నేర్చుకుంటూ ఉండే వ్యక్తిగా మారాలి. విద్యారంగంలో కొనసాగుతున్న మార్పులను తెలుసుకోవాలి. అలాగే భవిష్యత్తులో అందుబాటులో ఉండే ఉద్యోగ అవకాశాలను కూడా విశదంగా తెలుసుకోవాలి. శాశ్వత అభ్యాసానికి నిదర్శనం కావాలి. అధునాతన విద్యా అవకాశాలు, మారుతున్న విద్యా విధానాలపై అవగాహన ఉండాలి. విద్యార్థులకు ఉత్తేజాన్ని, అనుకూలాన్ని ప్రోత్సహించాలి. సంబంధిత వర్గాలతో కలిసి పని చేయడంలో ముందుండాలి. భవిష్యత్తులో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో కీలకమైనదిగా మారుతోంది కాబట్టి, ఇప్పటి నుంచే ఆ దిశగా బలమైన పునాదులు వేసుకోవాల్సిన అవసరం ఉంది.


తమ ఆలోచనా ధోరణిని మార్చుకుంటూ, తాజా పరిజ్ఞానాన్ని పొందటంలో ఉత్సాహంగా ఉండాలి. విద్యా విధానంలో జరిగిన మార్పులను స్వీకరించడానికి స న్నద్ధంగా ఉండాలి. అడాప్టబిలిటీతోపాటు కాన్ఫిడె న్స్ (విశ్వాసం) కూడా ఉపాధ్యాయుల నైపుణ్యాల ను, వృత్తి నాణ్యతను పెంచుతుంది. ప్రతి ఉపాధ్యాయుడు తానేమిటో తెలుసుకుని, తనలోనూ తన విద్యార్థులు, సహచరుల్లోనూ నమ్మకం పెం చాలి. ఆత్మవిశ్వాసం కలిగిన ఉపాధ్యాయుడు వి ద్యార్థుల్లో మెరుగైన అభ్యాసాన్ని సాగించగలడని, ఇతరులను కూడా ఉత్తమ నిర్ణయాలకు ప్రేరేపించగలడని నమ్మాలి. అప్పుడే, విద్యార్థులపై, సమాజంపై ఉండే ప్రభావాన్ని మరింత శక్తివంతం చేయగలుగుతాడు. విద్యార్థులకు బోధించే ముందు ఉపాధ్యాయుడు ఆయా విషయాలను తెలుసుకోవాలి. అధ్యయనం చేయాలి. వివరించగలిగే పట్టు సంపాదించాలి. అందుకే, ఉపాధ్యాయుడు ఎప్పుడూ నేర్చుకునే వ్యక్తి కావాలి. ఆన్లైన్ కోర్సులు, వర్క్‌షాప్స్, సెమినార్లు వంటి వాటి ద్వారా నిరంతరం అభివృద్ధి చెందాలి. ఆధునిక ఉపాధ్యాయుడు నవ యువతను ఆకర్షించే విధంగా అభ్యాసంలో సరికొత్త ప్రక్రియలను, విద్యా అంశాలను ప్రవేశపెడుతూ ఉండాలి. విద్యా అనువర్తనాలు, ఆన్‌లైన్ రిసోర్సులను వినియోగిస్తూ, విద్యార్థులను ఉత్తేజపరిచే మార్గాలను అన్వేషించాలి. శక్తివంతం చేయడం ఉపాధ్యాయులు తమ విద్యార్థులను కీలక ఆలోచనలకు, సమస్య పరిష్కారాలకు ప్రోత్సహిస్తూ, వారికి సృజనాత్మకతను, స్వతంత్ర ఆలోచనను కలిగించేలా చూడాలి. ఈ నైపుణ్యాలు కలిగిన ఉపాధ్యాయులు మాత్రమే నేటి విద్యార్థులకు ఉత్తమ మార్గదర్శకులుగా తయారవుతారు.



యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

# సంకల్ప బలం..





ఒక చిన్నద్వీపం...ఆసముద్రంలో ఒక్క చుక్కలా కనిపిస్తున్నది. దానిపై ఎటు చూసినా సముద్ర మే. ఆ చిన్న భూభాగంపై నిలబడి ఒక మనిషి, తన కళ్లలో ఒక అగ్ని కలిగి, ప్రపంచాన్ని నిశ్శబ్దం గా చూడగలిగే శక్తి చూపించాడు. అతనికి యుద్ధ వస్త్రాలు లేవు, అణు బాంబులు లేవు.. కానీ, అతని చేతిలో ఒకేశక్తి ఉంది.. అదే వెనక్కి తగ్గని సంక ల్పం. ఆ మనిషి పేరు ఫిడెల్ క్యాస్ట్రో. ఈ చిన్న బాలుడు ఒకరోజు చరిత్రను మళ్ళీ రాయబోతాడని, అతని చిన్నప్పుడు ఎవరూ ఊహించి కూడా ఉండరు. అయితే, తనమాతృభూమి క్యూబా విదేశీ బానిసత్వంలో అనుభవిస్తున్న చెరను గమనించాడు. పంచదార, చమురు, భూములు... అదీఇదీ అని కాకుండా, అన్నీ వేరువారి చేతుల్లో. ప్రజలు పేదరికంలో మునిగిపోయినప్పుడు, రాజధానిలో జూదశాలలు, మద్యం మందిరాలు వెలుగులాటతాయి. ఫిడెల్ ఈ దోపిడీని చూసి నిశ్శబ్దంగా ఉండలేకపోయాడు. ఒక రోజు తుపాకీ ఎత్తాడు. గెలుపు రాలేదు. 1953లో జరిగిన దాడి ఓటమిగా మిగిలింది. జైలుశిక్ష ఎదుర్కొన్నాడు. అతని కథ ముగిసిందని అంద రూ అనుకున్నారు. కానీ జైలు అతని ఆత్మశక్తిని దెబ్బతీయలేకపోగా, అతని ఆలోచనలను మరిం త పదును పెట్టింది. 'నేను చేసిందని నేరమే అనుకుంటే.. చరిత్ర నన్ను క్షమిస్తుంది' అని కోర్టులో అతను చెప్పిన మాటలు ప్రజల గుండెల్లోకి దూసుకెళ్లాయి. వారిలో ఆలోచనలకు కారణమయ్యా యి. జైలు నుంచి విడుదలైన తర్వాత ఫిడెల్ దేశం విడిచాడు. కానీ, దేశంకోసమే మళ్లీ ఆయు ధం పట్టాడు. ఒక చిన్న పడవ, ఎనభై మంది యువకులు, తుఫాన్ల మధ్య ప్రయాణం. తీరానికి చేరగానే బుల్లెట్ల వర్షం. అందరూ చనిపోయారనుకున్న సమయంలో, పన్నెండు మంది మాత్రమే అడవుల్లోకి వెళ్లారు. రైతులు, ప్రజల వారికి మద్దతుతోపాటు ఆశ్రయం ఇచ్చారు. ఆ సమయంలోనే 'తుపాకీ పట్టడం కంటే ప్రజల మద్దతే ఎక్కువ బలం' అని తెలుసుకున్నాడు. ఏడాదిలో అడవుల్లోంచి ఒక విప్లవం పుట్టింది. మూడేళ్లలో నియంత కూలిపోయాడు. 1959లో ఫిడెల్ రాజధానిలో అడుగుపెట్టాడు. అది అధికార మార్పు కాదు, అది అధిపత్యానికి ఎదురెత్తిన చెంపదెబ్బ. ఆ తర్వాత అసలు యుద్ధం మొదలైంది. దాడు లు, కుట్రలు, హత్యా ప్రయత్నాలు. విషపూరిత సిగార్లు, పానీయాల్లో విషం, కిరాయి హంతకులు. ఒకసారి కాదు, పది కాదు, వంద కాదు, ఆరు వందల ముప్పై నాలుగు సార్లు ప్రయత్నించారు. కానీ ప్రతీసారి విఫలమయ్యారు. ప్రజలతో నిలబడిన విప్లవాన్ని ఓడించడం ఎంత కష్ట మో ప్రపంచం ప్రత్యక్షంగా చూసింది. 2016లో అతను కన్నుమూశా డు. ఈ రోజు కూడా ఆ చిన్న ద్వీపం నిలబడి ఉంది, ఎన్నో కష్టాలు, ఎన్నో ఒత్తిళ్ల మధ్య. అది ఒక విషయాన్ని చెబుతోంది... సామ్రాజ్యాలు ఆయుధాలతో గెలుస్తా యి, కానీ ప్రజలు సంకల్పంతో నిలబడతారు. ఫిడెల్ క్యాస్ట్రో అదే నిరూపించాడు. యువతకు ఆయనను మించిన మార్గదర్శకుడు, స్ఫూర్తిప్రదాత ఎవరు ఉంటారు?

# మునిసి'పోల్'లో కలిసి పోటీచేసేందుకు సహకారం

## కాంగ్రెస్ పార్టీకి సిపిఐ జాతీయ నాయకుడు చాడా వెంకట్‌రెడ్డి సూచన

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్రంలో రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సహకరించాలని సిపిఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన సిపిఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సిపిఐ మిత్రపక్షంగా ఉందని, రానున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు బలమైన డివిజన్‌లను సిపిఐకి కేటాయించాలని ఆయన కాంగ్రెస్ పార్టీని కోరారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్‌లలో పోటీ చేసేందుకు సిపిఐ అభ్యర్థులకు స్థానిక ఎమ్మెల్యే సహకారం అందించాలన్నారు. కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి ఉద్యమాలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి పేద ప్రజలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందపి కేంద్రప్రభుత్వంపై మండిపడ్డారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్, రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నగర కార్యదర్శి కే.కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్రం

## సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి భిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులు హరిస్తుందని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆరోపించారు. కార్మిక రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న చేపట్టనున్న దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని జిల్లాలోని బాలసముద్రం సిపిఐ కార్యాలయంలో సోమవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హనమకొండ జరిగింది. సదస్సుకు ఎఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి అధ్యక్షత వహించగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రామ్మూర్తి, సహాయ కార్యదర్శి రామా రాజేష్‌ఖన్నా, ఉపాధ్యక్షులు లంకదాసరి అశోక్, సహాయకార్యదర్శులు బత్తిని సదానందం గౌడ్, గుంటి రాజేందర్, ఇల్లందుల రాములు, దుర్గాప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగ విలువల రక్షణకు పోరాటాలు

## గణతంత్ర వేడుకల్లో సిపిఐ నేతల పిలుపు

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** రాజ్యాంగ పరిరక్షణ, లౌకిక వ్యవస్థ పటిష్టతకై ప్రజాస్వామ్యవాదులు ఏకం కావాలని, రాజ్యాంగ పరిరక్షణకు ఐక్య పోరాటాలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపు నిచ్చారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డిభవన్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, మచ్చ రమేష్, బామండ్లపెల్లి యుగంధర్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, బూడిద సదాశివ, బోనగిరి మహేందర్, నాయకులు గామినేని సత్యం, కసిబోజుల సంతోష్‌చారి, కూనరవి, చెంచల మురళి, కసిరెడ్డి లతశ్రీ, కూన సమత, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్...



యాదాద్రిభువనగిరి...

### రాజ్యాంగం ఫలాలు పేదలకు అందని ద్రాక్షే..

**మంచిర్యాల:** రాజ్యాంగం కల్పించిన హక్కులు నేటికీ సామాన్యులకు అందని ద్రాక్షలాగే మిగిలిపోయాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ అన్నారు. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, లింగం రవి, ముస్కే సమ్మయ్య, మిరియాల రాజేశ్వర్ రావు, కొట్టే కిషన్ రావు, కుంచాల శంకరయ్య, దేవీ పోచన్న పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ :** రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు దేశ పౌరులు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె..పద్మావతి అధ్యక్షతన జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, పి.సురేష్. బాల్‌రాజు,పట్టణ కార్యదర్శి కోటకద్ర నరసింహ, చాంద్ భాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ మెట్టు మహేష్, దేవానంద్ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఇందిరక్క, పూజిత, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రీవల్లిక, గంటల శ్రీను, శ్రీహరి, రమేష్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

### భారత రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి పునాది..

**భువనగిరి రూరల్ :** భారత రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి పునాది అని సిపిఐ యాదాదిర జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జాతీయ పతాకాన్ని దామోదర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్, ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మండల కార్యదర్శి దాసరి లక్ష్మ య్య, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు సామల భాస్కర్, ముంతాజ్ బేగం, నాయకులు చొప్పరి సత్తయ్య, చింతల మల్లేష్, బద్దం వెంకట్ రెడ్డి, కొత్త కృష్ణ, పుట్ట రాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

### రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**నల్లగొండ:** రాజ్యాంగ నిర్మాతల ఆశలు, ఆకాంక్షలకు భిన్నంగా దేశంలో పరిపాలన కొనసాగిస్తూ రాజ్యాంగాన్ని మార్చాలని మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు లౌకికవాదులు కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాడాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను పార్టీ సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఎల్ శ్రవణ్ కుమార్. జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కెవెస్ రెడ్డి, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, పట్టణ సహాయ కార్యదర్శి వి.లెనిన్, ముండ్ల ముత్యాలు, మీతపల్లి నందం, దోటి పండరి, సుజాత, విజయ్ కౌసల్య, అక్కలయ్య, యూసుఫ్, బాసాని వెంకటయ్య, కె.నారాయణ, గుండె రవి, రెవెల్లి యాదయ్య, చింత ధనలక్ష్మి, వెంకన్న, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ..

**మహబూబాబాద్ :** సిపిఐ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి .విజయసారథి జాతీయ జెండాను ఎగురవేసి అనంతరం మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను ఎదుర్కొనేందుకు లౌకిక శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి, నాయకులు పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , తండా సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రవణ్, నర్రా శ్రావణ్, కేదాసు రమేష్, మేక వీరన్న, ఆబోతు అశోక్, ఎండి ఫాతిమా, జనగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, ఎండి మహమూద్, నాగేల్లి యాకమ్మ, తోట రాజకుమారి, చిదిరాల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్


### ప్రజాస్వామ్య విలువలు పరిరక్షణకు దేశ పౌరులు కృషి చేయాలి

**సూర్యాపేటటౌన్:** రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు దేశ పౌరులు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అధ్యక్షతన ధర్మబిక్షం భవన్ సిపిఐ కార్యాలయం వద్ద జాతీయ జెండాను బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కెవిఎల్‌లు ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు దూళిపాల ధనుంజయనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్‌కుమార్, ఎండి పాషా, నిమ్మల ప్రభాకర్, నీలా శ్రీనివాస్, చిలకరాజు శ్రీను, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.


**సిద్దిపేట :** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించకుని సిద్దిపేట జిల్లా కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్ వద్ద సిపిఐ జిల్లా కార్యాదర్శి మంద పవన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.



మంచిర్యాల...



మహబూబ్‌నగర్..



సిద్దిపేట..



సూర్యాపేట...



## ఒంటరిగా బరిలోకి సిపిఐ

రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ బంటరిగానే బరిలోకి దిగుతున్నట్లు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా అన్నారు. సోమవారం ఈ మేరకు ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ముత్తగూడెంలో సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జరగబోవు ఎన్నికల్లో సిపిఐ 15వార్డుల్లో పోటీ చేయనుందన్నారు. కావున సిపిఐ శ్రేణులు సమయత్తం కావాలని పిలుపునిచ్చారు. గెలుపు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆయావార్డులో సిపిఐ జెండాను ఎగరేసేందుకు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. అనంతరం విజయ వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, పగిళ్ల వీరభద్రం, వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మున్సిపాలిటీ సిపిఐ డివిజన్ల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో ప్రజాస్వామ్యం : జమ్ముల



సిపిఐ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ


**ప్రజాపక్షం/ఖమ్మం :** బిజెపి పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. లౌకికవాదానికి తూట్లు పొడుస్తూ మతోన్మాద చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో సోమవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ 77 సంవత్సరాల గణతంత్రం ముందెన్నడు లేని రీతిలో సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందన్నారు. సర్ పేరుతో ఓటు హక్కును కాలరాసిన బిజెపి త్వరలో చేపట్టబోయే జన గణనతో అస్మదీయులకు జనాభా లెక్కల్లో స్థానం లేకుండా చేయాలని భావిస్తుందన్నారు. దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, కార్యాలయ కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు తాటి నిర్మల, సైదా, నంబూరి కేశవరావు, మోహన్‌రావు, పోటు పూర్ణచందర్‌రావు, సింగరేణి ఉద్యోగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సకల వసతుల నిలయంగా శ్రీసిటీ : చైర్మన్



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** శ్రీ సిటీలో నివసించే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు దశల వారీగా సమకూర్చుతామని శ్రీ సిటీ చైర్మన్ గరికపాటి వెంకట్రావు తెలిపారు. ఇప్పటికే విశాలమైన రోడ్లు ఉన్నాయని వాటిని మరింత అభివృద్ధి పరిచి జిల్లాలోనే శ్రీసిటీని మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక అన్నపూర్ణ నిలయం అపార్టుమెంట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ నిలయం చైర్మన్ ఎన్.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో వెంకట్రావు మాట్లాడుతూ ప్రజల ఆహ్లాదం కోసం పార్కును మున్సిపాలిటీ సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. వాకింగ్ ట్రాక్, ఇండోర్ షటిల్ కోర్టుతో పాటు వీలైనంత త్వరలో జిమ్ కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పి.లక్ష్మణ్, నల్లమోతు నారాయణ, నరేందర్ రాజు, ఎం.నాగరవిప్రసాద్, జల్లా సుధాకర్, సదానందం, ఎం.లక్ష్మి నారాయణ, రామిరెడ్డి, మువ్వా శైలజ, సరస్వతి, తదితరులు ఉన్నారు.

## రఘునాథపాలెం మండల వ్యాప్తంగా..



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను రఘునాథపాలెం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సోమవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపిడివో అశోక్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించిన రోజును పురస్కరించుకుని గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకుంటారని ఆయన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని తహసీల్దార్ శ్వేత ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్ వద్ద సిఐ ఉస్మాన్ షరీఫ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుధాకర్‌రెడ్డి, యుడిసి రాజశేఖర్, ఎల్‌డిసి వంశీ, ఏపివో పద్మయ్య నాయుడు, ఈసి దీపక్, కంప్యూటర్ ఆపరేటర్ మహేష్, రవికుమార్, సిబ్బంది పాషా, పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సొసైటీ కార్యదర్శులు, హెచ్ఎంలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మామిడిపల్లి సత్యనారాయణ మృతి

సంతాపం తెలిపిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండల కొండాయిగూడెం గ్రామానికి చెందిన మామిడి పల్లి శ్రీను తండ్రి మామిడి పల్లి సత్యనారాయణ సోమవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరుమండల, పట్టణకార్యదర్శిలు జక్కుల రాజబాబు, దుర్గ్యాల సుధాకర్, మాజీ ఎంపిపి ఎడారి రమేష్, సిపిఐ మణుగూరు మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, మాజీ సర్పంచ్ బాడిస సతీష్, మధర్, శంకర్, ఎల్లరావు, వెంకటేశ్వర్లు, శ్రీను వెంకన్న, లింగయ్య వినోద్‌లు సందర్శించి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల ను ఓదార్చారు.

# ఏదులాపురం మున్సిపాలిటీని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా

రూ.2.5కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గత ప్రభుత్వం కమీషన్ల కోసమే కాళేశ్వరం కట్టింది

అర్హులైన ప్రతి పేదవానికి ఇళ్లస్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రాబోయే రోజుల్లో ఏదులాపురంమున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చుదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సుమారు రూ.2.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసిరోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... కమిషన్ల కోసమే గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం కట్టిందని ఆరోపించారు. కాళేశ్వరం కడితే కమీషన్లు వస్తాయి ఇళ్లు కడితే కమీషన్లు రావాని గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పేదవారి కష్టం తెలిసిన ప్రభుత్వం తమదని, అందుకే అర్హులైన ప్రతి పేదవానికీ ఇళ్లతో పాటు ఇళ్ల స్థలాలు కూడా ఇస్తామని ప్రకటించారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సంక్షేమపథకాల అమలులో ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. గత ప్రభుత్వం రైతుబంధు కింద రూ.10వేలు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.12 వేలు అందిస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల దీవెనలు తమ ప్రభుత్వంపై ఉండాలని కోరారు.

**రూ.2.5కోట్లతో శంకుస్థాపనలు..**

ఈ పర్యటనలో భాగంగా నారాయణపురంలో రూ.22.6లక్షలతో సిసి డ్రైన్లు, ఎస్‌సి, బిసి కాలనీలో రూ.72లక్షల వ్యయంతో అంతర్గత సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే గుడిమళ్ళలో రూ.44.55 లక్షలతో ఇందిరమ్మ కాలనీ1లో రూ.75.85 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సిసిరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. వీటితో పాటు నంద్యాతండాలో రూ.26.55 లక్షల వ్యయంతో డ్రైన్లు, జంగాల కాలనీలో రూ.14.10లక్షలతో సిసిరోడ్లు, డ్రైన్లు పనులకు శంకుస్థాపన చేశారు.



## భక్తులకు అందుబాటులో ఆర్టీసీ బస్సులు

ప్రజా రవాణాలో ఆర్టీసీ పాత్ర కీలకంగా ఉండాలి

మేడారం ప్రత్యేక బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్ళే భక్తులు కోసం కొత్తగూడెం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రత్యేక బస్సులు సర్వీసులు నడపడం అభినందనీయమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక డిపో పరిధిలో ప్రత్యేక బస్సు సర్వీసులను ఆయన పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జాతర సమయంలో భక్తులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు తలెత్తకుండా యాజమాన్యం ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవేటు వాహనాల్లో కంటే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం ఎంతో సురక్షితం అని, భక్తుల రద్దీకి అనుగణంగా బస్సులను నడపాలని సూచించారు. కార్మికులు, పేద ప్రజలు ప్రధానంగా ఈ జాతరకు అధిక సంఖ్యలో తరలివస్తారని వారి సౌకర్యార్థం బస్టాండ్ ఆవరణలో మంచినీరు, నీరు, మెడికల్ క్యాంపు వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. జాతర ముగిసే వరకు నిరంతరం బస్సు సర్వీసులు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, మెకానిక్ ఫోర్‌మెన్ వాకా వెంకటేశ్వర్లు, వై.నాగేశ్వరరావు, కే.మోహన్ రావు, విజయలక్ష్మి, ఎంప్లాయిస్ యూనియన్, సిపిఐ నాయకులు, కందుల భాస్కర్, గెద్దాడు నగేష్, యూసుఫ్, ధర్మరాజు, అన్నెం లక్ష్మి నారాయణ, మిర్యాల రాము పాల్గొన్నారు.

## రూ.162.54 కోట్లతో పాలేరు లింక్ కెనాల్ పనులు

జిల్లా అభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు

సన్నవడ్లకు బోనస్, గ్యాస్ సబ్సిడీ

గణంత్ర దినోత్సవంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ఖమ్మం :** మున్నేరు జలాలను సద్వినియోగం చేసుకునేందుకు రూ.162.54 కోట్లతో మున్నేరు, పాలేరు లింక్ కెనాల్ పనులను చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. దీనితో వృథాగా పోతున్న 50 టిఎంసిల మున్నేరు జలాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు 38వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని తెలిపారు. రూ.120కోట్ల విద్యుత్ భారం తగ్గుతుందని ఆయన తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఖమ్మం పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సన్నవడ్లు పండించిన 39,475 మంది రైతులకు రూ.113.57 లక్షల బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది నూతనంగా ఎనిమిదిన్నర వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిరుపేదలైన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుందన్నారు. ఇప్పటికీ 55494 రేషన్ కార్డులను జారీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మహలక్ష్మి పథకం ద్వారా 2.43 లక్షల మంది గ్యాస్ సబ్సిడీ పొందుతున్నారని ఇందుకు ప్రభుత్వం రూ.26.31 కోట్లు ఖర్చు చేస్తుందని ఆయన తెలిపారు. మహిళలకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయడంతో పాటు మధ్యతరహా ప్రాజెక్టులైనా వైరా, లంకాసాగర్ ప్రాజెక్టులకు అనుసంధానం చేస్తామని తెలిపారు. సత్తుపల్లికి సాగునీటిని అందించే ప్యాకేజీ 9, 10 పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో 29వేల మంది రోగులకు రూ. 85.52 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రం సింగ్, అడిషనల్ డిసిపి ప్రసాద్, జెడ్పిసిఈవో దీక్షారైనా తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలలో 'ఆమే' నిర్ణేత

అన్ని మున్సిపాలిటీల్లోనూ మహిళ ఓటర్లే అధికం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల్లో విజేతను మహిళలే తేల్చనున్నారు. ఎన్నికలు జరగనున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఒక కార్పోరేషన్, రెండు మున్సిపాలిటీల్లోనూ, ఖమ్మంజిల్లాలో ఎన్నికలు జరగనున్న ఐదు మున్సిపాలిటీలలోనూ మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. మూడొంతుల వార్డులలో మహిళ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. మహిళ ఓటర్ల మొగ్గుపైనే మున్సిపల్ ఫలితాలు ఆధారపడి ఉంటాయి. రాజకీయ పార్టీలు మహిళలను ఆకట్టుకునే పనిలో పడ్డాయి. మహిళ ఓట్లు రాబట్టగలిగితే తాము విజయం సాధించవచ్చునన్న భావనలో రాజకీయ పార్టీలు ఉన్నాయి. తొలిసారి ఎన్నికలు జరగనున్న కొత్తగూడెం కార్పోరేషన్‌లో 60 వార్డులకుగాను మొత్తం 134774 ఓట్లు ఉండగా ఇందులో మహిళ ఓటర్లు 70314 కాగా పురుష ఓటర్లు 64431 మంది మాత్రమే ఉన్నారు.

మున్సిపాలిటీల వారీగా మహిళ, పురుష ఓటర్ల సంఖ్య ఈవిధంగా ఉంది.

| క్రమ సంఖ్య | డివిజన్లు | మున్సిపాలిటీలు | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|---|---|
| 1. | 60 | కొత్తగూడెం (కార్పోరేషన్) | 64431 | 70314 | 134774 |
| 2. | 20 | కల్లూరు | 9081 | 9785 | 18866 |
| 3. | 20 | వైరా | 11696 | 12991 | 24689 |
| 4. | 32 | ఏదులాపురం | 21742 | 23511 | 45256 |
| 5. | 23 | సత్తుపల్లి | 13620 | 15195 | 28830 |
| 6. | 22 | మధిర | 12251 | 13426 | 25679 |
| 7. | 24 | ఇల్లందు | 16622 | 17469 | 33723 |
| 8. | 22 | అశ్వారావుపేట | 8085 | 8761 | 16850 |

## నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం

**ప్రజాపక్షం/పాల్వంచ :** సిపిఐ పార్టీ ఏఐటియుసి అనుబంధం పాల్వంచ మండల కార్పెంటర్స్ యూనియన్, మండల బిల్డింగ్ పేయింటింగ్ వర్కర్స్, భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో, వనమా కాలని, జయమ్మ కాలని, పాలకొయ్యతండా, పాల్వంచ పట్టణంలోని పలు డివిజన్‌లలో సోమవారం 77వ, గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నూతన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. సిపిఐ అనుబంధ ఏఐటియుసి కార్మిక సంఘం (కార్పెంటర్) ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలలో నిర్వహించిన గణతంత్ర వేడుకలలో ఆయన పాల్గొన్నారు. జాతీయ జెండాలను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకొన్న హక్కులను కాలరాసివేసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన లేబర్ కోడ్‌లను తెచ్చిందనిమండిపడ్డారు. ఈ కోడ్‌లతో కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కార్మికులకు జరిగే అన్యాయాలపై ప్రశ్నించేతత్వాన్ని కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పోరేట్ వర్గాలకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ స్వాతంత్ర సంగ్రామంలో సిపిఐ కీలక పాత్ర పోషించినదన్నారు. సంపూర్ణ స్వాతంత్రం కావాలని మొదటగా డిమాండ్ చేసింది సిపిఐ పార్టీ అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, యూనియన్ గౌరవ అధ్యక్షులు వైకుంఠనాథ్, అధ్యక్షులు రావులోజు వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి అద్దంకి జోగేశ్వరాచారి, గౌరవ సలహాదారులు కాసర్ల రామారావు, మడుపు ఉపేంద్రాచారి, ధనుమూరి వీరాచారి, జుజ్జూరి ప్రభాకరాచారి, ఉపాధ్యక్షులు సంగోజు వెంకటేశ్వర్లు, మామిళ్ళపల్లి శ్రీనివాసాచారి, శ్రీరాముల వెంకటేశ్వర్లు, కన్నెకంటి వాసు, చిలమ్రి శ్రీనివాసాచారి, పానుగంటి శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, రామడుగు రామాచారి, సోమేశ్వరాచారి, నాగరాజు, కాసర్ల రమేష్, పురుషోత్తమాచారి, ఏఐటియుసి రాష్ట్ర నాయకులు బండి నాగేశ్వరరావు, నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, జకరయ్య, వైఎస్ గిరి, లాల్‌పాషా, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనాభివృద్ధికి పునరంకితం

జెండా ఎగురవేసిన ఐటిడిఏ పిఒ రాహుల్



**ప్రజాపక్షం/భద్రాచలం:** ఈ గణతంత్ర వేళ గిరిజనాభివృద్ధికి పునరాంకితం అవుతున్నట్లు ఐటిడిఏ పిఒ బి.రాహుల్ తెలిపారు. భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుక భద్రాచలం ఐటిడిఏలో ఘనంగా నిర్వహించారు. ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ గిరిజనాభివృద్ధి కోసం ఏర్పాటైన ఐటిడిఏల ద్వారా గిరిజనులకు మేలు చేకూరే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మేలే చేసే దిశగా కృషి చేస్తున్నామని, గిరిజన రైతులకు మేలు చేసే దిశగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, డిడి అశోక్, ఏఓ సున్నం రాంబాబుతో పాటు పలు శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**సబ్ కలెక్టర్, ఏఎస్‌పి:** స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట, ఏఎస్‌పి కార్యాలయంలో ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్ జాతీయ జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా డా.బిఆర్ అంబేద్కర్‌తో పాటు పలువురు జాతీయ నాయకుల చిత్రపాటలకు పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత 77వ గణతంత్ర దినోత్సవం సాక్షిగా ప్రభుత్వ నియమనిబంధనలకు అనుసరించి ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్, ఏఎస్‌పి కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో జిల్లా పురోభివృద్ధి

జాతీయ జెండా ఎగురవేసిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేత



**ప్రజాపక్షం/కొత్తగూడెం/భద్రాచలం :** భారత 77వ గణతంత్ర వేడుకలు జిల్లా వ్యాప్తం గా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడిఓసిలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పి కార్యాలయంలో ఎస్‌పి రోహిత్ రాజ్, ఐటిడిఏలో పిఓ బి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట, ఏఎస్‌పి కార్యాలయంలో ఏఎస్‌పి విక్రాంత్ సింగ్ కుమార్‌తో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు పలు విద్యా సంస్థల్లో జాతీయ జెండాలు రెపరెపలాడాయి. జిల్లా కేంద్రంలోని ప్రగతి మైధానంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి ఒక ధృజమైన రాజ్యాంగం కావాలని భావించి దార్శినికులు, మేధావులు రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేసి డా.బిఆర్ అంబేద్కర్ నేతృత్వంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని రూపొదించారన్నారు. జిల్లా అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతుందని, ఇందు కోసం ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉద్యోగులు ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. ఆట్టుకునేలా వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన కళారూపాలను తిలకించిన ఆయన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అభినందించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే సిబ్బందిని ఉత్తమ ఉద్యోగ ప్రశంసా పత్రాలను అందిజేసిన అనంతరం వయోవృద్ధులకు షాలువాలు కప్పి గౌరవించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల రావు, విద్యాచందనతో పాటు జిల్లాలోని పలు శాఖల ప్రధాన అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**సిఎస్ఆర్ సమ్మిట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి**

వివిధ ఆదివాసీ గ్రామాల్లో కార్పోరేటే సంస్థల ద్వారా మౌళిక వసతుల కల్పనకు నేడు జరిగే సిఎస్ఆర్ సమ్మిట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా కలెక్టర జితేష్ వి పాటిల్ తెలిపారు. సోమవారం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో ఆయన ఐటిడిఏ పిఓ రాహుల్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. సిఎస్ఆర్ ప్రతినిధులు పాలసీ మేకర్స్ డవలెప్మెంట్ పార్టనర్స్ ఈ సమ్మిట్‌కు హాజరవుతున్నారని తెలిపారు. అధికారులంతా సిఎస్ఆర్ సమ్మిట్ విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, డిఆర్డిఓ విద్యాచందన, సిపిఓ సంజీవరావు, తహశిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, ఆర్ఐ కీర్తి, గ్రామ పంచాయితీ ఇఓ శ్రీనివాస్, జేడిఎం హరికృష్ణ, ఏపిఎం ప్రసాద్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఎస్పి కార్యాలయంలో:** జిల్లా కేంద్రంలోని ఎస్పి కార్యాలయంలో ఎస్పి రోహిత్ రాజ్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటోందని, జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా నిత్యం భద్రత కల్పిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## మేడారానికి పగిడిద్దరాజు

స్వాగతం పలికిన మేడారం ట్రస్ట్‌బోర్డు చైర్మెన్ సుకన్య



**ప్రజాపక్షం/గుండాల :** అరెం వంశీయుల ఆరాధ్య దైవం అయిన మేడారం సమ్మక్క భర్త పగిడిద్దరాజు మండల పరిదిలోని యాపలగడ్డ గ్రామంలో ఉన్న గద్దెల వద్దనుండి అరెం వంశస్తులు కాలినడకన పగిడిద్దరాజు పడగలతో సోమవారం మేళతాలాలనడుమ బయలుదేరారు. ముందుగా పగిడిద్దరాజు గద్దెల వద్దకు మేడారం ట్రస్టు బోర్డు చైర్మెన్ అరెం సుకన్య, మాజిచైర్మెన్ లచ్చుపటేల్, సమ్మక్క పూజారి సిద్దబోయిన స్వామి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాగతం పలికారు. అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు గుండాల మండలం యాపలగడ్డలోనే ప్రారంబంకావడం విశేషం. రెండేడ్లకు ఒకసారి జరిగే మహా జాతరకు అరెం వంశానికి చెందిన పగిడిద్ద రాజును అరెం వంశీయులు తీసుకెల్లడం అనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ట్రస్టు బోర్డు చైర్మెన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో యాపలగడ్డలో జరిగే పగిడిద్దరాజు జాతర అభివృద్ధికి ప్రత్యేక కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అరెం కాంతారావు, నాగన్న, లక్ష్మి నర్సు, బుచ్చయ్య, అప్పయ్య, అరెం సత్యం, బస్వయ్య, ఇద్దయ్య, చిన్నకాంతారావు, అరెంవంశీయిలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/వరంగల్:** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాన ప్రాధాన్యతతో అమలు చేస్తూ ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.294 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద లతో కలిసి శంకుస్థాపన చేశారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో రూ.20 కోట్ల టీయూఎఫ్ఐడీసీ, ఇతర నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, పార్కుల అభివృద్ధి, రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.3.5 కోట్లతో స్పోర్ట్స్ స్టేడియం, సబ్ జైల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాన ప్రాధాన్యతతో అమలు చేస్తూ ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. వర్ధన్నపేట మున్సిపాలిటీని నందనవనంగా తీర్చిదిద్దేందుకు స్థానిక ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించిన మంత్రి, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చే ప్రక్రియలో 100 శాతం విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

## సిపిఐ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** సిపిఐ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి గణతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1950, జనవరి 26వ తేదీన రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని అప్పటి నుంచి భారతీయులకు నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్రం లభించాయన్నారు. దీన్ని ప్రతి పౌరుడు పండుగలా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరు సుగుణమ్మ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య, నాయకులు సదానందం, ప్రశాంత్, ఎల్లయ్య, రమేష్, యాదగిరి, కుమారస్వామి, మల్లేశం, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## విబి జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలి: చామల



**ప్రజాపక్షం/జనగామ :** కేంద్రలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఉపాధి హామి చట్టం గ్రామీణ కూలీల పొట్ట కొట్టేలా ఉందని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. జనగామ మండలంలోని ఓబుల్ కేశవాపూర్ గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజిఎస్‌పై కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భువనగిరి ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డి, ఏఐసిసి కార్యదర్శి విశ్వనాథన్ కలిసి బుధవారం భారీ ర్యాలీ నిర్వయించారు. ఈ సందర్భంగా ఎంపి చామల కిరన్ కుమార్‌రెడ్డి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. వికసిత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార అండ్ అజీవిక మిషన్ (వీబీ జీ రామ్ జీ) పేరుతో తీసుకొచ్చిన కొత్త చట్టం గ్రామీణ వ్యవస్థకు శాపంగా మారిందని ధ్వజమెత్తారు. గతంలో ఉన్న వంద రోజుల పని హక్కును తొలగించి కేంద్రం బడ్జెట్ కేటాయింపులపైనే పని ఆధారపడేలా మార్చారని ఆయన ఆరోపించారు. గతంలో ఎక్కడైనా పన కోరే వెసులుబాటు ఉండగా ఇప్పుడు కేంద్రం ఎంపిక చేసిన పేంచాయతీల్లోనే పని చేయాలనే నిబంధన విధించడం సరికాదన్నారు. ముఖ్యంగా వ్యవసాయ సీజన్లో 60 రోజుల పాటు పనులపై నిషేదం విధించడం వలన కూలీలు తక్కువ వేతనానికే ఇతర పనులకు వెళ్లాల్సిన దుస్తితి ఎప్పడిందని ఆవేధన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్దంగా గ్రామ పంచాయతీలకు లభించిన పాలనా హక్కులను కేంద్రం లాగేసుకుంటోందని తక్షణమే విబి జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి పాత ఉపాధి హామిని పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి, డిసిసిఅధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, జనగామ నియోజకవర్గ ఇంఛార్జీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, కంచె రాములు, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, లింగాల నర్సిరెడ్డి, బనుక శివరాజ్ యాదవ్, బడికె ఇందిర, ఆర్‌టిసి మెంబర్ అభిగౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నూతన విత్తన చట్టాన్ని ఉపసంహరించాలి

ఎఐకెఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వల్లెపు ఉపేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** రైతులకు హాని కలిగించి విత్తన వ్యాపారులకు పెట్టుబడుదారులకు మేలుచేసే కేంద్ర నూతన విత్తన చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని అఖిలభారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వల్ల ఉపేంధర్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు యూరియా అందకుండా ఇబ్బందులకు గురిచేసే ఆన్ లైన్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. సోమవారం అఖిలభారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వేయి స్తంభాల గుడి నుండి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ చేసి కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. రైతులకు సరిపడా విత్తనాలు ఎరువులు రుణాలు అందించకుండా కృత్తిమ కొరత సృష్టిస్తూ కుంటి సాకులతో అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని యూరియా సబ్సిడీ ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నారని అందులో భాగంగానే యూరియా కోసం ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని తీసుకు వచ్చారని దాంతో కౌలు రైతులు ఇతర రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యూరియా దొరకకా పంటల దిగుబడి తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ కె ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంసా రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నీల రవీందర్, కర్ర సీతారామరెడ్డి, కూతురు ఇంద్రారెడ్డి, ఏఐసిటియు జిల్లా కార్యదర్శి మొగిలి శ్రీనివాస రావు, ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి రైతు సంఘం సభ్యులు మహేష్,భూక్య లింగయ్య పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గణతంత్ర వేడుకలు





### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/వరంగల్:** 77వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ ఖుష్ మహల్ మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి వివరించారు. ఈ సందర్భం గా ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ అధికారులు ఉద్యోగులకు, స్వచ్ఛంద సంస్థలకు జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ అంకిత్ కుమార్‌లతో కలిసి ప్రశంస పత్రాలను అందజేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి నృత్యాలు, పాటలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తదితర శాఖల శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటుచేసిన ప్రదర్శన శాలలను కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగర మేయర్ శ్రీ మతి గుండు సుధారాణి, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, డిసిపి అంకిత్ కుమార్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సా రయ్య, ప్రజాప్రతినిధులు, కార్పొరేట ర్లు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి సీతక్క జాతీయ జెండా ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ములుగు:** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లాలోని ఎంఎల్‌ఏ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క జాతీయ జెండా ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలందరికి 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి మల్లడి రాంరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, పంచాయతీరాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి చాంద్ పాషా, మేడారం ట్రస్టు బోర్డు డైరెక్టర్ గుంటోజు పావని, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు సీనియర్ నాయకులు యూత్ నాయకులు, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతరాలు లేని సమాజ నిర్మాణం కోసం సిపిఐ పోరాటం: సుధాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** అంతరాలు లేని సమాజ నిర్మాణమే సిపిఐ ధ్యేయమని సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి గురిజపెల్లి సుధాకర్ రెడ్డి అన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఏఐటియుసి కొమురయ్య భవన్‌లో 77 వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి సొతుకు ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సుధాకర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. అంతరాలు లేని సమాజనిర్మాణం కోసం కమ్యూనిస్టులు అనేక పోరాటాలు నిర్వహిస్తున్నారని, ప్రతి పేద వాడికి సంక్షేమ ఫలాలు అందినప్పుడే నిజమైన ప్రజాస్వామ్య, గణతంత్రదినం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజ్ సతీష్, శ్రీనివాస్, జోసఫ్, శ్రీకాంత్ పాల్గోన్నారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవం



**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించినారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ పశ్చిమ శాసనసభ్యుల నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్.నాగరాజు, బస్వరాజ్ సారయ్య, బొడ్డిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**సిపిఐ జిల్లా కార్యాలయంలో గణతంత్ర వేడుకలు**

77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యాలయం బాలసముద్రంలో త్రివర్ణ పతాకాన్ని సీపీఐ మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకటరాజం, రవి, రాజు, గుంటి రాజేందర్, రోహిత్, రాము, అనిల్, సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, జనగామ ఆర్టీసి డిపోలో సేఫ్టీ వార్డెన్‌గా పనిచేస్తున్న అశ్వరావుపల్లి గ్రామానికి చెందిన కుర్ర సురేందర్, వెలుగు కార్యాలయంలో కమ్యూనిటీ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న భాగ్యలక్ష్మి ఉత్తమ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించి సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మి నీ స్టేడియంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను వారు అందుకున్నారు.

## కెటిపిపిలో ఎఐటియుసి ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** కాకతీయ థర్మల్ పవర్ కార్పోరేషన్ చెల్పూర్‌లో ఎఐటియుసి హెచ్ 64 లో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఎఐటియుసి రీజనల్ అధ్యక్షుడు కోల శ్యామ్ ఆధ్వర్యంలో ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు అల్లం ఓదేలు జాతీయ జండా ఆవిశ్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేక కార్మిక వ్యతిరేక, నాలుగు లేబర్‌కోడ్‌లను కేంద్రం విరమించుకోవాలని అన్నారు. లేబర్ కోడ్లు రాజ్యాంగ సమాఖ్య విధానానికి వ్యతిరేకమని రాష్ట్రాల ఆమోదం లేకుండా చట్టసభల్లో చర్చలు లేకుండా చట్టాలు చేయడం అన్యాయమని అన్నారు. కార్మికుల కోసం రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వాలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్రుపాధ్యక్షుడు కుంట మహేందర్, నాగావత్ రాజు నాయక్, పెద్దపెల్లి రవి, రిజినల్ కార్యదర్శి గోపి రెడ్డి కిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మారావు, ట్రెజరర్ బొమ్మకంటి పవన్‌కుమార్, జనగాం అనూష, ఓరుగంటి రాజు, గూడెపు సుదాకర్, చిట్టెపు అశోక్, సొల్లేటి సందీప్, పిప్పాల శ్రీపాల్, మేకల రాజ్ కుమార్, బానోత్ నర్సింహ, కొఉలగూరి చిరంజీవి, రాజేష్, బండి రాజు, కొప్పుల రవి, ఎండి సమీర్, అల్లం వేణు, పొట్ల గోపి, కీర్తి రాజు, బానోత్ వెంకన్న, అన్నం కొమురయ్య, దూడె రవిందర్, సీతారాముల రాముల, శంకర్, భూమయ్య, ముబారక్, శ్రీనివాస్, రాజు, చందర్, లక్ష్మ య్య, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్ని అంటిన గణతంత్ర దినోత్సవ వేడుకలు



### పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ స్నేహ శబరీష్

**ప్రజాపక్షం/హనుమకొండ:** 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు హనుమకొండలో సోమవారం ఘనంగా జరిగాయి. హనుమకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్ లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధులను పూల మాలలు, శాలువాలతో కలెక్టర్ ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భం గా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆయా స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన వస్తువులను గురించి సంబంధిత శాఖల అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, గుండు సుధారాణి, వెంకట్రాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ వైవి. గణేష్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# రెపరెపలాడిన మువ్వెన్నెల జెండా



### జాతీయ పతాకాన్ని ఎగురవేసిన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ కె.అనిల్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి విజయసారథి జాతీయ జండా ఎగురవేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి డా.శబరీష్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

## ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన గొప్ప రాజ్యాంగం: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్:** దేశంలోని ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన గొప్ప రాజ్యాంగం మన రాజ్యాంగమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో రాంబాబు, శిరీష్‌రెడ్డి, చిల్పూర్ శ్రీధర్‌రావు,నరేందర్‌రెడ్డి, లత శంకర్, వెంకటయ్య, సారంగపాణి, మహ్మద్ యాకూబ్‌పాషా, ఏదునూరి రమేశ్, డాక్టర్ కిషన్, రాజు, గన్ను నర్సింహులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. తూర్పు రామాలయంలో గ్రామపంచాయతీల వద్ద త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. ఆర్డీవో కార్యాలయంలో, ఏసీపీ, సీఐ, మున్సిపల్, ఎక్సైజ్, పోలీస్ స్టేషన్, వ్యవసాయ మార్కెట్, డీసీసీ బ్యాంకు, మోడల్ కాలనీ, తిరుమలనాథ కాలనీ, బస్టాండ్, రైల్వే స్టేషన్, ఆటో యూనియన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు.

# మహనీయుల త్యాగఫలమే గణతంత్ర దినం

### కలెక్టర్ రాహూల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ఎందరో మహనీయుల త్యాగఫలమే నేటి ఈ గణతంత్ర దినం అని,జిల్లా అభివృద్ధికి అధికారులు కలిసి కట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహూల్ శర్మ అన్నారు. సోమ వారం జిల్లా కేంద్రంలో డా. బిఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో నిర్వహించిన 77 వ గణతంత్ర దినోత్సవ వేడుక లకు ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ హజరైయ్యారు. ఈ సందర్భంగా పోలీలుసులు,సాయుధ ధళాలతో ఎన్‌సిసి గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవష్కరించారు. ముందుగా ప్రతి ఒక్కరికి జిల్లా కలెక్టర్ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కాటారం సబ్ కలెక్టర్ మాయంక్ సింగ్, గ్రం ధాల సంస్థ చైర్మన్ కోట రాజబాబు, అధికారులు పాల్గోన్నారు.

## అభివృద్ధి సంక్షేమమే ముఖ్యం: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ:** అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. సంక్షేమ పథకాలు గడప, గడపకు చేరే విధంగా జిల్లాలో అధికారులు కృషి చేస్తున్నారన్నారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకులు సోమవారం జిల్లాలో ఘనంగా జరిగాయి. జనగామ పట్టణంలోని మిని స్టేడియంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మువ్వెన్నెల జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అనేక మంది త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్దించగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సారధ్యంలో రచించిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు బెన్షాలోమ్, పింకేషన్‌కుమార్, డిసిపి రాజమహేంద్రనాయక్, ఎసిపి పండరి చేతన్, ఆర్‌డిఓ గోపిరాం, వెంకన్న, జిల్లా పరిషత్ సిఈఓతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు అన్ని శాఖా కార్యాలయాల వద్ద మువ్వెన్నెల జెండాను ఎగరవేశారు.

## ప్రజలకు చేరువగా ప్రజా ప్రభుత్వం



**ప్రజాపక్షం/పరకాల :** తెలంగాణలో ప్రజలకు చేరువగా ప్రభుత్వం అన్ని రకాల అవసరాలను తీర్చుతుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పరకాల పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో ప్రజల అవసరాలను గుర్తించి తీర్చే ప్రభుత్వం ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంపూర్ణ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని అన్నారు. పరకాల, నడికూడ మండలాలలోని వివిధ గ్రామాలలో ఆ గ్రామాల సర్పంచులు మువ్వన్నెల జెండాలను ఎగరవేశారు. పరకాల పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ సతీష్ బాబు, పరకాల పోలీస్ స్టేషన్లో సీఐ క్రాంతి కుమార్ జాతీయ జెండాను ఎగరవేశారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
మంగళవారం
27-01-2026
www.prajapaksham.in

"పద్మ అవార్డు గ్రహీతలందరికీ మెగాస్టార్ చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా పోస్ట్ ద్వారా ఆయన అభినందనలు తెలియజేశారు. విశిష్ట వ్యక్తులను సత్కరించడం చాలా ఆనందాన్ని కలిగిస్తుంది. ఎంతో సంతోషంగా ఉంది అని పేర్కొన్నారు."

రీల్


## ఆల్ టైం ఇండస్ట్రీ హిట్ సెలబ్రేషన్‌లో చిరంజీవి



తనకు గతవైభావాన్ని తీసుకొచ్చిన తెలుగు ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతాజ్ఞతలు చెప్పుకుంటున్నానని చిరంజీవి అన్నారు. మన శంకర వర ప్రసాద్ గారు సినిమా ఆల్ టైం ఇండస్ట్రీ హిట్ (రీజనల్ ఫిల్మస్) సెలబ్రేషన్ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సెలబ్రేషన్స్‌లో చిరంజీవి మాట్లాడుతూ ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చి గత వైభవాన్ని మళ్లీ పునరావృతం చేసిన తెలుగు ప్రేక్షకులందరికీ మనస్ఫూర్తిగా శిరస్సు వంచి ధ న్యవాదాలు తెలియజేస్తున్నాను. సక్సెస్ ఎప్పుడూ కూడా బోర్ కొట్టదు. మనం ప్రతిరోజు తినే అన్నం కూర మనకు ఎలా అయితే బోర్ కొట్టవో విజయం ఇచ్చే ఉత్సాహం ఎప్పుడూ కూడా అద్భుతంగా ఉంటుంది. సీనియారిటీతో మెచ్యూరిటీ రావడంతో ఒక్కొక్కలా స్పందిస్తాం తప్పితే మీరందరూ ఈ విజయాన్ని ఎంతలా సెలబ్రేట్ చేసుకుంటున్నారు అంతకంత మనసులో నేను ఆస్వాదిస్తున్నాను. ప్రజల్లోకి వెళ్ళండి వాళ్లతో ఇంట్రాక్ట్ అవ్వండి ప్రేక్షకులు ఇచ్చే కిక్కు వేరే ఉంటుందని అనిల్, సాహుతో చెప్పాను. వాళ్ళు ఇచ్చే ఉత్సాహం భవిష్యత్తులో చేసే సినిమాలకి ఒక ఇంధనం లాగా పనిచేస్తుంది. ఇలాంటి ప్రేమని నేను ఎన్నోసార్లు అనుభవించాను. అ లాంటి ఉత్సాహం చాలా సంవత్సరాల తర్వాత పునరావృతం కావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఖైదీ 150, వాల్తేర్ వీరయ్య తర్వాత ఈ మధ్యకాలంలో అంత ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేసిన సినిమా మన శంకర వరప్రసాద్. షూటింగ్ చివరి రోజు చాలా ఎమోషనల్ అయ్యాను. ఇది జీవితంలో మర్చిపోలేని సంక్రాంతి. డైరెక్టర్ అనిల్‌కి థాంక్యూ. ఆయన టీమ్ అందరికీ కంగ్రాచ్యులేషన్స్. ఈ సినిమాకి పని చేసిన మిగతా టెక్నీషియన్స్ అందరికీ కంగ్రాజులేషన్స్. ఇలాంటి విజయాలు మరెన్నో రావాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ కె రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఈ విజయం సుస్మిత సాహుపై బాధ్యతని మరింత పెంచింది. చిరంజీవి, అల్లు రామలింగయ్య మేము అందరం చిన్నప్పటి నుంచి ఒక కుటుంబం లాగా పెరిగాము. స్వర్గీయ ఎన్టీ రామారావుతో 12 సినిమాలు చేస్తే చిరంజీవితో 14 సినిమాలు చేశాను. చిరంజీవి అనిల్‌తో సినిమా చేస్తే బాగుంటుందని ఒక విత్తనాన్ని నాటాను. అది ఆ సినిమా ఈరోజు మహా వృక్షంగా మారింది. ఈ సినిమాలో వెంకటేష్ కూడా చివరిలో జాయిన్ అవ్వడం దుమ్ము దులిపేసింది. ఇద్దరు కలిసి పోటీ పడి చేశారు. . 30 ఏళ్ల క్రితం ఎలా డాన్స్ చేశారో ఇప్పటికి కూడా అదే గ్రేస్‌తో చేశారు. సంక్రాంతి సమయానికి ఇండస్ట్రీ చాలా డల్‌గా ఉంది. చిరంజీవి సంజీవని తీసుకొచ్చి మొత్తం ఇండస్ట్రీని బతికించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ రావిపూడి, భీమ్స్, నిర్మాత సాహు గారపాటి, నిర్మాత సు స్మిత కొణిదెల, డైరెక్టర్ వివి వినాయక్, నిర్మాత దిల్ రాజు, ప్రొడ్యూసర్ సుప్రియఆర్ డైరెక్టర్ ప్రకాష్, గేయ రచయితలు కాసర్ల శ్యామ్ , అనంత శ్రీరామ్ , భాస్కర్ భట్ల పాల్గొన్నారు.

## ఇరుముడి ఫస్ట్ లుక్ రిలీజ్

మాస్ మహారాజా రవితేజ తన 77వ చిత్రం కోసం దర్శకుడు శివ నిర్వాణతో జతకట్టారు. ఈ చిత్రాన్ని ప్రముఖ పాన్‌ఇండియా బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. రవితేజ పుట్టినరోజును సందర్భంగా ఈ చిత్రం టైటిల్, అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు.ఈ చిత్రానికి 'ఇరుముడి' అనే టైటిల్ పెట్టారు. ఈ టైటిల్ ఆధ్యాత్మిక ప్రాముఖ్యతతో అయ్యప్ప స్వామి దీక్షను సూచిస్తోంది. ఈ ఫస్ట్ లుక్‌లో రవితేజ సాంప్రదాయ అయ్యప్ప మాల దుస్తుల ధరించిన ఆధ్యాత్మిక అవతార్‌లో కనిపించారు. భక్తులతో నిండిన వేడుక ఉత్సాహంతో, గొప్ప ఆనందోత్సాహాలతో క నిపిస్తున్నారు. . రవి తేజ పాపని ఎత్తుకుని చిరునవ్వుతో కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రవితేజ తన ఆనందాన్ని షేర్ చేశారు జీవితంలో సరైన సమయంలో కొన్ని కథలు మనల్ని ఎంచుకుంటాయి. అలాంటి ఒక కథలో మళ్ళీ భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నాను, నమ్మకమే మార్గదర్శకంగా సాగుతున్నాను. దర్శకుడు శివ తో కలిసి ఇరుముడి అనే ఈ కొత్త ప్రయాణాన్నిప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు .మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణ సంస్థ, పుట్టినరోజు శుభాకాంక్షలు తె లుపుతూ.ఇరుముడి 'ప్రతి భావోద్వేగం ఒక వేడుకే' మాస్ మహారాజా రవి తేజ కు పుట్టినరోజు శుభాకాంక్షలు అయ్య ప్ప స్వామి ఆశీస్సులతో ప్రారంభమవుతుంది అని పేర్కొన్నారు. దర్శకుడు శివ నిర్వాణ పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను రూపొందించారు.ప్రియా భవాని శంకర్ కథానాయికగా నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కుమార్తె పాత్రను పోషిస్తోంది. సాయి కుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర,స్వాసిక కీలక పాత్రల్లో నటిస్తున్నారు.విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్, ప్రవీణ్ పూడి ఎడిటర్. శివ ని ర్వాణ కథ, స్క్రీన్‌ప్లే సంభాషణలు రా శారు, నరేష్ బాబు పి స్క్రిప్ట్ కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తున్నారు. ఇరుముడి షూ టింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోం ది.నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రానికి నిర్మాతలు.



## జాతీయ అవార్డు గ్రహీతతో మోహన్ లాల్ చిత్రం

మోహన్‌లాల్ కథానాయకుడిగా శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై నిర్మాత గోకులం గోపాలన్ నిర్మిస్తున్న కొత్త చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. జాతీయ అవార్డు గెలుచుకున్న తన తొలి చిత్రం 'మెప్పాడియన్'తో బలమైన ముద్ర వేసిన విష్ణు మోహన్ ఈ చిత్రానికి కథ అందించి దర్శకత్వం వహించనున్నారు. భారీ స్థాయిలో నిర్మితమవుతున్న ఎల్ 367, శ్రీ గోకులం మూవీస్ చరిత్రలోనే బిగ్గెస్ట్ మూవీ కానుంది. ఈ ప్రాజెక్టుకు బైజు గోపాలన్, వి సి ప్రవీణ్ సహ నిర్మాతలుగా వ్యవహరించనుండగా, కృష్ణమూర్తి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా ఉన్నారు.భారీ కాన్వాస్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో



ఫారిన్, బాలీవుడ్ ప్రముఖ నటీనటులు, అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు కలిసి పనిచేయనున్నారు. చిత్ర బృందం త్వరలోనే షూటింగ్ ప్రారంభించనుంది. నటీనటులు, సాంకేతిక నిపుణుల గురించిన మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తారుప్రస్తుతం శ్రీ గోకులం మూవీస్ నిర్మాణంలో సురేష్ గోపి నటించిన ఒట్టకొంబన్, జయరామ్‌కాళిదాస్ జయరామ్ ఆశకల్ ఆయిరం, జయసూర్య నటించిన కథనార్, నివిన్ పౌలీబి ఉన్నికృష్ణన్ చిత్రం, ఎస్ జె సూర్య దర్శకత్వం వహించిన కిల్లర్ వంటి అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ జాబితాలో ఎల్ 367 కూడా చేరడంతో ఈ బ్యానర్ మలయాళ సినిమా రంగంలో ఒక శక్తివంతమైన నిర్మాణ సంస్థగా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.

## సీతారామశాస్త్రి కాంస్య విగ్రహావిష్కరణ

ప్రముఖ సినీ గేయ రచయిత దివంగత సిరివెన్నెల సీతారామశాస్త్రి కాంస్య విగ్రహాన్ని దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఆవిష్కరించారు.అనకాపల్లి గాంధీనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర ఈ విగ్రహాన్ని కుటుంబసభ్యులు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహాయంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్ మాట్లాడుతూ అనకాపల్లి సిరి వెన్నెల వంటి వారి ఎందరికో పుట్టినిల్లు అన్నారు. మహనీయుల చరిత్ర తర్వాత తరాల వారికి తెలియాలన్న, స్ఫూర్తి పొందాలన్నా ఇలాంటి విగ్రహాలు ఏర్పాటు అవసరమన్నారు. ఏ మనిషిని అయినా తన ఆలోచనలే ఉన్నత స్థితికి తీసుకెళ్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## పాత్రల ఎంపికలో జాగ్రత్త తీసుకుంటా



ఇటీవల విడుదలైన 'దండోరా' లోని తన పాత్రకు చాలా మంది పేరు వచ్చిందని, అలాగే తన నటనకు కూడా మంచి గుర్తింపు లభించిందని హీరో నవదీప్ అన్నారు. ఈ పాత్ర పాత్ర ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమ నటనలలో ఒకటిగా ప్రశంసలు అందుకుంటోందని చెప్పారు.ఈ పాత్ర ద్వారా నటుడు కనిపించకుండా, పాత్ర మాత్రమే ప్రేక్షకుల ముందు నిలిచిందని అన్నారు. ఇప్పటివరకు చేసిన సినిమాలు ఒక ఎత్తు ఇక నుంచి సెలక్ట్ చేసుకోబోయే సినిమాలు ఒక ఎత్తు అని అన్నారు. రాబోయే రోజుల్లో పాత్రల ఎంపిక పై తగిన జాగ్రత్తలు తీసుకుంటానని చెప్పారు. పాత్రలు, కథ బలంగా ఉన్నప్పుడే నటుడికి ఎలివేషన్ వస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో చేసే అన్ని పాత్రలను చాలా జాగ్రత్తగా సెలక్ట్ చేసుకుంటానని నవదీప్ పేర్కొన్నారు.



## సంతోషంగా ఉంది: రాజేంద్రప్రసాద్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల్లో నటుడు రాజేంద్ర ప్రసాద్‌కు చోటు దక్కడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నా జీవితంలో ఎంతో సంతోషకరమైన రోజు. భారత ప్రభుత్వం నాకు పద్మశ్రీ అవార్డు ప్రకటించిన విషయం తెలిసినప్పటి నుంచి నా కళ్ళు ఆనందంతో నిండిపోయాయి. ఒక నటుణ్ని గుర్తించి, ఇంతటి గొప్ప గౌరవాన్ని అందించిన భారత ప్రభుత్వానికి నా శిరసు వంచి నమస్కరిస్తున్నాను. నా పేరును ఈ పురస్కారానికి సిఫారసు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, పెద్దలందరికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. కానీ నిజం చెప్పాలంటే ఈ అవార్డు నాది కాదు...మీది. నలభై ఎనిమిదేళ్లుగా నన్ను ఒక నటుడిగా మాత్రమే కాకుండా మీ ఇంట్లో ఒక మనిషిగా, మీలో ఒకడిగా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు. నేను నవ్వించినా, ఏడిపించిన మా రాజేంద్ర ప్రసాద్ అని మీరు చూపించిన ఆప్యాయత నాకు దక్కిన నిజమైన అదృష్టం. ఆ ప్రేమే ఈ రోజు నను ఇక్కడి దాకా నడిపించింది. ఆంధ్ర, తెలంగాణ ప్రజలు నన్ను సొంత బిడ్డల్లాగా ఆదరించారు. మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను అని రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.

## ఓ..సుకుమారిలో యాదగిరిగా తిరువీర్



యంగ్ హీరో తిరువీర్, హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ జంటగా వస్తున్న తాజా చిత్రం నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్‌లో రూపొందుతన్న చిత్రమిది. ఇప్పటికే దామిని పాత్రలో ఐశ్వర్య రాజేష్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన నిర్మాతలు ఇప్పుడు తిరు వీర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.ఫస్ట్ లుక్‌లో తిరు వీర్ రగ్గడ్, మాస్ విలేజ్ క్యారెక్టర్‌గా యాదగిరిగా పరిచయమయ్యారు. విలేజ్‌లో నడుచుకుంటూ వస్తున్న ఆయన లుక్ వెంటనే అటెన్షన్ గ్రాబ్ చేస్తుంది. స్లీవ్‌లెస్ బనియన్, కట్టుకున్న లుంగీ, భుజాలపై వేసుకున్న తువ్వాలు మొత్తంగా ఒక ఎర్తీ, అన్‌ఫిల్టర్డ్ ఫీల్‌ను క్యాప్చర్ చేశాయి. రజాకార్, పోలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, క చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వర ప్రసాద్ ఎడిటర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## రైతుల ట్రాక్టర్ ర్యాలీలు

(మొదటి పేజీ తరువాయి)

ట్రాక్టర్ మార్చ్ నిర్వహించారు. ఇది భంగలలోని గ్రెయిన్ మార్కెట్ నుండి ప్రారంభమై భంగల చుంగి, మాతా రాణి చౌక్, షుగర్ మిల్లు, ఎస్‌డిఎం కార్యాలయం గుండా కొనసాగి తిరిగి ప్రారంభ స్థానానికి చేరుకుంది. ముకేరియన్ కమిటీ యూనిట్ అధ్యక్షుడు అవతార్ సింగ్ బాబీ ఈ మార్చ్‌కు నాయకత్వం వహించారు. హోషియార్‌పూర్‌లోని దసుయా వద్ద, ట్రాక్టర్లపై రైతులు వెర్కా చౌక్, ఎస్‌డిఎం చౌక్, గ్రెయిన్ మార్కెట్, చుంగి చౌక్, బాలగన్ చౌక్ గుండా ర్యాలీ నిర్వహించి మియాని రోడ్డులోని బాస్రా హాస్పిటల్ సమీపంలో ముగించారు. అయితే గర్డీవాలా వద్ద, రైతులు బస్టాండ్, సర్హాలా మోర్ గుండా బహ్లో గ్రామంలోని గురు ఆస్రా ఘర్‌కు ర్యాలీ చేశారు. టాండా వద్ద కూడా ఇలాంటి ప్రదర్శన నిర్వహించారు. అక్కడ దోబా కిసాన్ కమిటీ అధ్యక్షుడు జంగ్వీర్ సింగ్ చౌహాన్ నాయకత్వంలో 60కి పైగా ట్రాక్టర్లపై రైతులు కవాతు నిర్వహించారు. తాండా–ఉర్మూర్ వద్ద రైతులను ఉద్దేశించి చౌహాన్, కమిటీ ప్రధాన కార్యదర్శి పృథిపాల్ సింగ్ గుర్దై మాట్లాడుతూ కేంద్ర రైతు వ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా విమర్శించారు. సహకార సంస్థల ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఎరువుల అధిక ధరలకు వ్యతిరేకంగా కూడా వారు హెచ్చరించారు. తప్పు చేసిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోగాలో, ధరంకోట్ ప్రాంతంలోనూ ర్యాలీ జరిగింది. అందులో భారతి కిసాన్ యూనియన్ (తోటేవాల్) నుండి సుఖ్ గిల్, హింద్ కిసాన్ సభ నుండి సూరత్ సింగ్, బికెయు (రాజేవాల్) నుండి సుఖ్విందర్ సింగ్ బ్రహ్మకే, బికెయు (పంజాబ్) నుండి మన్దీప్ సింగ్ పాల్గొన్నారు. ట్రాక్టర్ మార్చ్‌లు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ముగిశాయని అధికారులు తెలిపారు.

## చైనా మాంజా (మొదటి పేజీ తరువాయి)

మాంజా తగిలి పలువురు తీవ్రగాయాల పాలుకాగా, మరికొందరు మరణించిన విషయం తెలిసిందే. పోలీసులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా, ప్రజల్లో మార్పు రావడం లేదని, కొందరి నిర్లక్ష్యం మూలంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చైనా మాంజా సరఫరాపై నిఘా పెట్టామని, దానిని ఉపయోగించిన వారిపై కూడా కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు మరోసారి స్పష్టం చేశారు.




## ట్రెజరీల ద్వారా వేతనాలను చెల్లించాలి

ఎస్‌టియు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో మోడల్ స్కూల్స్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ట్రెజరీల ద్వారా వేతనాలను చెల్లించాలని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, మెడికల్ రియంబర్స్‌మెంట్ సౌకర్యాన్ని కల్పించాలని, మరణించిన ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. హైదరాబాద్, కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో ఏర్పాటు చేసిన 'మోడల్ స్కూల్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోడల్ స్కూల్స్ ఆవిర్భావం నుండి ఉపాధ్యాయులు అనేక సమస్యలతో ఇబ్బంది పడు తున్నారని, ఇటీవల బదిలీలు మినహా ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని చెప్పారు. సకాలంలో వేతనాలు కూడా అందడం లేదని, ఆంధ్రప్రదేశ్ తరహా 010 హెడ్ కింద ట్రెజరీల ద్వారా వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు వెయ్యి ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే ప్రత్యేక డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రిన్సిపల్ పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. 2019 సంవత్సరంలో ఎస్‌టియు టిఎస్‌కు అనుబంధంగా ఈ సంఘాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, మోడల్ స్కూల్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. విఠల్, బత్తిని సత్యనారాయణ గౌడ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

## సమ్మె (మొదటి పేజీ తరువాయి)

బ్యాంకులు, వరుసగా మూడో రోజు కూడా మూతపడే అవకాశం ఉంది. 'ఇచ్చిపుచ్చుకునే రీతిలో విస్తృత చర్చలు జరిపినప్పటికీ, మా డిమాండ్‌పై ఎలాంటి హామీ లభించలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మెకు వెళుతున్నాం' అని యుఎఫ్‌బియు అనుబంధ ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ) ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం పిటిఐకి తెలిపారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఎఐబిఒసి) ప్రధాన కార్యదర్శి రూపమ్ రాయ్ మాట్లాడుతూ, వారానికి ఐదు రోజుల పని నిర్ణయాన్ని 2024 మార్చిలో జీతాల సవరణ ఒప్పందం సందర్భంగా పేర్కొన్నప్పటికీ, ఇంత వరకూ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేయడం వల్లే సమ్మె పరిస్థితులు తలెత్తాయని పేర్కొన్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు అదనంగా 40 నిమిషాలు పనిచేయడానికి తాము అంగీకరించినందున, బ్యాంకింగ్ రంగానికి పనిగంటల నష్టం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు యుఎఫ్‌బియులోని మరో భాగస్వామి నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (ఎన్‌సిబిఇ) ప్రధాన కార్యదర్శి ఎల్. చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఈ ఉద్యమం వినియోగదారులకి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. స్థిరమైన, మానవీయమైన, సమర్థవంతమైన బ్యాంకింగ్ వ్యవస్థ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. సమతుల్యమైన కార్మిక బలం ఆర్థిక స్థిరత్వాన్ని బలపరుస్తుందన్నారు. ఇలావుంటే, మంగళవారం సమ్మె కారణంగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి), బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ప్రభుత్వ రంగ బ్యాంకుల శాఖల్లో నగదు జమ, ఉపసంహరణలు, చెక్ క్లియరెన్సులు, ఇతర త్రా పరిపాలనా పనులు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. అయితే, యుపిఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ బ్యాంకింగ్ సేవలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కొన్ని ప్రాంతాల్లో ఏటిఎంలలో నగదు లభ్యతకు స్వల్ప ఇబ్బందులు తలెత్తవచ్చు. ఈ సమ్మెకు సంబంధించిన సమాచారాన్ని ఎస్‌బిఐసహా పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇప్పటికే స్టాక్ ఎక్స్ఛేంజీలకు అందించాయి. లావాదేవీల సమస్య తలెత్తే అవకాశం ఉందని ముందుగానే సూచించాయి. సమ్మె రోజున ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఖాతాదారులకు సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఉన్నతాధికారులు ప్రకటిస్తున్నప్పటికీ, అది సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. వారానికి ఐదు రోజుల పనిపై ఒప్పందం కుదిరి సుమారు రెండు సంవత్సరాలు కావస్తున్నా, ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం ఇంకా నోటిఫికేషన్ ఇవ్వలేదు. ప్రస్తుతం బ్యాంకులు ప్రతి నెలా మొదటి, మూడవ, ఐదవ శనివారాల్లో పనిచేస్తున్న విషయం తెలిసిందే.

# ఎన్‌డిఎ ప్రభుత్వం మొండి వైఖరితో లేబర్ కోడ్‌ల అమలు

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్




ప్రజాపక్షం/హైదరాబాద్: రాజ్యాంగం అమలులోనికి వచ్చిన 1950 జనవరి 26 నుంచి పూర్తిగా అమలు చేసిఉంటే ప్రస్తుతం దేశంలో పేదలు, దారిద్ర్యం, నిరుద్యోగం ఉండేది కాదని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అన్నారు. '77వ గణతంత్ర దినోత్సవం' సందర్భంగా హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను బాల్‌రాజ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలు, ఉద్యమాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, చట్టబద్ధంగా పార్లమెంట్‌లో ఆమోదించని నాలుగు కోడ్‌లను కార్మికవర్గంపై బలవంతంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాపితంగా ఇప్పటికే 27 సార్లు సార్వత్రిక సమ్మెలు చేసినప్పటికీ ఎన్‌డిఎ ప్రభుత్వం మొండి వైఖరితో లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు నోటిఫై చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఫిబ్రవరి12న దేశవ్యాపితంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న రాజ్యాంగంలోని ఆర్టికల్స్‌ను ఇప్పటికే ప్రభుత్వాలు 80 సార్లకు పైగా రాజ్యాంగ సవరణ చేశారని, ప్రస్తుత ఎ న్‌డిఎ ప్రభుత్వం రాజ్యాంగాన్నే మార్చే కుట్ర చేస్తోందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే 1920లో ఎఐటియుసి ఏర్పడిందని, ఒక పక్క బ్రిటీష్ ప్రభుత్వంపైన ఎనలేని పోరాటాలుచేస్తూనే, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం, దోపిడీలేని స్వామ్యవాదం కావాలని పోరాటాలు చేసిందని ఆయన వివరించారు. ఎఐటియుసి ప్రస్తావించిన అనేక అంశాలను డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ నాడు రాజ్యాంగంలో పొందుపర్చారని బాల్‌రాజ్ తెలిపారు. ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా మాట్లాడుతూ జాతీయ జెండాగా కాషాయ జెండాను తీసుకొచ్చి, భారతదేశంలో హిందుత్వ విధానాన్ని,నినాదాన్ని ముందుకు తీసుకుపోయే ప్రయత్నాలను ప్రజాస్వామ్యవాదులు, రాజ్యాంగ పరిరక్షకులు పోరాటాలకు, ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావని మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానంతో ప్రజలకు ఉపయోగపడే రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు ఎన్.కరుణ కుమారి, బి.వెంకశం, నళిని, నెర్లకంటి శ్రీకాంత్, చెట్టుక్రింది శ్రీను, కాశయ్యతో పాటు భవన నిర్మాణ, ఆటో కార్మికులు, విద్యార్థి, యువజన నాయకులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు పాటలు పాడారు.

## రాజ్యాంగం మారిపోయేది!

(మొదటి పేజీ తరువాయి)



నాయకులు నెల్లికంటి శ్రీకాంత్, సబ్బు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందపర్చిన ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సమాఖ్య స్ఫూర్తికి బిజెపి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చి ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో పరిపాలన కొనసాగిస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాలు పూర్తిగా స్వేచ్ఛను కొల్పోయన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన గవర్నర్లు అందుకు భిన్నంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాల మేరకు ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. సమాఖ్య స్ఫూర్తిగా పూర్తిగా విఘాతం కలిగిస్తున్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాల్సిందేనని సిపిఐ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోందని పల్లా వెంకట రెడ్డి గుర్తు చేశారు. మతోన్మాదమే ఏకైక ఎజెండగా బిజెపి పాలన కొనసాగిస్తుండడం గమనించాలని సూచించారు. దేశానికి స్వాంతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచిందని, ఇప్పటివరకు అంతరించిపోవాల్సిన పేదరికం ఇంకా పెరుగుతోందని, పేదల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు వతాస్తు పలకడమే ఇందుకు కారణమన్నారు. రైతులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులకు ప్రగతి కోసం కాకుండా కేవలం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను కాపాడే విధంగా వారికి లక్షల కోట్లు రాయితీలను ఇస్తూ బడ్జెట్ ప్రవేశ పెడుతోందని ఆయన విమర్శించారు. ఈ వ్యవస్థ మారితే తప్ప సమాజంలో సమానత్వం రాదని, ఇందుకు బిజెపిని గద్దె దించడమే మార్గమన్నారు. ప్రపంచంలో యుద్ధ నీడలు కమ్ముకుని పరిస్థితులు పూర్తిగా భయానకంగా మారగా, కేంద్ర ప్రభుత్వం మాత్రం తమకు ఏమి పట్టనట్లుగా తటస్థ వైఖరిని అవలభించడం భారతదేశానికే ప్రమాదకరమని హెచ్చరించారు. గతంలో అలీన విధానం మేరకు గత ప్రభుత్వాలు మన దేశంతో పూర్తి సఖ్యతగా ఉన్న దేశాలకు మద్దతు ఇచ్చేవన్నారు. ఇందుకు భిన్నంగా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ వ్యవహరించడం సరికాదని, ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని నిరుపేదలకు ఉపాధి కల్పిస్తూ వారు సగౌరవంగా బతికేందుకు అవకాశం కల్పించిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడమే కాకుండా ఈ పథకాన్ని నిర్వీర్యం దశల వారీగా ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోందని, ఈ చర్యలను తిప్పికొట్టాలని పల్లా వెంకట రెడ్డి పిలుపునిచ్చారు.

### దేశంలో నెలకొన్న పరిస్థితులపై ప్రతి ఒక్కరూ సమీక్షించుకోవాలి : కె.రామకృష్ణ

77వ గణతంత్రం తర్వాత నేడు ఈ దేశంలో నెలకొన్న పరిస్థితులపై ప్రతి ఒక్కరూ సమీక్షించుకోవాలని కె.రామకృష్ణ కోరారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారత దేశంలో భిన్నత్వంలో ఏకత్వం గల ప్రాంతమని, ఇదే స్ఫూర్తితో రాజ్యాంగంలో పొందపర్చుకున్న ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్య సూర్తిని కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతోందన్నారు. ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ.టి.నరసింహ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రజలందరిని మత విద్వేషాల వైపు మళ్లిస్తూ అరాచక పాలనను కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలందరికి చెందాల్సిన దేశ సంపదను కొందరి చేతుల్లోనే పెడుతోందని విమర్శించారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయమే లక్ష్యంగా రాసుకున్న రాజ్యాంగం ప్రతి ఒక్కరి చేత ఆమోదింపబడినట్లు పొందపర్చబడిందని, అధికారంలో ఎవరు ఉన్నా రాజ్యాంగాన్ని ఆమోదించాల్సిందేనని, అమలు చేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

### గిరి ప్రసాద్ భవన్‌లో జెండా ఆవిష్కరణ

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నాగోల్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌లో జాతీయజెండాను నవచేతన విజ్ఞానసమితి కార్యదర్శి బిఎస్‌ఆర్ మోహన్‌రెడ్డి ఎగురవేశారు. కార్యక్రమంలో విజ్ఞానసమితి జనరల్ మెనేజర్ మధుకర్, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, ప్రజాపక్షం ఎడిటర్ మక్కెన సుబ్బారావు, పత్రిక సిబ్బంది, విజ్ఞాన సమితి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com